# బృహదారణ్యకోపనిషత్

## ఖిల కాండము అధ్యాయము - 5

## ఉపోద్ఘాతము

బృహదారణ్యకోపనిషత్తులో మూడు కాండములు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. మధు కాండము | – ఉపదేశ కాండము | – సిద్ధాంత ప్రధానము |
| 2. ముని కాండము | – ఉపపత్తి కాండము | – తర్క ప్రధానము |
| 3. ఖిల కాండము | – ఉపాసనా కాండము | – ఉపాసనా ప్రధానము |

ఒక్కొక్క కాండములో రెండు అధ్యాయములు ఉంటాయి. మధు బ్రాహ్మణము ఉండటంవల్ల మొదటి కాండమునకు మధుకాండము అనే పేరు వచ్చింది. ఇందులో బోధ ప్రధానంగా ఉంటుంది. అందువల్ల ఉపదేశ కాండము అని కూడా అంటారు.

రెండవ కాండములో రెండు అధ్యాయములలోనూ గురువు యాజ్ఞవల్క్యుడు. అందువల్ల దీన్ని మునికాండము అనీ, బోధ తర్కంద్వారా సాగుతుంది కాబట్టి ఉపపత్తి కాండము అనీ అంటారు.

మూడవ కాండములో కూడా రెండు అధ్యాయములు ఉన్నాయి. వాటిలో ఎక్కువగా కర్మలు, ఉపాసనలు, విలువలు వస్తాయి. ఖిలకు రెండు అర్థాలున్నాయి. అవి – చెప్పకుండా మిగిలిన అంశాలు చెప్పేది, అనేక భిన్న అంశాలను ఒకచోట కలిపేది. దీన్ని ఉపాసనకాండము అని కూడా అంటారు. ఎందుకంటే ఇందులో ఉపాసనలు ఎక్కువగా ఉన్నాయి.

ఇప్పుడు అధ్యాయము ఐదులోకి వెళదాము. ఇది పూర్ణమదః అనే శాంతిపాఠంతో మొదలవుతున్నది. ఈ శాంతిపాఠం ఉపనిషత్తు మొదట్లో లేదు. ఈ ఐదవ అధ్యాయము మొదట్లో ఉంది. శంకరులవారు కూడా దీనికి భాష్యం ఇక్కడ వ్రాశారు. కాని ఇది అద్భుతమైన ధ్యానశ్లోకం కాబట్టి, మనం ఈ ఉపనిషత్తు మొదట్లోనే దీని వివరణ చూశాము. ఇది చాలా ముఖ్యమైన శాంతిమంత్రం కాబట్టి, కొంచెం క్లిష్టతరంగా ఉంటుంది కాబట్టి, దీని వివరణ మళ్ళీ చూద్దాము.

# శాంతిపాఠం

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

**అదః పూర్ణమ్** – అది పూర్ణం. అది అంటే ఆ పరమాత్మ. అదః అక్షరాలా తీసుకుంటే 'ఆ' అని వస్తుంది. 'ఆ' ఎవరు? పరమాత్మ. ఆ పరమాత్మ పూర్ణం అంటే అనంతం.

**ఇదం పూర్ణమ్** – ఇది పూర్ణం. ఇదం అక్షరాలా తీసుకుంటే 'ఈ' అని వస్తుంది. ఈ ఎవరు? జీవాత్మ. అందువల్ల ఇదం పూర్ణం అంటే ఈ జీవాత్మ పూర్ణం. పూర్ణం అంటే అనంతం. ఈ రెండు వాక్యాలనూ కలిపితే కొన్ని ఉపసిద్ధాంతాలు వస్తాయి.

1. **జీవాత్మ, పరమాత్మల ఐక్యం** – పరమాత్మ అనంతం అంటే దేశపరంగా అనంతం, కాలపరంగా అనంతం, వస్తుపరంగా అనంతం అంటే అన్ని విధాలా సర్వవ్యాపకం. జీవాత్మ కూడా అనంతం అన్నాము. కాని నిజానికి అనంతంగా సర్వవ్యాపకంగా ఉన్నది ఒకటే ఉంటుంది. రెండు అనంతాలు అంటే రెండు భిన్నమైనవి సర్వవ్యాపకమైనవి లేవు. రెండు పూర్ణాలు ఉన్నాయి అని చెపితే, అది తర్కవిరుద్ధంగా ఉంటుంది.

దీనికి ఒకటే మార్గం ఉంది. ఏమిటది? ఒకటే అనంతంగా సర్వవ్యాపకంగా ఉంటుంది కాబట్టి; పరమాత్మ అనంతం, జీవాత్మ కూడా అనంతం అంటే, పరమాత్మ, జీవాత్మ ఒకటే అవాలి. పూర్ణమదః పూర్ణమిదం వాక్యం– మహావాక్యం. జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని సూచించే వాక్యం.

2. **లక్ష్యార్థదృష్ట్యా ఐక్యం** – పరమాత్మ అంటే సోపాధిక పరమాత్మ, నిరుపాధిక పరమాత్మ ఉన్నారు. అలాగే జీవాత్మ అంటే కూడా సోపాధిక జీవాత్మ, నిరుపాధిక జీవాత్మ ఉన్నారు. ఇప్పుడు ఐక్యం దేని పరంగా?

| **సోపాధిక జీవాత్మ** | **సోపాధిక పరమాత్మ** |
|---|---|
| స్థూలశరీరం | స్థూలప్రపంచం |
| సూక్ష్మశరీరం | సూక్ష్మప్రపంచం |
| కారణశరీరం | కారణప్రపంచం |
| చిదాభాస | చిదాభాస |
| చిత్ | చిత్ |

సోపాధికంగా చూస్తే జీవాత్మలోనూ, పరమాత్మలోనూ ఐదు అంశాలు ఉంటాయి. సోపాధిక జీవాత్మను వ్యష్టి ఉపాధి అనీ, సోపాధిక పరమాత్మను సమష్టి ఉపాధి అనీ అంటారు. ఉపాధుల పరంగా చూస్తే పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వశ్రేష్ఠుడు అనే గుణాలు ఉన్నాయి. జీవాత్మకు అల్పజ్ఞుడు, అల్పవ్యాపి అనే గుణాలు ఉన్నాయి. జీవాత్మ మూడు శరీరాలు, పరమాత్మ మూడు ప్రపంచాలు చాలా భిన్నంగా ఉన్నాయి.

అవి ప్రతిబింబమాధ్యమాలు. ఆ ప్రతిబింబమాధ్యమాల్లో ప్రతిబింబించబడే చైతన్యంలో కూడా వ్యత్యాసం ఉంటుంది. దాన్ని చిదాభాస అంటారు. రెండింటిలోనూ సమానంగా ఉన్నది చిత్ మాత్రమే. దాన్ని శుద్ధచిత్ అంటారు.

అందువల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి మాట్లాడితే అది ఉపాధి పరంగా కాదు, ఉపాధి లేకుండా శుద్ధచైతన్యపరంగా. అంటే నిరుపాధిక పరమాత్మ, నిరుపాధిక జీవాత్మలు ఒకటే. అంటే దీన్ని లక్ష్యార్థం అంటారు.

**లక్ష్యార్థదృష్ట్యా తత్త్వం పదార్థయోః ఐక్యమ్**

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** - పూర్ణమైన పరమాత్మనుంచి పూర్ణమైన జీవాత్మ ఉద్భవించింది. అంటే ఏమిటి? పరమాత్మనుంచి జీవాత్మ పుట్టింది. ఇంతకు ముందేమో జీవాత్మ, పరమాత్మ ఐక్యం అన్నాము. ఇప్పుడేమో జీవాత్మ పరమాత్మనుంచి పుట్టింది అంటున్నాము. అదెలా సాధ్యం? దీన్నించి ఉపసిద్ధాంతాన్ని చూద్దాము.

**కార్యకారణ సంబంధం** - జీవాత్మ, పరమాత్మనుంచి పుట్టింది అంటే, జీవాత్మ కార్యం, పరమాత్మ కారణం. అందువల్ల ఇద్దరి మధ్యా కార్యకారణ సంబంధం ఉంటుంది. కార్యకారణాల మధ్య ఐక్యం ఎలా ఉంటుంది? అలా అయితే తండ్రీ, కొడుకులు ఒకటే అన్నట్టు ఉంటుంది. అక్కడ ఐక్యం నిరుపాధిక దృష్ట్యా అన్నాము.

అందువల్ల ఇక్కడ భేదం సోపాధికదృష్ట్యా వస్తుంది. కార్యకారణ సంబంధం సోపాధిక దృష్ట్యా వస్తుంది. అంటే సోపాధిక పరమాత్మనుంచి సోపాధిక జీవాత్మ పుట్టింది.

**వాచ్యార్థ దృష్ట్యా తత్త్వం పదార్థయోః కార్యకారణ సంబంధః**

ఎవరైనా జీవ-ఈశ్వరుల మధ్య ఉన్న సంబంధం ఏమిటని అడిగితే, దానికి వెంటనే జవాబు చెప్పకూడదు. ఎదురు ప్రశ్నించాలి. ఏ దృష్ట్యా అని అడగాలి. అనాత్మ దృష్ట్యా కార్యకారణ సంబంధం; ఆత్మ దృష్ట్యా ఐక్య సంబంధం. జీవ-ఈశ్వరుల మధ్య సంబంధం ఈ రెండు దృష్టులనుబట్టి ఉంటుంది. ఇది అర్థం కాకపోతే, మనం అద్వైతాన్ని అర్థం చేసుకోలేము.

శంకరులవారు అద్వైతంమీద ఎన్నో రచనలు చేశారు. వాటిల్లో ధ్యానశ్లోకాల్లో భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. తర్వాతంతా జీవాత్మ -పరమాత్మల ఐక్యం గురించి చెబుతారు. ఉదాహరణకు భజగోవిందంలో ప్రార్థన శ్లోకంలో భేదం ఉంటుంది. తర్వాతంతా అభేదం చూపిస్తారు. అందువల్ల కొందరు శంకరులవారిని సరిగా అర్థంచేసుకోలేదు. శంకరులవారిని అర్థం చేసుకోవాలంటే, మనకు అద్వైతం సరిగా అర్థం అవాలి. పరమాత్మ, జీవాత్మలను రెండు రకాలుగా చూస్తామని; అవి సోపాధిక, నిరుపాధికంగా చూస్తామనీ తెలియాలి. అప్పుడే శంకరులవారు అర్థమవుతారు. లేకపోతే అయోమయంలో పడ్డది ఆయన కాదు, మనం అవుతాము.

అందువల్ల ఇక్కడ సోపాధిక దృష్ట్యా జీవాత్మ-పరమాత్మల మధ్య కార్యకారణ సంబంధం ఉంది.

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** - పూర్ణంలోంచి పూర్ణం తీస్తే పూర్ణమే మిగులుతుంది. పూర్ణస్య అంటే సోపాధిక ఆత్మ. పూర్ణం ఆదాయ అంటే పూర్ణ ఆత్మను తీస్తే, మిగిలేది ఏమిటి?

**పూర్ణమేవ అవశిష్యతే** - పూర్ణం మాత్రమే మిగులుతుంది. దీని ప్రత్యేకత ఏమిటో చూద్దాము. సోపాధిక ఆత్మ

అంటే ఆత్మ+ఉపాధి. ఆత్మ+ఉపాధినుంచి ఆత్మను తీస్తే ఏం మిగలాలి? ఉపాధి మిగలాలి. కాని ఉపనిషత్తు ఏమంటోంది? ఆత్మ ఏవ అవశిష్యతి అంటున్నది. అంటే ఆత్మ మాత్రమే మిగులుతుంది అంటున్నది. అదెలా సాధ్యం? అదెలాగంటే, ఆత్మ లేకుండా ఉపాధికి విడిగా ఉనికి లేదు. ఉపాధి అంటే అనాత్మ. అనాత్మకు ఆత్మ లేకుండా ఉనికి లేదు. అనాత్మకు విడిగా ఉనికి లేదు కాబట్టి అనాత్మ మిథ్య.

రెండు ఉపాధులు ఉన్నాయని చూశాము. అవి – వ్యష్టి ఉపాధి, సమష్టి ఉపాధి. ప్రపంచం సమష్టి ఉపాధి, శరీరం వ్యష్టి ఉపాధి. ఈ రెండింటికీ అధిష్ఠానం ఆత్మ. వాటినుంచి వాటి అధిష్ఠానమైన ఆత్మను తీసేస్తే అవి ఉన్నా, లేనట్టే!

కుండ = మట్టి + నామరూపాలు
కుండ – మట్టి = నామరూపాలు అవాలి.

కాని ఉపనిషత్తు ఏమంటున్నది?

కుండ – మట్టి = మట్టి

అదెలా? నామరూపాలు ఎప్పుడు వస్తాయి? ఒక వస్తువు పుడితే. మట్టినుంచి ఒక వస్తువు పుడితే, దానికి కుండ నామరూపాలు వచ్చాయి. కాని కుండనుంచి మట్టిని తీసేస్తే, కుండ ఆకారం ఉండదు. కుండ ఆకారం లేకపోతే నామరూపాలు దేనికి? ఆ విధంగా నామరూపాలు మిథ్య అవుతాయి; మిథ్యకు విడిగా ఉనికి లేదు కాబట్టి, సత్య అధిష్ఠానం అయిన మట్టే మిగులుతుంది. ఇప్పుడు ఇదే సూత్రాన్ని ఆత్మకు ఉపయోగిస్తే

జగత్తు = ఆత్మ + అనాత్మ
జగత్తు – ఆత్మ = అనాత్మ అవాలి

కాని ఉపనిషత్తు ఏమంటున్నది?

జగత్తు – ఆత్మ = ఆత్మ

అదెలా? ఆత్మ లేకుండా అనాత్మ జగత్తుకు విడిగా ఉనికి లేదు; **జగత్తు మిథ్య,** ఆత్మ లేదా బ్రహ్మ సత్యం. ఇదీ ఈ వాక్యం అర్థం. ఇప్పుడు ఈ శాంతి మంత్రాన్ని మళ్ళీ టూకీగా చూస్తే –

| | |
|---|---|
| **పూర్ణమదః పూర్ణమిదమ్** | **– జీవాత్మ పరమాత్మల ఐక్యం** |
| **పూర్ణాత్ పూర్ణముదచ్యతే** | **– జీవాత్మ పరమాత్మల మధ్య కార్య, కారణ సంబంధం** |
| **పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** | **– బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా** |

దశ ఉపనిషత్తులలో ఈశావాస్యోపనిషత్తును మొదటి ఉపనిషత్తుగా పేర్కొంటారు.

**ఈశకేన కఠప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

అలాగని మొట్టమొదట ఈశావాస్యం నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే మెదడు వేడెక్కిపోతుంది. దానికి కూడా శాంతిపాఠం ఇదే. దీన్ని ఉన్నది ఉన్నట్టుగా చెపితే – అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణంనుంచి పూర్ణం వచ్చింది; పూర్ణంలోంచి పూర్ణం తీస్తే పూర్ణమే మిగులుతుంది. ఇన్ని పూర్ణాలేమిటో అర్థం కాక తల పూర్ణంగా తిరుగుతుంది. నిజానికి ఇది గొప్ప అద్వైత మంత్రం. పైన చూసినట్టుగా వేదాంతసారం అంతా మూడు వాక్యాల్లో వచ్చేసింది. ఇదొక్కటి అర్థం చేసుకుంటే చాలు, వేదాంతాన్నంతా అర్థం చేసుకున్నట్టే.

ఇంత గొప్ప మంత్రాన్ని ఇక్కడ ప్రత్యేకమైన స్థానంలో పెట్టింది ఉపనిషత్తు. మొదటి రెండు కాండములకు ఉపసంహారంగానూ, చివరి కాండమునకు ఉపోద్ఘాతంగానూ పెట్టింది ఈ మంత్రాన్ని.

అంటే రెండు పనులను చేకూరుస్తున్నది. మొదటి రెండు కాండలతో బ్రహ్మవిద్య బోధన ముగిసింది. అందువల్ల ఈ శాంతిమంత్రం మధుకాండము, మునికాండములలో నేర్చుకున్న బ్రహ్మవిద్య సారాంశాన్ని చెబుతున్నది.

రాబోయే కాండములో అనేక ఉపాసనలు వస్తాయని చూశాము. ఉపాసనల లక్ష్యం ఏమిటి? ఉపాసన సాధనచతుష్టయసంపత్తిని ఇస్తుంది. అది సాధకునికి జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇచ్చి, వేదాంతవిచారణకు తీసుకువెళుతుంది. అంటే బ్రహ్మవిద్యకు తీసుకువెళుతుంది. అదే మోక్షాన్నిచ్చే అంతిమ లక్ష్యం.

బ్రహ్మవిద్య అన్ని ఉపాసనలకు అంతిమ లక్ష్యం కాబట్టి పూర్ణమదః మంత్రం ఆ అంతిమ లక్ష్యంయొక్క సారాంశాన్ని వారికి గుర్తు చేస్తున్నది. ఆ విధంగా, ఈ మంత్రం గడపలాగా పని చేస్తున్నది. లక్ష్యం పొందినందుకు కృతజ్ఞత చూపిస్తున్నది; లక్ష్యం చేరటానికి మార్గం చూపిస్తున్నది. ఇంకో విధంగా చెప్పాలంటే, ఈ మంత్రం ఉత్తమ అధికారికి సారాంశం; మధ్యమ, మంద అధికారులకు లక్ష్యం.

## పూర్ణమదః భాష్యం

పూర్ణమదః శాంతి పాఠాన్ని రకరకాలుగా అర్థం చేసుకున్నారు అనేక దార్శనికులు. అందులో ముఖ్యంగా ఉన్నది భర్తృప్రపంచం అనే ఒక భాష్యకారుడు. ఆయన వాదనను **భేదాభేద వాదన** అంటారు. శంకరులవారు ఆయన వాదనని తీసుకుని, ఖండించి అద్వైతమతస్థాపన చేశారు. వాటి సారాంశం చూద్దాము.

ఈ భేదాభేద వాదన విశిష్టాద్వైతానికి చాలా దగ్గరగా ఉంటుంది. విశిష్టాద్వైతానికి గురువు శ్రీరామానుజాచార్యులవారు. శంకరాచార్యులవారి సమయానికి శ్రీరామానుజాచార్యులవారు లేరు. కాని ఇది భేదాభేద వాదానికి దగ్గరగా ఉండటంవల్ల భేదాభేద వాదానికి ఇచ్చిన ఖండనే విశిష్టాద్వైతానికి కూడా సరిపోతుంది.

ఇప్పుడు మనం చూసేది భేదాభేద వాదనతో శంకరులవారి భేటీ. దాని గురువు భర్తృప్రపంచం అని చూశాము కదా. అందువల్ల దీన్ని భర్తృప్రపంచమతం అని కూడా అంటారు. ముందుగా భర్తృప్రపంచం వాదనను చూద్దాము.

**భర్తృప్రపంచ మతం** – భర్తృప్రపంచం తన వాదనను సమర్థించుకోవటానికి రెండు వాదనలు చేస్తాడు. అవి వేద ఏకదేశ ప్రమాణ్య దోషః, ప్రత్యక్షాది అప్రమాణ్యదోషః.

1. **వేద ఏకదేశ ప్రమాణ్యదోషః** – వేదంలో కర్మకాండ, జ్ఞానకాండ అని రెండు ఉంటాయి. వేదంలో ఉన్నాయి కాబట్టి కర్మకాండ కూడా ప్రమాణమే, జ్ఞానకాండ కూడా ప్రమాణమే. కర్మకాండ ద్వైతం గురించి స్పష్టంగా చెబుతుంది. కర్మకాండలో కర్త ఉంటాడు. అతను స్వర్గాదిలోకాలకు వెళ్ళటానికి యజ్ఞాలు చేస్తాడు.

కాని జ్ఞానకాండ అద్వైతాన్ని బోధిస్తుంది.

**ఏకమ్ ఏవ అద్వితీయం బ్రహ్మ**

అంటే అభేదాన్ని సూచిస్తున్నది. అంటే ఏమిటి? వేదం మొత్తాన్ని చూస్తే, వేదం అటు ద్వైతాన్ని, ఇటు అద్వైతాన్ని కూడా బోధిస్తున్నది. కర్మకాండ ద్వైతాన్ని బోధిస్తే, జ్ఞానకాండ అద్వైతాన్ని బోధిస్తుంది.

ఒక వ్యక్తి ముముక్షువు అవాలనుకుంటే, అతను వేదాన్ని పాటించాలి. కాని వేదం ద్వైతం, అద్వైతం – రెండింటినీ బోధిస్తున్నది. వేదం ప్రమాణం అయినప్పుడు అందులో అటు కేవలం ద్వైతాన్నో, ఇటు కేవలం అద్వైతాన్నో పాటిస్తే వేదప్రమాణాన్ని పూర్తిగా స్వీకరించనట్టు అవుతుంది.

అలా ఒక భాగం వేదాన్ని స్వీకరించి, ఇంకొకభాగం వేదాన్ని తిరస్కరిస్తే, ఏకదేశ ప్రమాణ్య దోషం అవుతుంది. ప్రమాణంలో సగమే తీసుకోవటాన్ని **అర్ధజరతీయ న్యాయం** అంటారు. అంటే ఒక వ్యక్తిని, అతను సగం వృద్ధుడు, సగం యువకుడు అన్నట్టు ఉంటుంది. ఆ వ్యక్తి అయితే పూర్తి వృద్ధుడు అవాలి లేదా పూర్తి యువకుడు అవాలి.

అందువల్ల ద్వైతం, అద్వైతం రెండూ తప్పే అంటారు భర్తృప్రపంచం. ద్వైతవాదుల దోషం ఏమిటంటే వారు వేదం చెప్పిన ద్వైతాన్ని తీసుకుని, అద్వైతాన్ని తిరస్కరిస్తున్నారు. అద్వైతవాదులు ఏమో వేదం చెప్పిన అద్వైతాన్ని తీసుకుని, ద్వైతాన్ని తిరస్కరిస్తున్నారు. అప్పుడు అద్వైతవాదులకు కర్మకాండ అప్రమాణ్యం అవుతుంది. ద్వైతమూ కాదంటున్నారు; కర్మకాండా కాదంటున్నారు. అందువల్ల వీరికి వేద ఏకదేశ ప్రమాణ్యదోషం ఉంది అంటారు భర్తృప్రపంచం.

2. **ప్రత్యక్షాది అప్రమాణ్య దోషః** – అద్వైతం మాత్రమే ఉంది అని, ద్వైతాన్ని త్రోసిపుచ్చితే, మొత్తం ప్రత్యక్షప్రమాణాన్నే త్రోసిపుచ్చినట్టు అవుతుంది. ప్రత్యక్షప్రమాణంతో పాటు తక్కిన ప్రమాణాలు కూడా వస్తాయి. అవి అనుమాన ప్రమాణం, అర్థాపత్తి, ఉపమానం, అనుపలబ్ధి. అన్నీ కలిపి ప్రత్యక్షాదిలో వస్తాయి.

జగత్తును మిథ్యగా కొట్టిపారేస్తే, ప్రత్యక్ష ప్రమాణాన్ని కొట్టి పారేసినట్టు కాదా? ప్రత్యక్ష ప్రమాణం జగత్తు ఉందని చూపిస్తున్నది. అది ద్వైతప్రపంచాన్ని స్పష్టంగా చూపిస్తున్నది. అందువల్ల ఉన్న ప్రపంచాన్ని లేదని ఎలా అనగలరు? అలా అంటే అది ప్రత్యక్షాది ప్రమాణాలను అప్రమాణం అన్నట్టు అవుతుంది.

ఒకటేమో వేదాన్ని పూర్తిగా ప్రమాణంగా స్వీకరించకపోవటం, రెండోదేమో తక్కిన ప్రమాణాలను ప్రమాణంగా స్వీకరించక పోవటం.

ఈ రెండు దోషాలు లేని, కొత్త సిద్ధాంతాన్ని నేను చెబుతాను చూడండి అన్నారు భర్తృప్రపంచం. ఏమిటది?

**ద్వైతాద్వైతాత్మకమేకం బ్రహ్మ**

అంటే బ్రహ్మ అటు ద్వైతమూ, ఇటు అద్వైతమూ కూడా. ఇంకో మాటలో చెప్పాలంటే **బ్రహ్మ భేద అభేద ఆత్మకమ్** లేదా నానారసం బ్రహ్మ.

ఈ వాదనలో ఉన్న లాభం ఏమిటి? దానివల్ల ద్వైతాన్ని, అద్వైతాన్ని కూడా స్వీకరించవచ్చు. ద్వైతమూ సత్యమే, అద్వైతమూ సత్యమే. దానివల్ల కర్మకాండా ప్రమాణమే, జ్ఞానకాండా ప్రమాణమే. కాని ద్వైతులు, అద్వైతులు ఒక కంటితోనే చూస్తున్నారు. భర్తృప్రపంచం సిద్ధాంతంవల్ల మొదటి దోషమైన వేద ఏకదేశ ప్రమాణ్యదోషం ఉండదు.

కర్మకాండను స్వీకరించటంవల్ల ప్రత్యక్షాది అప్రమాణ్య దోషం కూడా అంటదు. అందువల్ల భేదాభేద మతమే సరిపోతుంది.

**శంకరులవారి వాదన** – శంకరులు ఈ వాదనను ఖండిస్తూ కొన్ని జవాబులు ఇస్తారు.

**విరుద్ధత్వ దోషః** – భేదాభేద వాదనను స్వీకరించలేము. ఎందుకంటే అది పరస్పర విరుద్ధ భావాలను సూచిస్తున్నది అంటున్నారు శంకరులవారు.

దీనికి ఒక సూత్రం ఉంది. ఒకే వస్తువుకు రెండు విరుద్ధధర్మాలు ఉండవు. వ్యతిరేకత లేని లక్షణాలు ఎన్నైనా ఉండవచ్చు కాని వ్యతిరేకత ఉన్న లక్షణాలు ఉండకూడదు.

ఉదాహరణకు ఒక వ్యక్తి పొడుగ్గా, లావుగా, తెల్లగా ఉన్నాడు అనవచ్చు. కాని ఒక వ్యక్తి పొడుగ్గా, పొట్టిగా ఉన్నాడు అనకూడదు. అవి వ్యతిరేకత ఉన్న లక్షణాలు. అలాగే ఒక వ్యక్తి లావుగా, సన్నగా ఉన్నాడు అనకూడదు; అలాగే ఒక వ్యక్తి తెల్లగా, నల్లగా ఉన్నాడు అనకూడదు. అంటే రెండు విరుద్ధ ధర్మాలు ఒక వస్తువుకు ఉండవు.

**ఏకత్ర విరుద్ధ ధర్మ అసమవేషః**

ఇప్పుడు ఇదే సూత్రాన్ని బ్రహ్మకు ఉపయోగించి చూద్దాము. బ్రహ్మ అద్వైతం అంటే ద్వైతం అనటానికి వీలు లేదు. ద్వైతం అంటే అద్వైతం అనటానికి వీలులేదు. ఎందుకంటే భేదం, అభేదం విరుద్ధ ధర్మాలు. అవి ఒకే వస్తువుకు ఉండవు.

**భర్తృప్రపంచం వాదన** – రెండు విరుద్ధ ధర్మాలు ఒకే వస్తువుకు రెండు సందర్భాలలో ఉండవచ్చు అంటారు భర్తృప్రపంచం. అవి అవస్థాభేదం; దృష్టిభేదం.

1. **అవస్థాభేదం** – దీనికి వృక్షం ఉదాహరణ తీసుకున్నారు భర్తృప్రపంచం. వృక్షం ద్వైతమా, అద్వైతమా? వృక్షం కారణావస్థలో ఉంటే అద్వైతం, కార్యావస్థలో ఉంటే ద్వైతం. విత్తనంగా ఉంటే అందులో భిన్న భాగాలు తెలియవు. అప్పుడు అది అద్వైతం. అదే పెద్ద వృక్షమయితే దాని భిన్నభాగాలను చూడవచ్చు. దాని కాండం, కొమ్మలు, పూవులు, పండ్లు, ఆకులు, అన్నీ చూడవచ్చు. అప్పుడు అది ద్వైతాత్మకం అవుతుంది.

**ఏవమ్ ఏకం వస్తు ఏవ ద్వైతాద్వైతాత్మకం భవతి అవస్థాభేదేన**

దీన్ని అవస్థాభేదేన కాలభేదం అని కూడా అనవచ్చు. ఒక కాలంలో అద్వైతంగా ఉంది, ఇంకొక కాలంలో ద్వైతం అయింది.

2. **దృష్టిభేదం** – మళ్ళీ చెట్టు ఉదాహరణే చూడండి. అది ద్వైతమా, అద్వైతమా? చూసే దృష్టిని బట్టి ఉంటుంది. మొత్తం చెట్టును చూస్తే అది అద్వైతం. ఏకఃవృక్షః. వృక్షంగా చూస్తే అద్వైతం. కాని ఇప్పుడు అదే చెట్టును ఆకులు, కొమ్మలు, పువ్వులుగా చూడండి. ఎన్నో ఆకులు, ఎన్నో పువ్వులు, ఎన్నో కొమ్మలు ఉన్నాయంటారు. చెట్టు ఏకం అయినా కూడా పువ్వుల దృష్ట్యా అది అనేకాత్మకం.

ఒక వ్యక్తిని మనిషిగా చూస్తే అతను ఏకాత్మకం. కాని అతని చేతులను,కాళ్ళను పరిశీలనగా చూస్తే అతను అనేకాత్మకం. అలాగే బ్రహ్మను కూడా పూర్ణంగా చూస్తే ఆయన పెరుమాళ్ అయ్యాడు. అదే బ్రహ్మను లోకాలుగా, కొండలుగా, సముద్రాలుగా చూస్తే అనేకాత్మకం.

**ఏవమ్ ఏకం వస్తు ఏవ ద్వైతాద్వైతాత్మకం భవతి దృష్టిభేదేన**

ఆ విధంగా ఒకే బ్రహ్మను అవస్థాభేదం దృష్ట్యా, దృష్టిభేదం దృష్ట్యా ద్వైతం, అద్వైతం రెండూ అని చెప్పవచ్చు.

**శంకరులవారి జవాబు** – నిజమే, వృక్షపరంగా చూస్తే అది ద్వైతాద్వైతాత్మకం. అవస్థాభేదం, దృష్టిభేదం ప్రకారం చెట్టును అద్వైతమూ అనవచ్చు, ద్వైతమూ అనవచ్చు.

**అవస్థాభేదేన, దృష్టిభేదేన ద్వైతాద్వైతాత్మకం వస్తు**

ఈ సూత్రం చెట్టుకు వర్తిస్తుంది. నిజానికి మనం ఇక్కడ చెట్టు ఉదాహరణ చూస్తున్నాము కాని శంకరులవారి భాష్యంలో ఇదే సిద్ధాంతానికి సముద్ర ఉదాహరణ ఉంటుంది. సముద్రాన్ని ఏకంగా చూస్తే అది సముద్రం; అనేకంగా చూస్తే అందులో నీరు, అలలు, నురుగు, బుడగలు, సుడిగుండాలు ఉంటాయి.

అలా చెట్టు విషయంలో కాని, సముద్రం విషయంలో కాని ద్వైతాద్వైత మతం సంభవం కాని, దీన్ని బ్రహ్మకు ఉపయోగించలేము. దానికి మూడు కారణాలు. బ్రహ్మ నిర్వికారము, నిరవయవము, నిత్యము.

1. **బ్రహ్మ నిర్వికారము** – వృక్షం ఉదాహరణే మళ్ళీ తీసుకుందాము. వృక్షాన్ని వృక్షంగా చూస్తే ద్వైతం; విత్తనంగా చూస్తే అద్వైతం; ఇది అవస్థాభేదం అన్నారు భర్తృప్రపంచం. కాని అవస్థాభేదం ఉన్న వస్తువుకు సవికారం ఉంటుంది.

**సవికారం భవతి అవస్థాభేద వస్తుత్వాత్**

అంటే అవస్థాభేదం ఉంది అంటే ఆ వస్తువు మారుతున్నది; అంటే వికారం చెందుతున్నది. కారణ అవస్థలో విత్తనం అద్వైతం; కార్యావస్థలో చెట్టు ద్వైతం. కాని బ్రహ్మ నిర్వికారం.

2. **బ్రహ్మ నిరవయవము** – రెండవ వాదనలో చెట్టుగా చూస్తే అది అద్వైతం, భాగాలుగా చూస్తే ద్వైతం అన్నారు భర్తృప్రపంచం. ఒక వస్తువుకు అనేక భాగాలు ఉంటే అది ద్వైత అద్వైతకాత్మకం అనవచ్చు. ఉదాహరణకు మనిషి. వ్యక్తిగా చూస్తే ఒక మనిషి; భాగాలుగా చూస్తే కాళ్ళు, చేతులు అంగాలున్నాయి. సముద్రం విషయంలో కూడా ద్వైత అద్వైతం కుదురుతుంది. ఏకంగా చూస్తే సముద్రం; అనేకంగా చూస్తే నీరు, అలలు, నురుగు, బుడగలు ఉంటాయి. ఇవన్నీ సావయవం అంటే వీటికి అవయవాలు లేదా భాగాలు ఉన్నాయి. కాని బ్రహ్మకు భాగాలు లేవు. బ్రహ్మ నిరవయవం.

3. **బ్రహ్మ నిత్యము** – బ్రహ్మ నిర్వికారము, బ్రహ్మ నిరవయమునుంచి మూడవ సిద్ధాంతం గ్రహించవచ్చు. ఏదైతే సవికారమో, ఏదైతే సావయవమో అది అనిత్యం. వృక్షం సవికారం, సావయవం, అనిత్యం; సముద్రం సవికారం, సావయవం, అనిత్యం. ప్రళయంలో సముద్రం కూడా లయమయిపోతుంది.

**యత్ ద్వైత అద్వైతాత్మకం తత్ సవికారం సావయవమ్ అనిత్యమ్**

ఇదీ సూత్రం. ఈ సూత్రాన్ని బ్రహ్మకు అన్వయిస్తే, బ్రహ్మ కూడా ద్వైత అద్వైతాత్మకం అనేటట్టయితే, బ్రహ్మ కూడా సవికారం, సావయవం, అనిత్యం అవుతాడు. బ్రహ్మ అనిత్యం కాదు, నిత్యం.

**భర్తృప్రపంచం వాదన** – బ్రహ్మ సవికారం, సావయవం అంటే తప్పేముంది అంటారు భర్తృప్రపంచం. సృష్టికి ముందు బ్రహ్మ ఒకటే ఉంది. పూర్ణమదః అంటే అది పూర్ణం, అద్వైతం, కారణబ్రహ్మ. పూర్ణమిదం అంటే బ్రహ్మ కార్యం, బ్రహ్మ ద్వైతం. బ్రహ్మ, కార్యం బ్రహ్మ కూడా పూర్ణం. అంటే సృష్టికి ముందు బ్రహ్మ అద్వైతంగా పూర్ణం, అదే బ్రహ్మ జగత్తు వచ్చాక కార్యం బ్రహ్మగా ద్వైత అద్వైతాత్మకంగా ఉన్నాడు. తప్పేముంది?

**శంకరులవారి జవాబు** – బ్రహ్మను సవికారంగా, సావయవంగా తీసుకుంటే రెండు దోషాలు ఉంటాయి అంటారు శంకరులవారు. అవి శ్రుతి విరుద్ధం, అనిర్మోక్ష ప్రసంగం.

1. **శ్రుతి విరుద్ధమ్** – శ్రుతి బ్రహ్మ నిర్వికారం అంటుంది.

**హిరణ్మయే పరేకోశే విరజం బ్రహ్మ నిష్కలమ్** – ముండకమ్

బ్రహ్మకు కార్యకారణ అవస్థలు లేవు. బ్రహ్మ నిర్వికారం అంటుంది శ్రుతి. బ్రహ్మ ద్వైత అద్వైతాత్మకం అంటే బ్రహ్మ సావయవ సవికారం అవాలి. అలా అయితే అది శ్రుతి విరుద్ధం అవుతుంది. అందువల్ల అది స్వీకరించలేము.

2. **అనిర్మోక్ష ప్రసంగం** – బ్రహ్మ కూడా సవికార, సావయవ, అనిత్య బ్రహ్మ అయితే, అటువంటి బ్రహ్మ మోక్షాన్ని ఇవ్వలేడు. జీవుడు సవికార, సావయవ, అనిత్య జీవుడు. ఇటువంటి జీవుడు సాధనలు చేసి సవికార, సావయవ, అనిత్య బ్రహ్మను పొందితే, అతని పరిస్థితి ఏమీ మెరుగుపడదు. ఎందుకంటే బ్రహ్మకు కూడా అవస్థలు తప్పవు.

దేనికైతే అవయవాలు ఉన్నాయో, అక్కడ సమస్యలు ఉంటాయి. వృద్ధాప్యం, వ్యాధి, మరణం సమస్యలు తప్పవు. మామూలు జీవికే సమస్యలు ఉంటే పెద్ద బ్రహ్మకు పెద్ద సమస్యలు ఉంటాయి. అంటే సంసారంనుంచి మహాసంసారంలోకి వెళ్ళి పడతాడు.

**భర్తృప్రపంచం వాదన** – ఈ రెండు దోషాలకు భర్తృప్రపంచం దగ్గర జవాబు లేదు. అంటే శ్రుతివిరుద్ధం, అనిర్మోక్షప్రసంగాలకు భర్తృప్రపంచం దగ్గర జవాబు లేదు. మనను మనం సమర్థించుకోలేనప్పుడు, ఎదుటి వారిని తప్పు పట్టటానికి చూస్తాము. ఇప్పుడు భర్తృప్రపంచం అదే చేస్తున్నాడు.

నా సిద్ధాంతంలో తప్పులుంటే ఉండవచ్చు కానీ నీ సిద్ధాంతంలో కూడా తప్పులున్నాయి అంటున్నాడు. శంకరులవారి సిద్ధాంతంలో భేదాభేదవాది రెండు తప్పులు పడుతున్నాడు. వాటిని ఈ భేదాభేదావాది గురించి చూసేటప్పుడు చూశాము. ఏమిటవి? వేద ఏకదేశ ప్రమాణ్య దోషం, ప్రత్యక్షాది అప్రమాణ్యదోషం.

1. **వేద ఏకదేశ ప్రమాణ్య దోషమ్** – అంటే వేదంలోని జ్ఞానకాండను ప్రమాణంగా తీసుకుని, కర్మకాండను ప్రమాణంగా తీసుకోవటం లేదని నిందిస్తున్నాడు. కర్మకాండ ద్వైతాన్ని బోధిస్తుంది; మీరు అద్వైతాన్ని స్వీకరిస్తే కర్మకాండను నిషేధించినట్టు అవుతుంది.

2. **ప్రత్యక్షాది అప్రమాణ్య దోషమ్** – కర్మకాండను స్వీకరించకపోతే, ప్రత్యక్ష ప్రమాణం, తక్కిన ప్రమాణాలు పనికిరాకుండా పోతాయి.

అద్వైత సిద్ధాంతంవల్ల ఈ విధమైన దోషాలు ఉంటాయి అంటారు భర్తృప్రపంచం.

**శంకరులవారి జవాబు** – దీనికి శంకరులవారు ఇచ్చిన జవాబులు చాలా ముఖ్యమైన జవాబులు. కర్మకాండ ద్వైతం బోధించదు, ద్వైతం సత్యమనీ బోధించదు అంటారు.

**కర్మకాండ ద్వైతం బోధించదు** – కర్మకాండ ద్వైతం బోధించదు అని నిరూపించాలి. కర్మకాండ ద్వైతాన్ని బోధిస్తుంది అనుకుందాము. ఒకవేళ ద్వైతాన్ని బోధిస్తే, కర్మకాండను నేర్చుకోనివారికి ద్వైతం గురించి తెలియనట్టు అవుతుంది. అంటే అవైదిక పురుషులందరూ అద్వైతులు అవాలి. ఎందుకు? ద్వైతం తెలియకపోతే, వారు అద్వైతాన్నే పాటించాలి కదా! ఆ విధంగా అమెరికావారు, ఇంగ్లండువారు అద్వైతులు అవాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే కర్మకాండ తెలియని వారంతా అద్వైతులు అవాలి. ఎందుకంటే కర్మకాండ ద్వైతాన్ని బోధిస్తోందని కదా భర్తృప్రపంచం వాదన.

అందువల్ల కర్మకాండ ద్వైతాన్ని బోధించదు, బోధించనవసరం లేదు కూడా. నానాత్వం గురించి ఎవరికీ ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎందుకంటే, పుట్టిన ప్రతిప్రాణికీ పుడుతూనే తెలిసేది నానాత్వమే.

**ద్వైతం సత్యమనీ బోధించదు** – కర్మకాండ ద్వైతాన్ని బోధించదు సరే, ద్వైతం సత్యమని బోధిస్తుందా? ద్వైతం సత్యమనీ బోధించదు. ఎందుకు? దానికి కూడా ఇదే జవాబు.

ఒకవేళ కర్మకాండ ద్వైత సత్యత్వాన్ని బోధిస్తున్నది అనుకుంటే కర్మకాండ నేర్చుకోనివారికి ద్వైతసత్యత్వం గురించి తెలియనట్టే కదా. ద్వైతం సత్యమని తెలియకపోతే ఏమవుతుంది? ద్వైతం మిథ్య అనుకుంటాడు. అంటే కర్మకాండ నేర్చుకోకముందు ద్వైతం మిథ్య అనుకుని, కర్మకాండ నేర్చుకున్నాక ద్వైతం మిథ్య కాదని తెలుసుకుంటాడు; అంటే ద్వైతం సత్యమని తెలుసుకుంటాడు.

అందువల్ల ప్రతి ఒక్కరూ కూడా పుడుతూనే ద్వైతవాదిగా పుడతాడు; ద్వైత సత్యత్వవాదిగా పుడతాడు. వేదం ఈ రెండూ బోధించనవసరం లేదు. అంటే వేదం ద్వైతమూ బోధించనవసరం లేదు; ద్వైతం సత్యమనీ చెప్పనవసరం లేదు.

అయితే వేదం ఏం బోధించాలి? **అపూర్వం, అనువాదం.** వేదం మనకు తెలియని విషయాన్ని బోధించాలి. మనం ద్వైతం సత్యమని అనుకుంటాము. వేదం ద్వైతం మిథ్య అని బోధించాలి.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాఽపరః – ఇదీ వేదాంతసారం**

**అపూర్వం –** సాంకేతిక పరిభాషతో చెప్పాలంటే వేదం అపూర్వవస్తువు గురించి చెపుతుంది. ద్వైతం అపూర్వం కాదు, అందువల్ల దాని గురించి చెప్పేందుకేమీ లేదు. అద్వైతం అపూర్వం. వేదం ఈ అద్వైతం గురించి చెబుతుంది. వేదం ద్వైతం గురించి కాని, ద్వైతంయొక్క సత్యత్వం గురించి కాని చెప్పదు. వేదం ద్వైత మిథ్యాత్వం గురించి బోధిస్తుంది.

**అనువాదం –** ఒకవేళ వేదం ద్వైత మిథ్యాత్వం గురించి బోధించాలనుకున్నా కూడా, ఈ సత్యాన్ని అందరూ త్వరగా జీర్ణించుకోలేరు. కనబడే జగత్తు మిథ్య అంటే స్వీకరించటం కష్టం. అందువల్ల వేదాంతబోధ వింటున్నంతసేపూ అద్వైతం బాగానే ఉంటుంది కాని, బయటకు వెళ్ళి చెప్పులు వేసుకోగానే ద్వైతంలోకి వెళ్ళిపోతారు.

అద్వైతం బోధించటానికి సాధకుణ్ణి కొంత సిద్ధం చెయ్యాల్సి ఉంటుంది. ఆ సిద్ధం చెయ్యటానికి అందుబాటులో ఉన్న ద్వైతాన్ని తీసుకుంటుంది వేదం. ఇంకో విధంగా చెప్పాలంటే మనం ఉన్న స్థాయికి దిగివచ్చి, దాని గురించి చెప్పి, మనను పైకి నెమ్మదిగా తీసుకువెళుతుంది వేదం. వేదం ద్వైతం సత్యమని చెప్పదు, కాని ద్వైతాన్నే తీసుకుంటుంది. ఈ పద్ధతిని **అనువాదం** అంటారు. అనువాదం అంటే మనుష్యులు దేన్ని సత్యంగా భావిస్తున్నారో దాన్ని తాత్కాలికంగా సత్యంగా తాను కూడా స్వీకరించటం. తాత్కాలికంగా ఒప్పుకునేటప్పుడు కూడా వేదం, అవును ద్వైతం సత్యమని ఎన్నడూ అనదు. కర్మ చేసే యజమాని సత్యం అనదు. కర్మ సత్యం అని వేదం ఎన్నడూ అనదు.

యజమాని కర్మ చేసేటప్పుడు, వేదం అతను చేస్తున్నది తప్పు అని వేలెత్తి చూపదు. అతను ద్వైతం సత్యం అనుకుంటే అనుకోనీ, నేను అతని అపనమ్మకాన్ని పారద్రోలను. కాని అతని ద్వైతవాదనను అంగీకరిస్తూనే, అందులోనే అతనికి తెలియని కొత్త అంశాన్ని బోధిస్తాను అంటుంది వేదం.

ఏమిటా కొత్త అంశం? కర్మకాండలో ద్వైతం కొత్త అంశం కాదు; ద్వైతసత్యత్వం కొత్త అంశం కాదు. కర్మకాండలో విషయం **ధర్మం**. ధర్మం అంటే ఏది చెయ్యాలో, ఏది చెయ్యకూడదో విడమరిచి చెప్పేది. అది కర్మకాండ నేర్చుకోనిదే తెలియదు. అవైదిక పురుషునికి ద్వైతం తెలుసు, ద్వైతసత్యత్వం తెలుసు కాని, అవైదిక పురుషునికి ధర్మాధర్మాలు తెలియవు.

అందువల్ల అద్వైతాన్ని స్వీకరిస్తే కర్మకాండను నిషేధించినట్టు అవుతుందని భర్తృప్రపంచం చేసిన వాదనలో బలం లేదు. మనం కర్మకాండను తిరస్కరించటం లేదు. కర్మకాండ ఎన్నడూ ద్వైతసత్యత్వం బోధించలేదు. మనం కూడా ద్వైతసత్యత్వం గురించి మాట్లాడటం లేదు. మనం కర్మకాండలో ధర్మాధర్మాల గురించి నేర్చుకోమంటున్నాము. కర్మకాండను ధర్మంకోసం స్వీకరిస్తాము. దాన్ని తిరస్కరించము.

అందువల్ల కర్మకాండకు అప్రమాణ్యదోషం లేదు. కర్మకాండను నేర్చుకోండి; ధర్మాధర్మాలు నేర్చుకోండి, అధికారిత్వం సంపాదించండి; జ్ఞానకాండకు రండి; ద్వైతం మిథ్య అని, అద్వైతం సత్యమని నేర్చుకోండి, మోక్షం పొందండి అంటుంది వేదం. ఎప్పుడైతే సాధకుడు కర్మకాండ, జ్ఞానకాండ పాటించి, జ్ఞానం పొందుతాడో అప్పుడు అతనికి రెండూ అవసరం లేదు.

కర్తకు కర్మకాండ కావాలి; జ్ఞాతా లేదా ప్రమాతకు జ్ఞానకాండం కావాలి. జ్ఞానికి కర్మకాండ అవసరం లేదు, జ్ఞానకాండ కూడా అవసరం లేదు. మొదటిస్థాయిలో అజ్ఞానికి కర్మకాండ ప్రమాణం. అది కూడా ద్వైతాన్నో, ద్వైతసత్యత్వాన్నో బోధించటానికి కాదు, ధర్మజ్ఞానం బోధించటానికి. దాని తర్వాత అతను జ్ఞానకాండకు వస్తాడు. అప్పుడు జ్ఞానకాండ అద్వైతం బోధించి, ద్వైతసత్యత్వనివృత్తి బోధిస్తుంది. అంటే బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య అని నేర్పిస్తుంది. అది నేర్చుకున్నాక అతనికి కర్మకాండే కాదు, జ్ఞానకాండ కూడా అవసరం లేదు. ఆ విధంగా కర్మకాండకు అప్రమాణ్యదోషం అంటదు.

**ప్రత్యక్షాది అప్రమాణ్య దోష ఖండన** – ప్రత్యక్షం ద్వైతాన్ని చూపిస్తుంది. అందులో సందేహం లేదు. ఆ విషయం అద్వైతం కూడా ఒప్పుకుంటుంది. కాని మనం చెప్పేది ఏమిటంటే ప్రత్యక్షం ద్వైతాన్ని చూపిస్తుంది కాని అది సత్యమో, మిథ్యో చెప్పదు.

ఉదాహరణకు కన్ను నక్షత్రాన్ని మిణుకు మిణుకుమంటున్న అతి చిన్న నక్షత్రంగా చూపిస్తుంది. కాని అది చిన్నదో, పెద్దదో మనకు విజ్ఞానశాస్త్రం చెప్పాలి. ఎందుకంటే ఒక్కొక్క నక్షత్రమే భూమికన్నా ఎన్నోరెట్లు పెద్దది. అలాగే భూమి నలుచదరంగా ఉంది అనేది ప్రత్యక్షం, కాని విజ్ఞానశాస్త్రం నీకు ప్రత్యక్షంగా కనిపించేది నిజం కాదు, భూమి గుండ్రంగా ఉంటుంది అంటుంది. అలాగే సూర్యోదయం, సూర్యాస్తమయం చూస్తాము. కాని సూర్యుడు తిరగడు, భూమే తిరుగుతుంది అని విజ్ఞానశాస్త్రం చెబుతుంది.

అదే విధంగా ద్వైతం ప్రత్యక్షం. వ్యావహారికంగా సరిపోతుంది. కాని ప్రత్యక్ష ప్రమాణం ద్వైతం సత్యం అని చెప్పదు. ద్వైతం సత్యం అని మనం పొరపడుతున్నాము. వేదాంతం ప్రత్యక్షాన్ని త్రోసిపుచ్చదు; ప్రత్యక్షం గురించిన మన పొరపాటును త్రోసిపుచ్చుతుంది. అంటే మనం అనుకున్నట్టుగా ద్వైతం సత్యం కాదు అంటుంది.

వేదాంతం ప్రత్యక్ష ప్రమాణాన్ని కొట్టివేయటం లేదు. దాన్ని ప్రశ్నించటమూ లేదు. కాని చూసినది నిజం అనుకోకూడదు, ద్వైతం అంతిమ సత్యం కాదు అంటుంది. వేదాంతం ద్వైతం నిజమనే మన అపోహను తొలగిస్తుంది. అందువల్ల అద్వైతబ్రహ్మ మాత్రమే సత్యం. ద్వైత అద్వైతాత్మక బ్రహ్మ సత్యం కాదు.

**వేదం ద్వైతం బోధించదు అని నిరూపించటానికి చిన్న కథ**

ఈ కథ దయానంద స్వామీజీ తరచు చెబుతూ ఉండేవారు. ఒకానొకప్పుడు ఒక ఆచార్యుడు ఉండేవాడుట. ఆయన అద్వైతవేదాంతం బోధిస్తుండేవాడు. అంటే మహావాక్యంద్వారా జీవ-ఈశ్వర ఐక్యాన్ని బోధించేవాడు.

ఆయన దగ్గర ఎందరో శిష్యులు ఉండేవారు. ఒక శిష్యుడు మాత్రం జీవ-ఈశ్వర ఐక్యాన్ని జీర్ణించుకోలేక పోయేవాడు. అప్పటికీ గురువు చెప్పిన దానిమీద శ్రద్ధ, నమ్మకం పెట్టుకోవాలని తెలిసి, తను నమ్మకపోయినా గురువుగారి బోధ వింటూనే ఉన్నాడు. కాని నెలలు, సంవత్సరాలు గడిచినా అతని మనస్సు జీవ-ఈశ్వర ఐక్యాన్ని సమ్మతించలేకపోయింది.

ఇంక లాభం లేదని ఆచార్యుల దగ్గర సెలవు తీసుకుని, ఇంకో ఆచార్యుణ్ణి వెతుక్కుంటూ వెళ్ళాడు. వేదాలు జీవ-ఈశ్వర ఐక్యం కాదు బోధించేది, వేదాలు జీవ-ఈశ్వర భేదం బోధిస్తున్నాయి అనే గట్టి నమ్మకంలో ఉన్నాడు అతను. కొన్నాళ్ళు వెతగ్గా వెతగ్గా అతని నమ్మకాన్ని దృఢపరిచే ఆచార్యుడు ఒకతను తగిలాడు అతనికి.

ఆ ఆచార్యుడు జీవ-ఈశ్వర భేదం బోధిస్తున్నాడు. 'అమ్మయ్య, ఇన్నాళ్ళకి ఆ భగవంతుని దయవల్ల నా కోరిక నెరవేరింది,' అనుకుని మురిసిపోయాడు. ఆ ద్వైతవాది ఆచార్యుని దగ్గర 12 సంవత్సరాలు అధ్యయనం చేశాడు. దానికి కూడా ప్రస్థానత్రయం, దానికి భాష్యం, మీమాంస, తర్కం అన్నీ ఉంటాయి. అన్నీ శ్రద్ధగా నేర్చుకున్నాడు. అలా ఈ ఆచార్యుని దగ్గర పన్నెండు సంవత్సరాలు విద్య నేర్చుకున్నాక, జీవ-ఈశ్వర భేదమే సత్యమనీ, వేదాలు అదే బోధిస్తున్నాయనీ ఇంకా దృఢంగా నమ్మాడు. అక్కడితో ఆగలేదు.

అద్వైతం నేర్పించే ఆచార్యునితో భేటీకి దిగి ఆయన్ని ఓడించాలనే ఉత్సాహం కలిగింది. అందువల్ల ఒక శుభముహూర్తాన తన పాత గురువు దగ్గరకు వెళ్ళి తన గురువుతో చెప్పాడు, 'గురువర్యా, వేదాలు భేదమే బోధిస్తున్నాయి. దాని గురించి మీతో వాదించటానికి వచ్చాను.'

అద్వైత ఆచార్యుని కనుబొమలు ఆశ్చర్యంగా పైకి లేచినా, తన ఆశ్చర్యాన్ని దాచుకుని, 'సరే అందుకు నేను సిద్ధమే,' అన్నాడు. కాకపోతే అప్పటికే తన మంగలివాడు తనకోసం ఎదురు చూస్తున్నాడనీ, ఆ రోజు పౌర్ణమి కాబట్టి తనకు శిరోముండనం చెయ్యటానికి వచ్చాడనీ, దానికి ఎక్కువ సమయం పట్టదనీ, ఐదు నిముషాలలో పని ముగించుకుని తిరిగివస్తాననీ చెప్పాడు. అంతవరకూ ఆ శిష్యుణ్ణి వేచివుండమని చెప్పి, ఒక ఉచితాసనాన్ని చూపించాడు గురువు.

కనిపించే దూరంలో గురువు మంగలిచేత శిరోముండనం చేయించుకుంటున్నాడు. అంతలోపు గురువుతో ఎలా వాదప్రతివాదనలు చెయ్యాలో, ఆయనను ఎలా తన వాదనతో ఒప్పించాలో ఆలోచిస్తూ మనస్సును సిద్ధం చేసుకుంటున్నాడు శిష్యుడు. తనకు తెలిసిన ద్వైత అంశాలన్నిటినీ గుర్తు తెచ్చుకుంటున్నాడు. ఇంతలో ఆచార్యుని పని అయ్యింది. పూర్తిగా శిరోముండనం చేసిన మంగలి, అలవాటు ప్రకారం గురువుకు అద్దం చూపించాడు.

ఆచార్యులు 'అద్భుతంగా ఉంది, నా గుండు మిలమిలా మెరుస్తోంది, నాకు కొత్త తేజస్సు వచ్చినట్టుగా ఉంది. ఆ తేజస్సు నీ పనితనంవల్ల వచ్చింది కాబట్టి, నువ్వు తేజస్వీ పురుషుడవు. అంటే నువ్వే సాక్షాత్తూ ఈశ్వరుడివి. కాబట్టి నీకు నేను నమస్కారం చెయ్యాలి,' అన్నాడు.

ఆచార్యుడేమిటి, మంగలివాడైన తనకు నమస్కారం చెయ్యటమేమిటి? అది ఎంత పాపం! వెంటనే ఆ మంగలి ఒక్క గెంతు గెంతి, 'అపచారం, అపచారం. మీరు ఆచార్యులు, నేను మంగలిని. నేను ఈశ్వరుణ్ణి కాను, నేను ఈశ్వరుణ్ణి కాను,' అని అరుచుకుంటూ వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయాడు. మామూలుగా తీసుకునే డబ్బు, పండ్లకోసం కూడా ఆగలేదు. ఈ సన్నివేశాన్ని తన శిష్యుడు గమనిస్తున్నాడా లేదా అని ఆచార్యుడు తన శిష్యునికేసి ఓరకంట చూశాడు.

గురువు తనకేసి చూసిన వెంటనే, ఆయన అంతరార్థం బోధపడింది శిష్యునికి. వెంటనే అతను పరుగు పెట్టుకుంటూ వచ్చి గురువు కాళ్ళమీద పడి తన అపరాధాన్ని మన్నించమన్నాడు. 'ఓ శిష్యా! మంగలివాడు శాస్త్రం, తర్కం, మీమాంస, వ్యాకరణభాష్యం ఏదీ అధ్యయనం చెయ్యకుండానే జీవ-ఈశ్వర భేదం గురించి అంత చక్కగా తెలుసుకున్నాడు. కాని నువ్వేం చేశావు? 12 సంవత్సరాలు కష్టపడి అధ్యయనం చేశావు, జీవ-ఈశ్వర భేదం తెలుసుకోవటానికి. శాస్త్రానికి వెళ్ళకుండానే వాటి మధ్య భేదం అంత కొట్టొచ్చినట్టు ఉంటే, పనిగట్టుకుని శాస్త్రం నేర్చుకునే అవసరం ఏముంది?' అన్నాడు గురువు.

ఈ కథవల్ల మనకు తెలిసిన అంశం – భేదదర్శనం లేదా ద్వైతదర్శనం చెయ్యటానికి శాస్త్ర అధ్యయనం అవసరం లేదు. పుడుతూనే మనం ద్వైతభావనతో పుడతాము. మంగలి కూడా ద్వైతభావనతోనే పుట్టాడు. అది తెలుసుకోవటానికి ప్రత్యేకించి గురుకులవాసం చెయ్యనవసరం లేదు.

అదే విధంగా ప్రపంచం సత్యం అనే భావనతోనే పుడతాము మనమంతా. దానికోసం గురుకులవాసంలో ఉండి, 12 సంవత్సరాలు తర్కం, మీమాంస నేర్చుకుని వచ్చి మరీ చెప్పనవసరం లేదు, 'ప్రపంచం సత్యం సుమా,' అని.

అందువల్ల వేదం ద్వైతాన్ని బోధించదు; ద్వైతప్రపంచం సత్యం అనీ బోధించదు. వేదం మనకు తెలిసినదాన్ని బోధించనవసరం లేదు. వేదం ఒక ప్రమాణం. ప్రమాణం నిర్వచనమే – తక్కిన ప్రమాణాలద్వారా తెలియని కొత్త విషయాన్ని చెప్పాలి. దాన్ని అపూర్వవాక్యం అంటారు. అంటే ప్రత్యక్ష ప్రమాణానికి, తక్కిన ప్రమాణాలకీ అందని విషయాలు చెప్పాలి.

ప్రపంచం మిథ్యాత్వం గురించి మనకు తెలియదు. జీవ–ఈశ్వర ఐక్యం గురించి మనకు తెలియదు. అది తెలుసుకోవటానికి శాస్త్రప్రమాణం కావాలి. మరి వేదంలో అనేక భేదవాక్యాలు ఉన్నాయి. వాటి మాట ఏమిటి? వాటిని అనువాదవాక్యాలు అంటారు. అవి ప్రమాణవాక్యాలు కావు. ఏదైతే కొత్త విషయాన్ని బోధించదో, ఏదైతే ప్రమాణవాక్యం లేదా అపూర్వవాక్యం కాదో, అది అప్రమాణికం అవుతుంది. అటువంటి వాక్యాన్ని అనువాదవాక్యం అంటారు.

దీనికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ. 'చల్లదనాన్ని పారద్రోలటానికి అగ్ని ఒకటే మార్గం.' హిమాలయ మంచుపర్వతాల దగ్గర ఉన్నవారు ఆ చల్లదనాన్ని పారద్రోలటానికి అగ్నిని రాజేస్తారు. ఈ జ్ఞానం వేదం కొత్తగా ఇవ్వనవసరం లేదు. అగ్ని వేడిని ఇస్తుందని ఎవరికైనా తెలుసు. అలా అన్ని ద్వైతవాక్యాలు లేదా అన్ని భేదవాక్యాలు కూడా అనువాదవాక్యాలు. అవి అప్రమాణవాక్యాలు. మహావాక్యాలు మాత్రమే ప్రమాణవాక్యాలు. ఎందుకు అవి ప్రమాణవాక్యాలు? ఎందుకంటే అవి కొత్త విషయాన్ని బోధిస్తాయి. అవి అపూర్వ విషయాన్ని బోధిస్తాయి.

పూర్ణమదః పూర్ణమిదం అనే శాంతి పాఠం ఒక మహావాక్యం. పరమాత్మ పూర్ణం, జీవాత్మ పూర్ణం; అందువల్ల జీవాత్మ పరమాత్మలు ఒకటే. అంటే ఆ వాక్యం జీవాత్మ–పరమాత్మల ఐక్యాన్ని సూచిస్తున్నది. అలాగే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే వాక్యం బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య అనే వేదాంత సారాన్ని బోధిస్తున్నది. అందువల్ల భర్తృప్రపంచం వ్యాఖ్యానం సరికాదు.

దీనితో పూర్ణమదః భాష్యం అయిపోయింది.

# 5.1 - ఓం ఖం బ్రహ్మ బ్రాహ్మణము

మంత్రం 5.1.1

**ఓం ఖం బ్రహ్మ ॥ ఖం పురాణం వాయురం ఖమితి హ స్మాహ కౌరవ్యాయణీపుత్రో వేదోఽయం బ్రాహ్మణా విదుర్వేదైనేన యద్వేదితవ్యమ్ ॥**

ఐదు, ఆరు అధ్యాయములు ప్రాథమికంగా ఉపాసనల గురించి బోధిస్తున్నాయి. అవి మధ్యమ అధికారిని ఉద్దేశించి చెప్పినవి. ఉత్తమ అధికారికి ఇప్పటి వరకూ నిర్గుణబ్రహ్మ జ్ఞానాన్ని బోధించింది.

ఛాందోగ్యోపనిషత్తులో కూడా అనేక ఉపాసనలు వస్తాయి. ఈ ఉపనిషత్తుకూ, ఛాందోగ్యోపనిషత్తుకూ మధ్య చిన్న వ్యత్యాసం ఉంది. అందులో మొదటి ఐదు అధ్యాయములు అనేక ఉపాసనలు బోధిస్తే, తర్వాత మూడు అధ్యాయములు జ్ఞానబోధ చేస్తాయి. ఇక్కడ దానికి భిన్నంగా జరుగుతున్నది. మొదటి నాలుగు అధ్యాయములు జ్ఞానబోధ చేస్తే, చివరి రెండు అధ్యాయములు అనేక ఉపాసనలను బోధిస్తున్నాయి.

ఈ ఐదవ అధ్యాయములో పదిహేను బ్రాహ్మణములు ఉన్నాయి. అన్నీ చిన్నచిన్న బ్రాహ్మణములు. రెండు మూడు మంత్రాలకన్నా ఎక్కువగా లేవు. వీటిల్లో అనేక ఉపాసనలతో బాటు కొన్ని విలువలు కూడా జోడించబడ్డాయి.

ఉపాసన ఫలం ఆ సాధకుని నడవడికమీద ఆధారపడివుంటుంది. మన దేశంలో ఆయుర్వేద వైద్యుడు కానీ, జ్యోతిష్యుడు కాని, వారి విద్యతో పాటు ఉపాసన కూడా చెయ్యాలి. వారి విద్య ఫలించాలంటే వారు ఉపాసకులు అయివుండాలి; ఉపాసన చెయ్యాలంటే వారి నడవడిక బాగుండాలి. అందువల్ల ఆయుర్వేద కాలేజీలో ఉపాసనను కూడా బోధిస్తారు.

అలా ఐదవ అధ్యాయములో ఉపాసనలతో పాటు విలువలను కూడా జోడించింది ఉపనిషత్తు. దీని అర్థం ఉపాసన చెయ్యటానికి సాధకుడు ధార్మిక పురుషుడై ఉండాలి. అయితే జ్ఞానం పొందటానికి ధార్మిక పురుషుడై ఉండనవసరం లేదా అనకూడదు. వేదాంతం నేర్చుకోవటానికి సత్ప్రవర్తన కలిగివుండాలి; సత్ప్రవర్తన కలగటానికి ఉపాసన కావాలి. సత్ప్రవర్తనమీదే కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగం ఆధారపడి ఉంటాయి.

**నావిరతో దుశ్చరితాన్నాశాన్తో నాసమాహితః**

**నాశాన్తమానసో వాఽపి ప్రజ్ఞానేనైనమాప్నుయాత్** **- కఠ** 1.2.24

దీని అర్థం చెడు ప్రవర్తననుంచి మారనివాడు, ఇంద్రియనిశ్చయం లేనివాడు, ఏకాగ్రచిత్తం లేనివాడు, ప్రశాంతమైన మనస్సు లేనివాడు, ఎన్నడూ ఆ ఆత్మజ్ఞానం పొందలేడు అని శాస్త్రమే గట్టిగా చెప్పింది. వేదాంతంలో సత్ప్రవర్తనను సాధనచతుష్టయసంపత్తిగా పేర్కొంది. ఉపాసనకాండలో విడిగా కొన్ని విలువలను పేర్కొంది. ఇదీ ఈ అధ్యాయం గురించిన వివరణ. ఇప్పుడు మొదటి బ్రాహ్మణము చూద్దాము. ఇందులో ఒక్క మంత్రమే ఉంది.

**ఓం ఖం బ్రహ్మ** – ఈ బోధ ఓం ఖం బ్రహ్మ పదాలతో మొదలవుతున్నది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని ఓం ఖం బ్రహ్మ బ్రాహ్మణము అంటారు. దీనికి **ఇతి ఉపాసీత** అని కలుపుకోవాలి. ఖం అంటే ఆకాశం. ఆకాశరూపబ్రహ్మ ఉపాసన చెయ్యాలి. ఆకాశరూప ఉపాసనకు ఓంకారం ప్రతీక.

ఇది ఓంకారం ఉపాసన. ఓంకారాన్ని ప్రతీక లేదా ఆలంబన అంటారు. ఈ ఓంకారం అటు నిర్గుణబ్రహ్మకు, ఇటు సగుణబ్రహ్మకు కూడా ఆలంబనమే. అదీ ఓంకారంయొక్క గొప్పతనము.

ఇంతవరకూ మంత్రభాగము. మిగతాదాన్ని బ్రాహ్మణభాగము అంటారు. అది ఈ మంత్రభాగాన్ని వివరిస్తుంది. బృహదారణ్యకోపనిషత్తును బ్రాహ్మణోపనిషత్తు అనీ, ఈశావాస్యోపనిషత్తును మంత్రోపనిషత్తు అని కూడా అంటారు. రెండూ ఒకే వేదానికి చెందినవి. బ్రాహ్మణభాగం, మంత్రభాగాన్ని విశ్లేషిస్తుంది.

ఇలా ఒకే వేదానికి చెందిన మరో రెండు ఉపనిషత్తులు ఉన్నాయి. అథర్వణ వేదానికి చెందిన ముండకోపనిషత్తు మంత్రోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు బ్రాహ్మణోపనిషత్తు. అందువల్ల ప్రశ్నోపనిషత్తుని, ముండకోపనిషత్తుమీద వ్యాఖ్యానంగా పరిగణిస్తారు. అలా ఈశావాస్యోపనిషత్తుమీద వ్యాఖ్యానం బృహదారణ్యకోపనిషత్తు అని కూడా చెప్పవచ్చు.

ఓం ఖం బ్రహ్మ ఇతి ఉపాసీత అంది. ఖం అంటే ఆకాశం. బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ. ఖం బ్రహ్మ అంటే ఆకాశరూప బ్రహ్మ. ఆకాశరూపబ్రహ్మ ఏది? ఓంకారం. ఓంకారమనే ప్రతీకమీద ఆకాశరూపబ్రహ్మ ధ్యానం చెయ్యాలి. ఇది మంత్రభాగం అని చూశాము. ఇప్పుడు బ్రాహ్మణభాగం, అది ఈ మంత్రభాగంయొక్క విశ్లేషణ.

**కౌరవ్యాయణీపుత్రః** – ఈ వ్యాఖ్యానాన్ని కౌరవ్యాయణి అనే ఋషియొక్క పుత్రుడు చెప్పాడు.

ఆకాశానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి చిదాకాశం అంటే నిర్గుణ ఆకాశం లేదా నిరుపాధిక ఆకాశం. అంటే నిర్గుణ ఆకాశం, నిర్గుణచైతన్యబ్రహ్మ.

రెండవ ఆకాశం పంచభూతాలలో ఒకటైన ఆకాశం. భూత ఆకాశం అంటే సగుణబ్రహ్మ, అంటే సోపాధిక బ్రహ్మ. ఓంకారం చిదాకాశబ్రహ్మ మరియు భూతాకాశ బ్రహ్మతో సమానం; ఓంకారం నిరుపాధిక బ్రహ్మ మరియు సోపాధిక బ్రహ్మతో సమానం; ఓంకారం సగుణబ్రహ్మ మరియు నిర్గుణబ్రహ్మలతో సమానం.

**ఖం పురాణమ్** – ఆకాశం సనాతనం. పురాణం ఆకాశం అంటే చిదాకాశమా, భూతాకాశమా అని అడిగి, అది చిదాకాశం అని నిరూపిస్తారు శంకరులవారు. శంకరాచార్యులవారి భాష్యం లేనిదే (స్వామీజీ బోధ లేనిదే) ఉపనిషత్తులను, మరీ ముఖ్యంగా బృహదారణ్యకోపనిషత్తును అర్థం చేసుకోవటం కష్టం.

సనాతనం అంటే ఇక్కడ శాశ్వతం. భూతాకాశం శాశ్వతం కాదు. దానికి పుట్టుక ఉంది, చావు ఉంది. అందువల్ల ఈ ఆకాశం చిదాకాశం.

**వాయురం ఖమితి** – ఇది మళ్ళీ భూతాకాశానికి వర్తిస్తుంది. వాయురం అంటే అందులో వాయువు ఉంది. వాయువు తనలో ఉన్నది భూతాకాశం.

> **న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
>
> **భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥** – గీత 9.5

అంటే ఓం చిదాకాశ బ్రహ్మ, ఓం భూతాకాశ బ్రహ్మ లేదా ఓం నిర్గుణబ్రహ్మ, ఓం సోపాధిక బ్రహ్మ. ఓం అంటే ఓంకారం. తర్వాత భాగం ఓంకారస్తుతి. ఓంకార స్తుతి ఎందుకు? ఓంకార ఉపాసనమీద శ్రద్ధ ఏర్పడటానికి ఓంకారస్తుతి ఇవ్వబడింది.

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతిర్హస్మ వా అప్యో(శ్రావ యేత్యా(శ్రావయన్తి। ఓమితి సామాని గాయన్తి। ఓగ్ం శో మితి శస్త్రాణి శగ్ంసన్తి। ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి। ఓమితి బ్రహ్మా ప్రసౌతి। ఓమిత్యగ్ని హోత్రమనుజానాతి। ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మోపాప్నవానీతి। బ్రహ్మైవోపాప్నోతి॥**

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। – తైత్తిరీయమ్**

ఉపాసన చిన్నది, స్తుతి పెద్దది. ఎలా స్తుతిస్తున్నది?

**అయం (ఓంకారః) వేదః** – ఈ ఓంకారము వేదం. ఎవరు చెబుతున్నారు?

**బ్రాహ్మణా విదుః** – ఋషులందరూ చెబుతున్నారు. ఎందుకు?

**వేదైనేన యద్వేదితవ్యమ్** – దేనిని తెలుసుకోవాలో, అది ఈ ఓంకారంద్వారా తెలుస్తుంది.

ఈ మంత్రం ఒక సాధారణ మంత్రం కాదు. వేదాలన్నీ ఓంకారంలో ఇమిడివున్నాయి. అంటే ఇది అన్నిటినీ తనలో పెట్టుకునే మైక్రోచిప్ లాంటిది.

ఓంకారంద్వారా ఏం తెలుసుకోవాలో అది తెలుస్తుంది అన్నారు ఋషులు. మనం ఈ సృష్టిలో దేని గురించి తెలుసుకోవాలనుకున్నా కూడా, అది రెండు తెగల్లో ఏదో ఒకదానికింద వస్తుంది. మూడో వస్తువు లేనేలేదు. ఒకటి సగుణబ్రహ్మ, ఇంకొకటి నిర్గుణబ్రహ్మ. మనం నేర్చుకునే లౌకికవిద్య అంతా అంటే కెమిస్ట్రీ, ఎకనామిక్స్‌లాంటిదంతా సగుణబ్రహ్మలోకి వస్తుంది. దేని గురించి చెప్పినా అది బ్రహ్మ+నామరూపాలు.

ఉపనిషత్తులో నిర్గుణబ్రహ్మ గురించి నేర్చుకుంటాము. అంటే నామరూపాలు లేని శుద్ధబ్రహ్మ గురించి నేర్చుకుంటాము. ఓంకారం గొప్పదనం ఏమిటంటే ఓంకారంద్వారా సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ – రెండింటి గురించీ నేర్చుకోవచ్చు. మాండూక్యోపనిషత్తులో ఈ విషయం బాగా అర్థమవుతుంది. అందులో మొదటి ఆరు మంత్రాలు సగుణబ్రహ్మను వర్ణిస్తే, ఏడవ మంత్రం నిర్గుణబ్రహ్మను వర్ణిస్తుంది.

వేదం మొత్తంలో రెండే విషయాలు నేర్చుకుంటాము. అవి సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ. వేదపూర్వభాగం సగుణబ్రహ్మ గురించి బోధిస్తే, వేద అంతభాగం నిర్గుణబ్రహ్మ గురించి బోధిస్తుంది. ఆ విధంగా వేదం బ్రహ్మద్వయం గురించి చెబుతుంది. ఓంకారం బ్రహ్మద్వయం గురించి చెబుతుంది.

ఆ విధంగా వేదం = ఓంకారం.

**ఓంకారః ఏవ వేదః, వేదః ఏవ ఓంకారః**

ఇక్కడ ఈ విషయం నేర్చుకుంటాము. తైత్తిరీయోపనిషత్తులో ఇంకొక విధంగా వేదం = ఓంకారం అని చూస్తాము.

**ఓ యశ్ఛన్దసామృషభో విశ్వరూపః। ఛన్దోభ్యోఽధ్యమృతాత్సమ్బభూవ। స మేన్ద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవ ధారణో భూయాసమ్ । శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరివిశ్రువమ్। బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః। శ్రుతం మే గోపాయ॥ - తైత్తిరీయమ్**

మొత్తం వేదాలను చిలికితే వేదాలసారంగా ఓంకారం వచ్చిందని చూస్తాము అక్కడ. అందువల్ల ఓంకారాన్ని విశదీకరిస్తే వేదం అవుతుంది; వేదాన్ని కుంచిస్తే ఓంకారం అవుతుంది. ఆ వాదన ప్రకారం చూసినా, ఇక్కడ వాదన ప్రకారం చూసినా ఓంకారమే సగుణబ్రహ్మకూ, నిర్గుణబ్రహ్మకూ కూడా ఆలంబనం.

**ఏతదాలమ్బనం శ్రేష్ఠమేతదాలమ్బనం పరమ్।**
**ఏతదాలమ్బనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే॥ - కఠ**

అందువల్ల ఓంకారాన్ని సగుణబ్రహ్మకు, నిర్గుణబ్రహ్మకు కూడా ఉపయోగించవచ్చు. బృహదారణ్యకంలో ఓంకార ఉపాసన ఫలం ఇవ్వలేదు. కాని ఉపాసన సూత్రం ఒకటి ఉంది.

**యథా యథోపాసతే తదేవ భవతి**

ఎవరేది కోరితే అది పొందుతారు. ఈ కఠ మంత్రంలో కూడా అదే అర్థం వస్తుంది. నిర్గుణబ్రహ్మ కావాలంటే, ఓంకార విశ్లేషణ చేస్తే నిర్గుణబ్రహ్మ జ్ఞానం పొందుతారు; సగుణబ్రహ్మ ఉపాసన చేస్తే సగుణబ్రహ్మలోకానికి వెళతారు.

# 5.2 - ప్రాజాపత్య బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము ముందు ఒక కథ చెబుతుంది. ఆ కథద్వారా మూడు విలువల గురించి చెబుతుంది. ఉపాసకుడు విలువలను పాటించాలి అని చూశాము. విలువలు పాటించకుండా ఉపాసన చేస్తే దాని ఫలితం ఉండదని చూశాము. ఈ విలువలను ముందు చెప్పిన ఓంకార ఉపాసనకూ, తర్వాత రాబోయే ఉపాసనలకూ కూడా కలుపుకోవాలి.

ఈ కథ ప్రజాపతికీ, దేవాసుర మనుష్యులకూ మధ్య జరుగుతుంది. ప్రజాపతి గురువు. అందువల్ల ఈ బ్రాహ్మణాన్ని ప్రాజాపత్య బ్రాహ్మణము అన్నారు. ఇక్కడ నేర్పిన మూడు విలువలు - దమం, దయ, దానం. దమం అంటే ఇంద్రియనిగ్రహం; దయ అంటే జాలి; దానం అంటే డబ్బు ధారాళంగా ఇవ్వటం. సాక్షాత్తూ ప్రజాపతే ఈ విలువల గురించి చెప్పాడు కనుక వీటిని ప్రాథమిక విలువలుగా తీసుకోవచ్చు. అందువల్ల కృష్ణపరమాత్మ కూడా వీటిని తన బోధలో చొప్పించాడు.

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥ - గీత 16.21**

కామం, క్రోధం, లోభం - ఈ మూడూ నరకద్వారాలు అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ మూడు పదాలనే నివృత్తిరూపంలో చెప్పాడు కృష్ణపరమాత్మ. దమం అంటే కామత్యాగం; దయ అంటే క్రోధత్యాగం; దానం అంటే లోభత్యాగం. గీతలో ఈ విలువలను పాటించకపోతే నరకానికి వెళతారు అంటే, ఈ బ్రాహ్మణములో ఈ విలువలను పాటిస్తే ఉన్నత లోకాలకు వెళతారు, మోక్షం కూడా పొందుతారని వస్తుంది. ఈ అధ్యాయము ఉపాసనా ప్రధానం కాబట్టి మంత్రాలకు ప్రతిపదార్థం వివరణ ఇవ్వలేదు.

మంత్రం 5.2.1

**త్రయాః ప్రాజాపత్యాః ప్రజాపతౌ పితరి బ్రహ్మచర్యమూషుర్దేవా మనుష్యా అసురా ఉషిత్వా బ్రహ్మచర్యం దేవా ఊచుర్బ్రవీతు నో భవానితి తేభ్యో హైతదక్షరమువాచ ద ఇతి వ్యజ్ఞాసిష్టా ౩ ఇతి వ్యజ్ఞాసిష్మేతి హోచుర్దామ్యతేతి న ఆత్థేత్యోమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి ॥**

ఈ బోధ ప్రజాపతికీ, మూడు రకాల జీవులకీ మధ్య సంభాషణరూపంలో సాగుతుంది. ప్రజాపతి అంటే సగుణబ్రహ్మ లేదా బ్రహ్మదేవుడు. మూడు రకాల జీవులు దేవతలు, అసురులు, మనుష్యులు. ముగ్గురినీ కూడా ప్రజాపతి సంతానం అంటారు. ఎందుకంటే మూడు జాతులవారు బ్రహ్మ నుంచే పుట్టారు.

ఈ ముగ్గురూ ప్రజాపతి దగ్గర గురుకులవాసం చేసి, బ్రహ్మచర్య జీవనం గడిపారు. శిష్యుడై ఉండటానికి ప్రధాన లక్షణం బ్రహ్మచర్యమే అంటారు శంకరులవారు, తన భాష్యంలో. గురుకులవాసంలో శిష్యుడు అనేక నియమాలను పాటించాలి కాని వాటిలో బ్రహ్మచర్యం ముఖ్యమైన నియమం.

బ్రహ్మదేవుడు వీరు ముగ్గురికీ తండ్రే కాదు, గురువు కూడా. కొన్నాళ్ళు వీరు గురుకులవాసం చేశాక, తండ్రి దగ్గరకు వచ్చారు. దీన్నిబట్టి ఇంకొక ముఖ్యమైన నియమం తెలుస్తున్నది మనకు. గురుకులవాసంలో చేరగానే, విద్య నేర్పమని శిష్యుడు అడగకూడదు, గురువు కూడా వెంటనే నేర్పించడు. కొంతకాలం ఆయన శిష్యరికం చెయ్యాలి.

ఛాందోగ్యోపనిషత్తులో ఇంద్రుడు, విరోచనుడు బ్రహ్మ దగ్గర బ్రహ్మవిద్య పొందటానికి వెళతారు. అక్కడ వారు ఆయనకు శుశ్రూషలు చేస్తూ 35 సంవత్సరాలు గడుపుతారు. తర్వాత ఇంద్రుడు ఇంకా ఎన్నో సంవత్సరాలు గడుపుతాడు. దీని ఉద్దేశం, గురుశిష్యులిద్దరూ ఒకరి గురించి మరొకరు తెలుసుకోవాలి. ముఖ్యంగా శిష్యుడు అధికారో కాదో గురువు తెలుసుకోవాలి. అధికారిత్వం లేకపోతే అతన్ని వెనక్కి పంపించేస్తాడు గురువు.

**దేవా ఊచుః** – దేవతలు అడిగారు. ఏమని?

**బ్రవీతు నో భవానితి** – మీరు మాకు ఉపదేశం చెయ్యండి.

**తేభ్య హైతదక్షరమ్ ఉవాచ ద ఇతి** – ఈ విధంగా కోరినవారికి ‘ద’ అనే ఒకే ఒక అక్షరాన్ని ఆయన ఉపదేశించాడు.

**వ్యజ్ఞాసిషా 3 ఇతి** – తెలుసుకున్నారా అని ప్రశ్నించాడు.

**వ్యజ్ఞాసిష్మేతి హ ఊచుః** – ఆ! తెలుసుకున్నాము అన్నారు దేవతలు.

**దామ్యత ఇతి నః అత్థ** – మాకు దమము లేదు కాబట్టి దానిని పెంపొందించుకొనమని మీరు బోధ చేశారు అన్నారు దేవతలు.

**ఓమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి** – అవును! మీరు సరిగ్గానే తెలుసుకున్నారు అని ప్రజాపతి పలికాడు.

దేవతలు మాకు బోధ చెయ్యమని కోరితే ప్రజాపతి ఏకాక్షరం బోధించాడు. ‘ద’ ఇతి అన్నాడు. పైగా అర్థమయిందా అన్నాడు. నిజానికి వారు అడిగింది మాకు ఏది లేదో నీకు తెలుసు కాబట్టి మాకు దాని గురించి బోధ చెయ్యి అని దాని ఉద్దేశం. ప్రజాపతి ‘ద’ అనగానే వారు దాన్ని ‘దమము’గా తీసుకున్నారు. నిజానికి ఎవరి సమస్య వారికి తెలుసు. అందరికీ అజ్ఞానం కాదు సమస్య. విలువలు అందరికీ తెలుసు. తెలియాల్సింది **ఆ విలువలయొక్క విలువ**.

దేవతలకు వారి సమస్య తెలుసు కాబట్టి, వెంటనే మాకు అర్థమయింది అన్నారు. ఏం అర్థమయిందో చెప్పమన్నాడు ప్రజాపతి. దమము పాటించమన్నారని అర్థమయిందని అన్నారు. దమము అంటే ఇంద్రియ నిగ్రహము. మమ్మల్ని ఇంద్రియనిగ్రహం పాటించమన్నారు, అతిగా ఇంద్రియాలకు బానిస కావద్దు అన్నారని చెప్పారు దేవతలు. ప్రజాపతి అవును, నిజమే అన్నాడు.

దేవతలు వారు చేసిన పుణ్యకర్మల ఫలంగా ఇంద్రలోకంలో స్వర్గసుఖాలను వారు అనుక్షణం అనుభవిస్తూ ఉంటారు. అక్కడ ఎప్పుడూ అమృతం తాగుతూ, రంభ, ఊర్వశుల నాట్యాలు తిలకిస్తూ ఆనందంలో తేలియాడు తుంటారు. అలా ఆనందంలో తేలియాడుతుంటే, వారిని వారు అదుపులో పెట్టుకోలేరు.

**అన్ధన్తమః ప్రవిశన్తి యేఽ విద్యామ్ ఉపాసతే ।**
**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః ॥** – ఈశావాస్యమ్

ఉన్నత లోకాలు చీకటి లోకాలు అంటున్నది ఈశావాస్యోపనిషత్తు. కర్మ చేసిన వ్యక్తి కర్మఫలంగా చీకటి లోకాలకు వెళితే, ఉపాసన చేసిన వ్యక్తి ఉపాసన ఫలితంగా ఇంకా చీకటి లోకాలకు వెళతాడు అంటుంది. అసలైతే కర్మ చేసిన వ్యక్తి స్వర్గలోకానికీ, ఉపాసన చేసిన వ్యక్తి బ్రహ్మలోకానికీ వెళతాడు. స్వర్గలోకం చాలా ప్రకాశవంతంగా ఉంటే, బ్రహ్మలోకం ఎన్నో రెట్లు ప్రకాశవంతంగా ఉంటుంది. మరయితే ఆ లోకాలను చీకటిలోకం అనీ, మరింత చీకటిలోకం అనీ ఎందుకు అంది ఉపనిషత్తు?

ఆ లోకాలలో కావాల్సినంత సుఖం, ఆనందం, ఆటా, పాటా, అమృతం ఉంటాయి. అక్కడికి వెళ్ళిన జీవి మరింత బాహ్యముఖంగా ఉంటాడే తప్ప అతను ఆత్మ గురించి ఆలోచించడు. ఎంత బాహ్యంగా పరుగులు తీస్తే, ఆత్మకు అంత దూరంగా వెళ్ళిపోతాడు. అందువల్ల దేవతలకు, బ్రహ్మ ఈ బాహ్యసుఖాలలో తేలిపోకండి, అంటే కామం మీ స్వభావం కాబట్టి **దమము పాటించండి** అని సలహా ఇచ్చినట్టు అర్థం. బ్రహ్మదేవుడు–దేవతల ఉపదేశం అయింది.

## మంత్రం 5.2.2

**అథ హైనం మనుష్యా ఊచుర్బ్రవీతు నో భవానితి తేభ్యో హైతదేవాక్షరమువాచ ద ఇతి వ్యజ్ఞాసిష్టా ౩ ఇతి వ్యజ్ఞాసిష్మేతి హోచుర్దత్తేతి న ఆత్థేత్యోమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి ॥**

ఇప్పుడు మనుష్యులు బ్రహ్మదేవుని దగ్గరికి వెళ్ళారు. ఈ మంత్రంలో కూడా ఇంచుమించు వాక్యాలు ఇవే. మాకు ఉపదేశం చెయ్యమని వారూ కోరారు. వారికి కూడా 'ద' ఇతి అన్నాడు ప్రజాపతి. అర్థమయిందా అన్నాడు మళ్ళీ. అయిందన్నారు. మమ్మల్ని **దానం** చెయ్యమన్నారు కదా అన్నారు.

**దత్త ఇతి** – లోభం మీ స్వభావం కాబట్టి దానం చెయ్యండి అన్నాడు.

ఇవ్వటం నేర్చుకోవాలి మనుష్యులు. అది కూడా శ్రద్ధతో ఇవ్వాలి. దానం చేస్తేనే త్యాగబుద్ధి వస్తుంది, త్యాగమే మోక్షానికి దారితీస్తుంది. గృహస్థాశ్రమంలో దానం ఇవ్వటం అలవాటు చెయ్యటానికి కారణం, సన్న్యాసాశ్రమంలో మొత్తం పరిత్యజించాలని. ఉన్నదంతా పరిత్యజిస్తేనే మోక్షం వస్తుంది అంటే, అయితే నేను మోక్షాన్నే పరిత్యజిస్తాను అంటారు కొందరు. ఎందుకు అంత కష్టం? వారికి డబ్బే తాను. అజ్ఞానికి నేను అంటే అనాత్మ; డబ్బు అనాత్మ; అందువల్ల ప్రపంచం అంతా డబ్బుతోనే ముడిపడివుంటుంది అంటారు.

మనిషి తనకున్న శక్తిని, జ్ఞానాన్ని ఉద్యోగంలో ధారపోసి, దాన్ని డబ్బుగా మార్చుకుంటాడు. డబ్బు స్థూలశరీరానికి సంకేతం. అందువల్ల అజ్ఞానిని డబ్బు ఇవ్వమంటే తన శరీరాన్నే ఇవ్వమన్నట్టు భావిస్తాడు. ఎందుకు? తన శరీరమే తాను అనుకుంటాడు. అందువల్ల డబ్బు ఇవ్వటం అంటే తనను తాను ఇచ్చుకోవటమే. డబ్బు ఇవ్వటం అంటే ఆత్మహత్య చేసుకోవటంతో సమానం అతనికి. అందువల్ల దానగుణంలేని మనుష్యులకు దానం చెయ్యమని బోధించాడు ప్రజాపతి అన్నారు వారు.

ప్రజాపతి అవును, మీరు సరిగ్గానే అర్థం చేసుకున్నారు అన్నాడు. మనకున్న సమస్యను అర్థం చేసుకోవటం ఒక ఎత్తు; ఆ సమస్యను అధిగమించటం ఇంకొక ఎత్తు. మన సమస్య ఏమిటో తెలుసుకోవటానికి ఇతరులు సహాయం చెయ్యగలరు. గురువు సహాయం చెయ్యగలడు; శాస్త్రం సహాయం చెయ్యగలదు. కాని సమస్యను అధిగమించటానికి మనమే ప్రయత్నం చెయ్యాలి.

ఇష్టం ఉన్నా లేకపోయినా బలవంతంగా దానం చెయ్యటం నేర్చుకుంటే, దానంతట అదే తర్వాత అలవాటయి పోతుంది. తర్వాత సహజంగా మారుతుంది. ఆ మాటకొస్తే ఏ విలువైనా అంతే. ముందు బలవంతంగా అలవాటు చేసుకుంటే, తర్వాత అలవాటుగా మారుతుంది. అందువల్ల మనుష్యులకు లోభం ఉంది కాబట్టి **దానము** పాటించమని బ్రహ్మదేవుడు చెప్పినట్టు అర్థం. దీనితో మనుష్యులకు ఉపదేశం అయింది.

### మంత్రం 5.2.3

**అథ హైనమసురా ఊచుర్బ్రవీతు నో భవానితి తేభ్యో హైతదేవాక్షరమువాచ ద ఇతి వ్యజ్ఞాసిషా 3 ఇతి వ్యజ్ఞాసిష్మేతి హోచుర్దయధ్వమితి న ఆత్థేత్యోమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి తదేతదేవైషా దైవీ వాగనువదతి స్తనయిత్నుర్ద ద ద ఇతి దామ్యత దత్త దయధ్వమితి తదేతత్త్రయగ్ం శిక్షేద్దమం దానం దయామితి ॥**

ఇది కూడా ఇంచుమించు ముందు మంత్రంలాగానే ఉంది. ఇప్పుడు దానవులు ప్రజాపతిని సమీపించి మాకు ఉపదేశం చెయ్యండి అన్నారు. వీరికి కూడా 'ద' ఇతి అన్నాడు ప్రజాపతి. పైగా అర్థం చేసుకున్నారా అన్నాడు?

**దయధ్వమితి** – దయను చూపమని చెప్పారు అన్నారు వారు. వారికి క్రోధం ఎక్కువ కాబట్టి, దాన్ని తగ్గించుకుని దయ చూపించమన్నాడు. ఆసురీ సంపత్తి గురించి భగవద్గీతలో 16వ అధ్యాయంలో వస్తుంది.

**ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః ।**
**ఈహంతే కామభోగార్థమ్ అన్యాయేనార్థసంచయాన్ ॥** – గీత 16.12
**దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్ ॥** – గీత 16.4

రాక్షసులు నిర్దాక్షిణ్యంగా వారికి అడ్డువచ్చిన వారిని తొలగిస్తారు. వారి క్రూరత్వానికి అంతూపొంతూ ఉండదు. అందువల్ల వారు వారి క్రోధాన్ని త్యాగం చెయ్యాలి. అసురులకు క్రోధం ఉంది కాబట్టి, దయను చూపించమని బ్రహ్మదేవుడు చెప్పినట్టు అర్థం. దీనితో అసురులకు ఉపదేశం అయింది.

ఈ బోధ ఎప్పుడో జరిగినా కూడా, ఈ దైవవాక్కును ఇప్పటికీ మనం ఆకాశవాణిగా వింటూ ఉంటాము. అంటే ప్రజాపతి చెప్పిన దివ్యబోధను ఈరోజు కూడా వినవచ్చు. నేనెప్పుడూ వినలేదు అంటే, అది ఉరుము రూపంలో వినిపిస్తుంది.

**ఏషా దైవీ వాగనువదతి స్తనయిత్నుర్ద ద ద ఇతి** – ఈ ఉపదేశాన్నే మేఘగర్జన అనే దైవీ వాక్కు దదద అని వినిపిస్తుంది. దాని అర్థం –

**దామ్యత దత్త దయధ్వమితి** – అంటే దమమును, దత్తగుణమును (దానగుణమును), దయాగుణమును కలిగి ఉండండి అని చెబుతున్నది.

**ఏతత్ త్రయగ్ం శిక్షేద్దమం దానం దయామితి** – ఈ మూడింటినీ అంటే దమం, దానం, దయ అనే ఈ మూడు గుణాలను మనుష్యులు పాటించాలని శ్రుతి చెబుతున్నది.

ప్రజాపతి చెప్పిన బోధను మళ్ళీ ఉపనిషత్తు చెబుతున్నది. ఈ కథలోని నీతి ఏమిటి? ఉపనిషత్తు మనుష్యుల గురించిన తాపత్రయంతో మళ్ళీ చెబుతున్నది. ఇక్కడ శంకరులవారు చిన్న విచారణ చేస్తున్నారు. మనుష్యులు ఈ మూడూ పాటించాలని ఉపనిషత్తు అంది అని చూశాము. బోధ మనుష్యులకు మాత్రమే కాదు, దేవతలకు, అసురులకు కూడా ఉన్నప్పుడు వారికి చెప్పినవి మనం ఎందుకు పాటించాలి? ఈ ప్రశ్నను శంకరులవారే వేసి, దానికి రెండు జవాబులు కూడా ఇస్తున్నారు.

1. బోధ ఎవరికి జరిగిందని చూడకండి. చెప్పింది ఎవరో చూడండి. చెప్పింది సాక్షాత్తూ బ్రహ్మదేవుడే. బ్రహ్మదేవుడు చెప్పిన దైవవాక్యాన్ని మనకు వర్తించదు అనుకోవటంలో అర్థం లేదు. ఆయన మాటను ఆజ్ఞగా తీసుకుని పాటించాలి. అందువల్ల దేవతలకు చెప్పిన దమము, మనుష్యులకు చెప్పిన దానము, అసురులకు చెప్పిన దయ– మూడూ పాటించాలి.

2. ఈ వాదన అద్భుతంగా ఉంటుంది. నిజంగా దేవతలు ఉన్నారో లేదో మనకు తెలియదు. అలాగే నిజంగా అసురులు ఉన్నారో, లేదో కూడా మనకు తెలియదు. అది నమ్మకం మాత్రమే. అది పరోక్ష జ్ఞానం. అందువల్ల దాన్ని పక్కనపెడితే, దేవతలు, మనుష్యులు, అసురులు – ఒక్క మనిషిలోనే ఉన్నారు. అంటే ప్రతి ఒక్కరిలోనూ దైవీసంపత్తి, మానుషీసంపత్తి, ఆసురీసంపత్తి ఉంటుంది.
ఒక్కోసారి ఒక్కో లక్షణం ప్రస్ఫుటమవుతుంది. ఒకవేళ మనం బాగా పుణ్యం చేసుకుని ఉంటే, మనకు ఐశ్వర్యానికి కొదవ ఉండకపోతే, సుఖాలకూ కొదవ ఉండదు. సంపదలతో తులతూగుతుంటాము అంటే ఇంద్రియ సుఖాలలో తేలియాడుతాము. అప్పుడు మనం దేవతలతో సమానం. అప్పుడు మనం దమాన్ని పాటించాలి.

మనకు బోలెడంత ఆస్తి ఉన్నా కూడా, పిల్లికి కూడా బిచ్చం వెయ్యకపోతే, మనం మనుష్యులకున్న లోభత్వం చూపించినట్టు. అప్పుడు మనం దానాన్ని పాటించాలి. అలాగే కుటుంబసభ్యులని కూడా చూడకుండా వారిని కూడా హింసిస్తుంటే, మనలో దయా గుణం లోపించి మనం రాక్షసులుగా ప్రవర్తించినట్టు. హింసించటం అంటే శారీరకంగానే హింసించనవసరం లేదు; మానసికంగా కూడా హింసించవచ్చు. అప్పుడు మనం దయను పాటించాలి.

అలా మనమే దేవతలం, మనుష్యులం, రాక్షసులం కూడా. అందువల్ల మనం ఈ మూడు గుణాలనూ అంటే దమం, దానం, దయా గుణాలను పాటించాలి. దాన్ని బ్రహ్మ ఆజ్ఞగా శిరసావహించాలి.

# 5.3 - హృదయ బ్రాహ్మణము

మంత్రం 5.3.1

**ఏష ప్రజాపతిర్యద్ధృదయమేతద్బ్రహ్మైతత్సర్వమ్ ॥**
**తదేతత్త్ర్యక్షరగ్ం హృదయమితి హృ ఇత్యేకమక్షరమభిహరన్త్యస్మై స్వాశ్చాన్యే చ య ఏవం వేద ద ఇత్యేకమక్షరం దదత్యస్మై స్వాశ్చాన్యే చ య ఏవం వేద యమిత్యేకమక్షరమేతి స్వర్గం లోకం య ఏవం వేద ॥**

ఇది చాలా చిన్న బ్రాహ్మణము. ఈ అధ్యాయంలో మూడవ బ్రాహ్మణమునుంచి తొమ్మిదవ బ్రాహ్మణము వరకూ, హిరణ్యగర్భ ఉపాసనను బోధిస్తాయి. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మశరీర ఉపహితచైతన్యం. హిరణ్యగర్భను బ్రహ్మ అనీ, ప్రజాపతి అనీ అంటారు.

ఈ బ్రాహ్మణములో ఉపాసన – **హృదయరూపేణ హిరణ్యగర్భ ఉపాసన.** హృదయం అంటే మామూలుగా గుండె; కానీ ఉపనిషత్తులో మనస్సు లేదా అంతఃకరణం అని వస్తుంది. అంటే హృదయంలో ఉన్న మనస్సు. హృదయరూపేణ ఉపాసన అంటే అంతఃకరణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన. హిరణ్యగర్భ అంటే సమష్టిబుద్ధి. సమష్టి అంతఃకరణ ధ్యానం వ్యష్టి అంతఃకరణమీద చెయ్యాలి. ఈ ఉపాసనను స్తుతించటానికి, ఉపనిషత్తు హృదయం పదంలోని అక్షరాలు కూడా పవిత్రమైనవేనని అంటున్నది.

**హృదయనమస్కార ఉపాసనా అపి ఉత్తమా**

**ఏష ప్రజాపతిర్యద్ధృదయమేతద్బ్రహ్మైతత్సర్వమ్** – హృదయమేదైతే గలదో అదే ప్రజాపతి. ఇది బ్రహ్మ. ఇది సర్వం.

**తదేతత్త్ర్యక్షరగ్ం హృదయమితి** – హృదయం అనే దానికి మూడు అక్షరాలు ఉన్నాయి.

**హృ ఇత్యేకమక్షరమభిహరంతి** – హృ అనేది ఒక అక్షరము. దాని అర్థం **తీసుకుని రావటం**. ఇంద్రియాలు, వాటి అనుభవాలను మనస్సుకు తీసుకుని వస్తాయి. అంటే కన్ను రూప అనుభవాన్ని, చెవి శబ్ద అనుభవాన్ని తీసుకుని వస్తాయి. మనస్సు వీటన్నిటినీ తీసుకుని జీవాత్మకు అందిస్తుంది.

**ద ఇత్యేకమక్షరం దదతి** – ద అనేది ఒక అక్షరం. ద అంటే ఇవ్వటం లేదా **శక్తిని ఇవ్వటం**. ఇంద్రియాలు, ఇతర విషయాలు కూడా తమతమ శక్తిని మనస్సుకు ఇస్తాయి.

**యమిత్యేకమక్షరమేతి స్వర్గం లోకమ్** – అదే విధంగా యమ్ అనేది కూడా ఒక అక్షరం. యమ్ అంటే **పొందటం**. జీవాత్మ స్వర్గలోకాన్ని పొందటం. ఆ విధంగా హృదయం అంటే హృ+ద+యమ్. వాటి అర్థం తీసుకురావటం, శక్తిని ఇవ్వటం, లోకాలకు తీసుకువెళ్ళటం. హృదయం అంటే మనస్సు అని మర్చిపోకూడదు.

**అభిహరన్త్యస్మై స్వాశ్చాన్యే చ య ఏవం వేద**
**దదత్యస్మై స్వాశ్చాన్యే చ య ఏవం వేద**
**ఏతి స్వర్గం లోకం య ఏవం వేద**

కొంతమంది హృదయం అంటే హృదయమనే అంటారు. అది శరీరంనుంచి అశుద్ధమైన రక్తాన్ని తీసుకుని, రక్తాన్ని శుద్ధిచేసి, మళ్ళీ శరీరానికి తిరిగి ఇస్తుంది అంటారు.

ఈ హృదయ ఉపాసన చేస్తే కలిగే ఫలం కూడా చెబుతున్నది ఉపనిషత్తు. హృదయనామ అక్షరాలే అంత శక్తివంతమైనవైతే, హృదయరూపేణ ఉపాసన చేసిన వ్యక్తికి ఇంకెంత ఫలం రావాలో చూడండి. ఇంద్రియాలు అనేక విషయాలను మనస్సుకు తీసుకు వచ్చినట్టుగా, ఇతరులు ఈ ఉపాసకునికి అనేక కానుకలను ఇస్తారు. అలాగే ఇంద్రియాలు మనస్సుకు శక్తిని ఇచ్చినట్టుగా, ఇతరులు అతనికి శక్తిని ఇస్తారు. చివరగా అతను స్వర్గలోకానికి వెళతాడు.

# 5.4 - సత్య బ్రాహ్మణము

మంత్రం 5.4.1

**తద్వై తదేతదేవ తదాస సత్యమేవ స యో హైతం మహద్యక్షం ప్రథమజం వేద సత్యం బ్రహ్మేతి జయతీమాంల్లోకాఞ్జిత ఇన్న్వసావసద్య ఏవమేతన్మహద్యక్షం ప్రథమజం వేద సత్యం బ్రహ్మేతి సత్యగ్ం హ్యేవ బ్రహ్మ ॥**

ఇది కూడా చిన్న బ్రాహ్మణమే. ఇందులోనూ ఒకటే మంత్రం ఉంది. సత్యంమీద హిరణ్యగర్భ ఉపాసన చెయ్యాలి. అందువల్ల దీన్ని **సత్యరూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. సత్యంమీద ఉపాసన చేస్తారు కాబట్టి దీన్ని **సత్య బ్రాహ్మణము** అన్నారు.

**మహద్యక్షం ప్రథమజమ్** – హిరణ్యగర్భను ఈ పదాలతో స్తుతిస్తున్నది ఉపనిషత్తు. మహత్ అంటే గొప్ప (దేశ పరిచ్ఛేదములేని); యక్ష్యం అంటే గొప్ప కాబట్టి పూజనీయమైన; ప్రథమజం అంటే మొట్టమొదట పుట్టిన అని అర్థం. 'యక్ష' పదాన్ని కేనోపనిషత్తులో కూడా చూశాము. యక్షుడు అంటే పూజనీయుడు. అందరికంటే ముందు పుట్టాడు కాబట్టి ప్రథమజుడు. ఈ మహత్ యక్ష ప్రథమజరూప హిరణ్యగర్భ ఉపాసన సత్యంమీద చెయ్యాలి.

సత్యం పదానికి ప్రత్యేకమైన అర్థం ఉంది. ఈ ఉపనిషత్తులోనే మూర్తామూర్త బ్రాహ్మణంలో కూడా చూశాము. అక్కడ సత్యం పదాన్ని సచ్చ+త్యచ్చగా చూశాము. సత్ అంటే మూర్తప్రపంచం. త్యత్ అంటే అమూర్తప్రపంచం. ఆకాశం, వాయువు అమూర్తప్రపంచం కిందికి వస్తాయి. అగ్ని, జలం, భూమి మూర్తప్రపంచం కిందికి వస్తాయి. సమష్టి సూక్ష్మశరీరం అమూర్తప్రపంచం కిందికి వస్తుంది; సమష్టి స్థూలప్రపంచం మూర్తప్రపంచం కిందికి వస్తుంది. అంటే హిరణ్యగర్భశరీరం సమష్టి మూర్తామూర్తప్రపంచం. సమష్టి ప్రపంచరూపేణ హిరణ్యగర్భ ఉపాసన ఇది. శీక్షావల్లీతో కూడా ఇది వస్తుంది.

ఈ ఉపాసన ఫలం ఏమిటి? అది ఉపాసకుడు దేనికోసం చేస్తే దానిమీద ఆధారపడి ఉంటుంది. లౌకిక విజయంకోసం చేస్తే లోకజయం, శత్రుజయం కలుగుతుంది. ఇక్కడ ఉండగా శత్రువులను జయిస్తాడు. శంకరులవారు, మనకున్న ముఖ్యమైన శత్రువు అసత్యం చెప్పటం అని, సత్యరూపేణ హిరణ్యగర్భ ఉపాసన చేస్తే అసత్యశత్రువును జయిస్తాడు అని చెప్పారు. అంటే అబద్ధాలు చెప్పే బలహీనతను జయిస్తాడు, మరణించాక పుణ్యలోకాలకు వెళతాడు.

## 5.5 – సత్య బ్రహ్మ సంస్థాన బ్రాహ్మణము

మంత్రం 5.5.1

**ఆప ఏవేదమగ్ర ఆసుస్తా ఆపస్సత్యమసృజన్త సత్యం బ్రహ్మ ప్రజాపతిం ప్రజాపతిర్దేవాన్॥ తే దేవాస్సత్యమేవోపాసతే తదేతత్త్ర్యక్షరగ్ం సత్యమితి ॥**

**స ఇత్యేకమక్షరం తీత్యేకమక్షరం యమిత్యేకమక్షరం ప్రథమోత్తమే అక్షరే సత్యం మధ్యతోఽనృతం తదేతదనృతముభయతస్సత్యేన పరిగృహీతగ్ం సత్యభూయమేవ భవతి నైవం విద్వాగ్ంసమనృతగ్ం హినస్తి ॥**

ఈ బ్రాహ్మణము కూడా హిరణ్యగర్భ ఉపాసన గురించే చెబుతుంది. ఇక్కడ అంగ ఉపాసనను చెబుతున్నది. అంగి (ముఖ్యమైన) ఉపాసన హిరణ్యగర్భ ఉపాసన. ఉపాసన గురించి చెప్పేముందు మొదటి మంత్రంలో హిరణ్యగర్భను స్తుతిస్తున్నది. అంటే ముందు అధ్యాయంలో హిరణ్యగర్భకు మూడు పదాలు వాడింది. అవి మహత్, యక్షం. ప్రథమజం. అవి ఎందుకు వాడిందో ఇక్కడ వివరిస్తున్నది. ఈ పదాలను శంకరులవారు తరచు ఉటంకిస్తుంటారు.

**ఆప ఏవేదమగ్ర ఆసుః** – ఈ జగత్తు సృష్టికి పూర్వం ఆపః మాత్రమే ఉంది. హిరణ్యగర్భను స్తుతించేముందు, సృష్టి ఎలా జరిగిందో చెబుతున్నది ఉపనిషత్తు. సృష్టికి ముందు, అంతా అవ్యక్తరూపంలో ఉంది లేదా కారణప్రపంచ రూపంలో ఉంది. ఇక్కడ అవ్యక్తాన్ని ఉపనిషత్తు ఆపః అంటున్నది. ఆపః అంటే అవ్యక్తం లేదా ఈశ్వరుడు అనవచ్చు.

ఆపః అసలు అర్థం జలం. కాని ఇక్కడ జలం అని తీసుకోకూడదు; ఈశ్వరునిగా తీసుకోవాలని చూశాము. ముందు ఈశ్వరుడు కారణప్రపంచరూపంలో ఉన్నాడు.

**ఆపస్సత్యమసృజంత సత్యం బ్రహ్మ ప్రజాపతిం ప్రజాపతిర్దేవాన్** – ఈశ్వరునినుంచి సమష్టి సూక్ష్మ ప్రపంచ అధిష్ఠానం అయిన హిరణ్యగర్భ ఉద్భవించాడు; హిరణ్యగర్భనుంచి విరాట్, సమష్టి స్థూలప్రపంచ అధినేత పుట్టాడు. విరాట్ దేవతలను, మనష్యులను, పశువులను సృష్టించాడు. ఇది సృష్టిక్రమం.

ఈ సృష్టిలో ముందుగా పుట్టింది హిరణ్యగర్భ. ఆయనే తక్కిన సృష్టియొక్క కర్త.

**బ్రహ్మా దేవానం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా** – ముండకమ్1.1.1

బ్రహ్మ సృష్టి నిమిత్తకారణం, ఉపాదానకారణం కూడా. అందువల్ల బ్రహ్మ కార్యం అంతటా ఉంటాడు. ఆయన కార్యం అయిన ఈ జగత్తుకు కారణం కాబట్టి మహత్, **సర్వస్య కారణత్వాత్ మహత్ ఉచ్యతే.** జగత్తుకు కారణం కాబట్టి **మహత్.** ముందు పుట్టాడు కాబట్టి **ప్రథమజ.** దేవతలందరూ అతన్ని కొలుస్తారు

కాబట్టి **యక్షం**. వారికి సాక్షాత్ కారణం విరాట్ అయినా, అసలు సృష్టికర్త హిరణ్యగర్భ కాబట్టి దేవతలు హిరణ్యగర్భను పరమ పితామహునిగా కొలుస్తారు. ఇది హిరణ్యగర్భ స్తుతి. ఇది మంత్రంలో ముందు భాగంలో చూస్తాము.

**తే దేవాస్సత్యమేవోపాసతే తదేతత్ర్యక్షరగ్ం సత్యమితి** – ఆ దేవతలు హిరణ్యగర్భను సత్యంగా కొలుస్తారు. సత్యమ్ అనే ఈ పదానికి మూడు అక్షరాలు ఉన్నాయి. ఏమిటవి?

**స ఇత్యేకమక్షరం తీత్యేకమక్షరం యమిత్యేకమక్షరమ్** – ఆ మూడు అక్షరాలు స+తి+యం

**ప్రథమోత్తమే అక్షరే సత్యం మధ్యతోఽనృతమ్** – ఈ మూడు అక్షరాల్లో స అక్షరం, యమ్ అక్షరం సత్యాన్ని సూచిస్తే, మధ్యలోని తి అక్షరం అసత్యాన్ని సూచిస్తుంది. దీనికి కారణం ఉపనిషత్తు చెప్పదు కాని భాష్యకారులు ఇచ్చిన విశ్లేషణ అద్భుతంగా ఉంటుంది. స, య అక్షరాలలో అచ్చు ఉంది. స అంటే స్+అ; య అంటే య్+అ. అలా అక్షరాలకు అచ్చు కలిస్తే వాటికి విడిగా ఉనికి ఉంటుంది.

**తదేతదనృతముభయతస్సత్యేన పరిగృహీతగ్ం** – ఈ అసత్యం రెండు వైపులా సత్యంతో పట్టుకోబడివుంది.

**సత్యభూయమేవ భవతి** – ఇది సత్యమే అధికంగా గలది అవుతున్నది. అంటే ఈ సత్యం అనృతాన్ని కప్పేస్తుంది.

**నైవం విద్వాగ్ంసమనృతగ్ం హినస్తి** – ఈ సత్యాన్ని తెలుసుకుని ఎవరైతే సత్య హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, వారిని అసత్యం ఏమీ చేయలేదు.

మామూలుగా ఎవరికైనా తెలియక చెప్పిన అబద్ధానికి కొంచెం శిక్ష ఉంటుంది. కాని ఎవరైనా ఈ సత్యహిరణ్యగర్భ ఉపాసన చేస్తే, ఆ కాస్త శిక్ష కూడా అతనికి పడదు. అంటే ఈ ఉపాసన వారిని రక్షిస్తుంది.

అసలు ఈ ఉపాసన చేసే వ్యక్తి అబద్ధాలు ఆడడు. ఒకవేళ తనకు తెలియకుండానే అబద్ధం ఆడినా ఆ పాపం అతనికి అంటదు. అంతేకాదు, ఉపనిషత్తు చెప్పకపోయినా, భాష్యకారులు ఇంకొక అడుగు ముందుకు వేస్తున్నారు. ఇటువంటి సత్యోపాసన చేసినవారు, వారికి తెలియకుండా అబద్ధం చెప్పినా, భగవంతుడు అతని పలుకును సత్యవాక్కు అయ్యేలాగా చేస్తాడు.

దీనికి ఉదాహరణగా మనం దశరథుడు పొందిన శాపాన్ని గుర్తు తెచ్చుకోవచ్చు. దశరథుడు లేడిపిల్ల అనుకుని శ్రవణ కుమారుణ్ణి సంహరించినప్పుడు అతని తండ్రి మాలాగే పుత్రశోకంతో మరణిస్తావు అన్నాడు. అప్పటికి దశరథునికి పుత్రులు లేరు. అందువల్ల ఆయన శాపానికి దశరథుడు సంతోషించాడు. పుత్రశోకంతో మరణించాలి అంటే ముందు పుత్రులు ఉండాలి కదా, అయితే తనకు పుత్రులు పుడతారన్నమాట అని సంతోషించాడు.

ఆ విధంగా సత్యఉపాసన చేసినవారు ఏం మాట్లాడినా అది సత్యం అవుతుంది.

మంత్రం 5.5.2

**తద్యత్తత్సత్యమసౌ స ఆదిత్యో య ఏష ఏతస్మిన్మణ్డలే పురుషో యశ్చాయం దక్షిణేఽక్షన్ పురుషస్తావేతావన్యోన్యస్మిన్ ప్రతిష్ఠితౌ ॥ రశ్మిభిరేషోఽస్మిన్ ప్రతిష్ఠితః ప్రాణైరయమముష్మిన్ స యదోత్క్రమిష్యన్ భవతి శుద్ధమేవైతన్మణ్డలం పశ్యతి నైనమేతే రశ్మయః ప్రత్యాయన్తి ॥**

ముందు మంత్రంలో హిరణ్యగర్భస్తుతి చూశాము. ఎలా హిరణ్యగర్భ మహత్, యక్షం, ప్రథమజం అయ్యాడో చూశాము. సత్యంమీద హిరణ్యగర్భ ఉపాసన ఎలా చెయ్యాలో, సత్యం పదం గొప్పదనం ఏమిటో కూడా చూశాము.

ఇప్పుడు హిరణ్యగర్భ ఉపాసన, రెండు స్థానాల్లో చూస్తాము. **స్థానద్వయే హిరణ్యగర్భ ఉపాసన.** మొదటి ఉపాసన ఆదిత్య మండలంమీద అయితే, రెండవ ఉపాసన దక్షిణ అక్షిమీద ఉపాసన. ఆదిత్య మండలం అంటే సూర్యమండలంలో ఉన్న హిరణ్యగర్భ. అది అధిదైవ ఉపాసన అవుతుంది; దక్షిణ అక్షి అంటే కుడికన్నులో ఉన్న హిరణ్యగర్భ. ఇది అధ్యాత్మిక ఉపాసన అవుతుంది. అంటే ఒకటి సమష్టిపరంగా, ఇంకొకటి వ్యష్టిపరంగా చేస్తారు. ఇది ఈ మంత్రంయొక్క సారాంశం. దీనిద్వారా రెండు విషయాలు తెలుసుకుంటాము.

**తావేతౌ అన్యోన్యస్మిన్ ప్రతిష్ఠితౌ**– ఆధ్యాత్మికం, ఆధిదైవికం ఒకదానిమీద ఒకటి పరస్పరం ఆధారపడి ఉన్నాయి.

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।**

**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ – గీత 15.6**

ఇదే భావనను గీతలో కూడా చూస్తాము.

**రశ్మిభిరేషోఽస్మిన్ ప్రతిష్ఠితః** – ఈ ఆదిత్యుడు తన సూర్యకిరణాలద్వారా వ్యష్టిలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. జీవుడు ఎలా సూర్యభగవానునికి సహాయపడతాడు? ఆ దేవతలకు అర్ఘ్యం సమర్పించటంద్వారా తోడ్పడతాడు. నారాయణోపనిషత్తులో జీవుడు ఇంద్రియాలద్వారా దేవతలకు ఆహుతులను ఇస్తాడని వస్తుంది. ఆ విధంగా సమష్టి, వ్యష్టి రెండూ కూడా హిరణ్యగర్భ రూపమే. ఇది మనం తెలుసుకునే మొదటి అంశము.

రెండవ అంశం **అరిష్టదర్శనం** అంటారు. అంటే అశుభసూచకం. ఇంతకు ముందేమన్నాము? ఆదిత్యుడు, తన కిరణాలద్వారా వ్యష్టిని అనుగ్రహిస్తాడు అన్నాము. అంతేకాక, మన ఇంద్రియాలు పని చెయ్యటానికి అధిష్ఠానదేవతలు ఉన్నారని చూశాము. ఉదాహరణకు కన్నుకు అధిష్ఠానదేవత సూర్యుడు. ఒక వ్యక్తి మరణశయ్యమీద ఉన్నప్పుడు, నెమ్మదిగా అధిష్ఠానదేవతలు ఆయా ఇంద్రియాలనుంచి తమ శక్తిని తీసుకుంటారు. ఆ విధంగా మరణించే వ్యక్తికి చూపు మందగిస్తుంది; మాట తడబడుతుంది.

**నైనమేతే రశ్మయః ప్రత్యాయంతి** – అలా మరణశయ్యమీద ఉన్న వ్యక్తిని ఈ సూర్యకాంతులు బాధించవు. అంటే అతను అంత వేడి కిరణాలు ఉన్న సూర్యుణ్ణి, చంద్రునిలా చూస్తాడు. ఎప్పుడైతే అతనికి అలా సూర్యకాంతి తెలియలేదో, అది అరిష్ట సూచన. అంటే అతను మరణాన్ని సమీపిస్తున్నాడని సంకేతం.

ఇవి అదనంగా మనం తెలుసుకున్న అంశాలు.

మంత్రం 5.5.3

**య ఏష ఏతస్మిన్మణ్డలే పురుషస్తస్య భూరితి శిరః ॥ ఏకగ్ం శిర ఏకమేతదక్షరం భువ ఇతి బాహూ ద్వౌ బాహూ ద్వే ఏతే అక్షరే స్వరితి ప్రతిష్ఠా ద్వే ప్రతిష్ఠే ద్వే ఏతే అక్షరే తస్యోపనిషదహరితి హన్తి పాప్మానం జహాతి చ య ఏవం వేద ॥**

ఇది కూడా ఇంకొక అంగ ఉపాసన. దీనిని **ఆదిత్యమండలే హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. ఇందులో ఇంతకు ముందు చూసిన ఉపాసనకన్నా మరికొన్ని వివరాలు ఉన్నాయి. ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసనను ఆయన అవయవాలతో పాటు చేస్తాము. ఆ అవయవాలు తల, రెండు చేతులు, రెండు పాదాలు. ఈ అవయవాలను వ్యాహృతి మంత్రాలతో పోలుస్తాము.

ఈ వ్యాహృతులను తైత్తిరీయోపనిషత్తులో కూడా చూస్తాము. ఇవి మూడు. అవి భూః భువః సువః.

**య ఏష ఏతస్మిన్మండలే పురుషస్తస్య భూరితి శిరః** – ఈ మండలంలో ఏ పురుషుడైతే ఉన్నాడో, ఆ పురుషునికి 'భూః' అనేది తల.

భువః అంటే హిరణ్యగర్భ చేతులు; సువః అంటే హిరణ్యగర్భ పాదాలు. భూః ఒక అక్షరం, ఒక తలను సూచిసున్నది బాగానే ఉంది కాని భువః, సువః రెండేసి చేతులకు, రెండేసి కాళ్ళకు ఎలా సంకేతం? దీనికి జవాబు ఉపనిషత్తే చెబుతున్నది.

**ఏకగ్ం శిర ఏకమేతదక్షరమ్** – తల ఒకటి, భూః అనే అక్షరం కూడా ఒకటి;

**భువ ఇతి బాహూ ద్వౌ బాహూ ద్వే ఏతే అక్షరే** – భువః అనేది రెండు బాహువులు. బాహువులు రెండు, ఈ అక్షరాలు కూడా రెండు.

**స్వరితి ప్రతిష్ఠా ద్వే ఏతే అక్షరే** – సువః అనేది రెండు కాళ్ళు. కాళ్ళు రెండు, ఈ అక్షరాలు కూడా రెండు. ఈ విధంగా ఉపాసన చెయ్యాలి. ఇది –

**ఆదిత్యమండలే వ్యాహృతి అవయవక హిరణ్యగర్భ ఉపాసన**

చివరగా ఈ ఉపనిషత్తు హిరణ్యగర్భకు ఒక రహస్యనామం ఇస్తున్నది. ఈ రహస్యనామాన్ని **ఉపనిషత్తు** అంటారని మొదట్లో ఈ ఉపనిషత్తులోనే చూశాము. ఉదాహరణకు ఒక రహస్యనామం **సత్యస్య సత్యమ్**. ఇక్కడ రహస్యనామం ఏమిటి?

**తస్యోపనిషదహరితి** – ఈ హిరణ్యగర్భయొక్క రహస్యనామం అహః.

**హంతి జహాతి చ పాప్మానం య ఏవం వేద** – అహః పదం రెండు ధాతువులనుంచి వచ్చింది. హన్ ధాతువునుంచి వచ్చిన దాని అర్థం హింసించటం; హా అనే ధాతువునుంచి వచ్చిన దాని అర్థం విడిచి పెట్టటం. ఈ విధంగా ఉపాసన చేసిన వ్యక్తి పాపాలను నశింపజేసి, పాపాలను విడిచి పెడతాడు.

మంత్రం 5.5.4

**యో౽యం దక్షిణే౽క్షన్ పురుషస్తస్య భూరితి శిర ఏకగ్ం శిర ఏకమేతదక్షరం భువ ఇతి బాహూ ద్వౌ బాహూ ద్వే ఏతే అక్షరే స్వరితి ప్రతిష్ఠా ద్వే ప్రతిష్ఠే ద్వే ఏతే అక్షరే తస్యోపనిషదహమితి హన్తి పాప్మానం జహాతి చ య ఏవం వేద ॥**

ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసన కుడికంటిమీద చేస్తాము. ఇది కూడా ఇంచుమించు మూడవ మంత్రం లాగానే ఉంది. ఆ మంత్రంలో హిరణ్యగర్భ ఉపాసన ఆదిత్యమండలంమీద చేస్తే, నాలుగవ మంత్రం (దక్షిణ అక్షమ్) కుడి కన్నుమీద చేస్తాము. ఈ రెండింటిలోనూ ఉపాస్యదేవత ఒకటే; ఉపాసనచేసే స్థానం మారుతుంది అంతే. మొదటిది ఆధిదైవిక స్థానం, రెండవది ఆధ్యాత్మిక స్థానం. అందువల్ల స్థానభేదమే ఉంది కాని దైవభేదం లేదు.

మళ్ళీ అవే వ్యాహృతులు, అవే అంగాలు. అంటే భూః హిరణ్యగర్భ తల; భువః హిరణ్యగర్భ చేతులు; సువః హిరణ్యగర్భ కాళ్ళు. కాకపోతే రహస్యనామం మారుతుంది. ఆదిత్యమండలంలో రహస్యనామం అహః అని చూశాము. ఇక్కడేమిటి?

**తస్యోపనిషదహమితి** – ఈ హిరణ్యగర్భ రహస్యనామం అహమ్. అహమ్ అంటే నేను. వ్యష్టిలోని హిరణ్యగర్భను అహమ్ అంటారు. ఈ అహమ్ కూడా అహః లాగానే హన్, హా ల ధాతువులనుంచే వచ్చింది. అందువల్ల దీనికి కూడా ఫలం ఒకటే. ఈ ఉపాసన చేసిన వ్యక్తి పాపాలను నశింపజేసి, పాపాలను విడిచిపెడతాడు. ఇది –

**దక్షిణ అక్షి తస్థ వ్యాహృతి అవయవక హిరణ్యగర్భ ఉపాసన**

హిరణ్యగర్భను సత్యం అన్నారు కాబట్టి, ఈ బ్రాహ్మణాన్ని కూడా సత్య బ్రాహ్మణముకిందే తీసుకోవచ్చు. ఆ విధంగా నాలుగు, ఐదు బ్రాహ్మణాలను సత్య బ్రాహ్మణము–1, సత్య బ్రాహ్మణము–2గా తీసుకోవచ్చు.

# 5.6 – మనో(మయ) బ్రాహ్మణము

మంత్రం 5.6.1

**మనోమయోఽయం పురుషో భాస్సత్యస్తస్మిన్నన్తర్హృదయే యథా వ్రీహిర్వా యవో వా స ఏష సర్వస్యేశానస్సర్వస్యాధిపతిస్సర్వమిదం ప్రశాస్తి యదిదం కిఞ్చ ॥**

ఈ బ్రాహ్మణము కూడా హిరణ్యగర్భ ఉపాసననే సూచిస్తుంది. ఇక్కడ **గుణవిశిష్ఠ హిరణ్యగర్భ ఉపాసన** చూస్తాము. నిజానికి అంతకుముందు అధ్యాయాల్లో పంచవిధ హిరణ్యగర్భ ఉపాసన, అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన చూశాము. ఇక్కడ హిరణ్యగర్భను హృదయంమీద ఉపాసన చేస్తాము. ఇక్కడ కూడా ఐదు గుణాలు చూస్తాము.

1. **మనోమయోఽయం పురుషః తస్మిన్నంతర్హృదయే** – ఈ హిరణ్యగర్భ అన్ని ప్రాణుల్లోనూ మనస్సులో లభ్యమవుతున్నాడు.

2. **భాస్సత్యో** – రెండవ గుణం ప్రకాశ స్వరూపం. ప్రకాశస్వరూపం ఎందుకంటే జ్ఞానరూపంగా ప్రకాశిస్తాడు.

3. **సర్వస్య ఈశానః** – సర్వాన్ని శాసిస్తాడు.

4. **సర్వస్య అధిపతిః** – సర్వానికి అధిపతి.

5. **సర్వమిదం ప్రశాస్తి యదిదం కించ** – ఈ దృశ్య జగత్తులో ఉన్న సర్వాన్ని నియంత్రిస్తాడు. ఈ మూడు పదాలకూ ఇంచుమించు అర్థం ఒకటే.

ఈ విధంగా మనోమయం, ప్రకాశ స్వరూపం, సర్వస్య ఈశానుడు, సర్వస్య అధిపతి, సర్వానికి నియంత అని హిరణ్యగర్భమీద ఉపాసన చెయ్యాలి. హృదయంలో ఉన్న మనస్సులో ఉండే హిరణ్యగర్భ పరిమాణం ఎంత ఉంటుంది?

**యథా వ్రీహిర్వా యవో వా** – ధాన్యపుగింజ అంత గాని, గోధుమగింజ అంత గాని ఉంటాడు. సర్వవ్యాపకమైన హిరణ్యగర్భ హృదయంలో అలా ఉంటాడు.

**స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః। అమృతో హిరణ్మయః।అన్తరేణ తాలుకే। య ఏషస్తన ఇవావలమ్బతే। సేంద్రయోనిః। యత్రాసౌ కేశాన్తో వివర్తతే। వ్యపోహ్య శీర్షకపాలే।** – శీక్షావల్లీ

అందులో కూడా మనోమయ గుణవిశిష్ఠ ఉపాసననే చూస్తాము. హిరణ్యగర్భను మనోమయ పురుషుడిగా చూడటంవల్ల ఈ బ్రాహ్మణాన్ని మనో(మయ) బ్రాహ్మణము అంటారు.

# 5.7 – విద్యుద్బ్రాహ్మణము

## మంత్రం 5.7.1

**విద్యుద్బ్రహ్మేత్యాహుర్విదానాద్విద్యుద్విద్యత్యేనం పాప్మనో య ఏవం వేద విద్యుద్బ్రహ్మేతి విద్యుద్ధ్యేవ బ్రహ్మ ॥**

ఇక్కడ కూడా ఇంకో విధమైన హిరణ్యగర్భ ఉపాసనను చూస్తాము. ఇది **విద్యుత్ రూపేణ హిరణ్య గర్భ ఉపాసన**. అందువల్ల ఈ బ్రాహ్మణాన్ని విద్యుద్బ్రాహ్మణము అంటారు.

**విద్యుద్బ్రహ్మేత్యాహుః** – విద్యుత్ అంటే మెరుపు. మెరుపును విద్యుత్ అంటారు. బ్రహ్మ అంటే సగుణబ్రహ్మ లేదా హిరణ్యగర్భ. కేనోపనిషత్తులో కూడా విద్యుత్ ఉపాసన చూస్తాము. అక్కడ యక్షుడు మెరుపులా మెరిసి మాయమయ్యాడు కాబట్టి, మెరుపుమీద ఉపాసన చెయ్యమన్నారు. అంటే అక్కడ యక్షుడు క్షణంసేపే ఉన్నాడు. మెరుపు కూడా క్షణంలో మెరిసి మాయమవుతుంది కాబట్టి మెరుపుమీద హిరణ్యగర్భ ఉపాసన చెయ్యమన్నారు అందులో.

ఇక్కడ మెరుపుమీద హిరణ్యగర్భ ఉపాసన చేసే కారణం వేరే ఉంది. ఉపనిషత్తే ఆ కారణాన్ని చెబుతున్నది.

**విదానాద్విద్యుద్విద్యత్యేనం పాప్మనః** – విద్యుత్ అనే పదానికి పగలగొట్టి, (చీకటిని) తరిమి గొట్టేది అని వ్యుత్పత్తి.

విద్యుత్ ఒక్కోసారి చెట్లను, మనుష్యులను కూడా నాశనం చేస్తుంది కాని సాధారణంగా ఆ మెరుపు చీకటిని నాశనం చేస్తుంది.

**య ఏవం వేద విద్యుద్బ్రహ్మేతి విద్యుద్ధ్యేవ బ్రహ్మ** – విద్యుత్ బ్రహ్మ అని ఎవరైతే ఈ విధంగా ఉపాసన చేస్తాడో, అతనికి ప్రతికూలమైన పాపాలను ఈ ఉపాసన నశింపజేస్తుంది. ఎందుకంటే విద్యుత్తే బ్రహ్మ.

వేదాంతజ్ఞానం పొందాలనుకునే సాధకునికి ఈ ఉపాసన తోడ్పడుతుంది. అతను చేసిన పాపాలు గురుప్రాప్తికి, శ్రవణప్రాప్తికి, జ్ఞానప్రాప్తికి ఆటంకాలు కలుగజేస్తాయి. ఈ ఉపాసన ఆ పాపాలను తొలగించి, వారి మార్గాన్ని సుగమం చేస్తుంది.

# 5.8 - వాగ్ధేను బ్రాహ్మణము

మంత్రం 5.8.1

**వాచం ధేనుముపాసీత తస్యాశ్చత్వారః స్తనాస్స్వాహాకారో వషట్కారో హన్తకారస్స్వధాకారస్తస్యై ద్వౌ స్తనౌ దేవా ఉపజీవన్తి స్వాహాకారం చ వషట్కారం చ హన్తకారం మనుష్యాస్స్వధాకారం పితరస్తస్యాః ప్రాణ ఋషభో మనో వత్సః ॥**

ఇది కూడా హిరణ్యగర్భ ఉపాసనే. దీన్ని **వాగ్ధేను రూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. హిరణ్యగర్భను వేదాలుగా చూస్తాము ఇందులో. ఇది చాలా ముఖ్యమైన అంశం. మన సాంప్రదాయంలో వేదాలను హిరణ్యగర్భ లేదా బ్రహ్మగా కొలుస్తాము. చతుర్ముఖ బ్రహ్మయొక్క నాలుగు ముఖాలు నాలుగు వేదాలకు ప్రతీకలు అంటారు. భగవద్గీతలో కూడా మూడవ అధ్యాయంలో బ్రహ్మను వేదాలతో పోలుస్తాడు కృష్ణపరమాత్మ.

**వాచం ధేనుముపాసీత** – వాక్కు అనే ధేనువును ఉపాసించాలి. ఇక్కడ వేదాలను వాక్కు అనే కామధేనువుతో పోలుస్తున్నది ఉపనిషత్తు. అంటే పాలిచ్చే ఆవుగా చూస్తున్నది. కామధేనువు అంటే కోరికలు తీర్చే ఆవు.

**తస్యాశ్చత్వారః స్తనాస్స్వాహాకారో వషట్కారో హంతకార స్స్వధాకారమ్** – ఆ ఆవుకు స్వాహాకారం, వషట్కారం, హంతకారం, స్వధాకారం అనే నాలుగు స్తనాలు ఉన్నాయి.

**తస్యై ద్వౌ స్తనౌ దేవా ఉపజీవంతి స్వాహాకారం చ వషట్కారం చ** – ఆ ధేనువుయొక్క స్వాహాకారం, వషట్కారం అనే రెండు స్తనాలద్వారా దేవతలకు ఆహుతులను ఇస్తుంది.

**హంతకారం మనుష్యాస్స్వధాకారం పితరః** – హంతకారం మనుష్యులకు, స్వధాకారం పితృదేవతలకు ఆహుతులను ఇస్తుంది. స్వాహా, వషట్ అనే ఈ రెండు శబ్దాలతోనే దేవతలకు హవిస్సు ఇవ్వబడుతుంది. అలా హంత శబ్దంతో మనుష్యులకు, స్వధా శబ్దంతో పితృదేవతలకు ఆహారాన్ని సమర్పిస్తారు.

**తస్యా ప్రాణ ఋషభః మనో వత్సః** – ఆ ధేనువుకు ప్రాణమే ఆంబోతు; మనస్సే దూడ. ధేనువు వాక్యొక్క రూపం కాబట్టి వాక్కుకు శక్తినిచ్చేది ప్రాణం కాబట్టి ఆంబోతు ప్రాణం. ప్రాణం పోతే మాటరాదు కదా. ఛాందోగ్యోపనిషత్తులో గురువు 15 రోజులు ఉపవాసం ఉండి రమ్మంటాడు శిష్యుణ్ణి. 16వ రోజు వేదాలను వల్లించమంటే అతనికి ప్రాణశక్తి సన్నగిల్లటంవల్ల అతను వాటిని వల్లించలేకపోతాడు.

దూడ కోసమే ఆవు పాలనిస్తుంది. అందువల్ల దూడ చనిపోతే, ఆవు ముందు బొమ్మ దూడను పెట్టి, అది పాలిచ్చేలా చేస్తారంటారు. భగవద్గీతలో కూడా కృష్ణపరమాత్మ అర్జునుడనే దూడకోసం ఉపనిషత్తులనే ఆవునుంచి గీత అనే పాలను పిండాడు అని చూస్తాము.

గురువు బోధ చెయ్యటానికి ప్రేరణ శిష్యుడు. వాక్కు రూపేణ వేదాలను పలకాలంటే మనస్సులో ప్రేరణ కలగాలి. అంటే అవి ఉచ్చరించాలనే కోరిక మనస్సులో ఉత్పన్నమవాలి. ఆ విధంగా మనస్సు ప్రేరణ ఇస్తే, ప్రాణం శక్తినిస్తే, వాక్ధేనువు వేదాన్ని ఇస్తుంది. ఇదీ దీని భావన. ఈ ఉపాసన పేరేమిటి? వాగ్ధేను రూపేణ హిరణ్యగర్భ ఉపాసన. అందువల్ల ఈ బ్రాహ్మణానికి వాగ్ధేను బ్రాహ్మణము అని పేరు వచ్చింది.

## 5.9 - వైశ్వానరాగ్ని బ్రాహ్మణము

మంత్రం 5.9.1

**అయమగ్నిర్వైశ్వానరో యోఽయమన్తః పురుషే యేనేదమన్నం పచ్యతే యదిదమద్యతే॥**
**తస్యైష ఘోషో భవతి యమేతత్కర్ణావపిధాయ శృణోతి ॥**
**స యదోత్క్రమిష్యన్ భవతి నైనం ఘోషగ్ం శృణోతి ॥**

ఇది కూడా హిరణ్యగర్భ ఉపాసనే. ఈ హిరణ్యగర్భ వ్యష్టి కడుపులో వైశ్వానరాగ్ని రూపంలో ఉన్నాడు. అందువల్ల ఈ ఉపాసనను **వైశ్వానరాగ్ని రూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు.

**అయమగ్నిర్వైశ్వానరో యోఽయమంతః పురుషే యేనేదమన్నం పచ్యతే యదిదమద్యతే** – ఈ అగ్ని వైశ్వానరుడు. ఏ అగ్ని అయితే వ్యక్తి లోపల ఉన్నాడో, ఏ అగ్నితో ఈ ఆహారం జీర్ణం చెయ్యబడుతున్నదో, ఏ అగ్ని ఈ ఆహారాన్ని స్వీకరిస్తున్నదో, ఆ అగ్నే వైశ్వానరుడు. ఆ వైశ్వానరుడు లోపల ఉన్నాడని ఎలా తెలుసు? ఉపనిషత్తే చెబుతున్నది.

**తస్యైష ఘోషో భవతి యమేతత్కర్ణావపిధాయ శృణోతి** – చెవులను రెండింటిని మూసి ఆ వ్యక్తి వింటే ఏ శబ్దాన్ని వింటాడో, ఆ ఘోష ఆ అగ్నికి చెందినదే.

ఇక్కడ కూడా ఇంకొక అరిష్ట దర్శనాన్ని చూస్తాము. సూర్యునిమీద హిరణ్యగర్భ ఉపాసన చూసినప్పుడు ఒక అరిష్టాన్ని చూశాము. ఇక్కడ ఇంకొకటి చూస్తాము.

**స యదోత్క్రమిష్యన్ భవతి నైనం ఘోషగ్ం శృణోతి** – ఆ వ్యక్తి ఏ కాలంలో మరణించబోతాడో, అప్పుడు ఘోషను వినలేడు. సూర్యుని ఉపాసనలో అంత ప్రకాశవంతమైన సూర్యకాంతిని అతను చూడలేడు అన్నాము. అంటే అతనికి సూర్యకాంతి చంద్రకాంతిలాగా కనిపిస్తుంది. అప్పుడు అతని మరణం ఆసన్నమయినట్టు అర్థం. అలాగే ఇక్కడ కూడా ఒక వ్యక్తికి చెవులు మూసుకుంటే, తనలోంచి ఘోష వినపడకపోతే, అతనికి మరణం ఆసన్నమయినట్టే అర్థం. ఆ శబ్దం హిరణ్యగర్భ దీవెన. మరణించే సమయంలో అధిష్ఠానదేవతలు వాటి స్థానాలనుంచి బయటకు వస్తారని చూశాము. అంటే అతనికి సరిగ్గా జీర్ణమవదు, చూపు మందగిస్తుంది. అలా ఒక్కొక్కటీ దాని శక్తి తగ్గుతూ వస్తుంది.

ఇక్కడ వైశ్వానర అగ్నిమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తాము కాబట్టి ఈ బ్రాహ్మణానికి వైశ్వానరాగ్ని బ్రాహ్మణము అని పేరు వచ్చింది.

# 5.10 - గతి బ్రాహ్మణము

ఇంతకు ముందు బ్రాహ్మణమువరకూ అనేక రకాల ఉపాసనలు, హిరణ్యగర్భమీద చూశాము. ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసన ఫలం చూస్తాము. ఈ ఉపాసనకు రెండు ఫలాలు ఉన్నాయి. అవి – నిష్కామ ఉపాసన అయితే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత కలుగుతాయి. అదే సకామ ఉపాసన అయితే బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది. ఈ ఉపాసకుడు మరణించాక బ్రహ్మలోకానికి చేరుకుంటాడు. అతని ప్రయాణం గురించి చెబుతుంది ఈ బ్రాహ్మణము. ప్రయాణాన్ని గతి అంటారు. అందువల్ల ఈ బ్రాహ్మణము పేరు గతి బ్రాహ్మణము.

మనం ఇంతకుముందు కూడా ఈ ఉపనిషత్తులోనే ఉపాసకుని ప్రయాణం గురించి చూశాము.

**ఉపాసకుడు శుక్లగతిద్వారా బ్రహ్మలోకం చేరుతాడు**

**కర్మఠుడు కృష్ణగతిద్వారా స్వర్గలోకం చేరుతాడు**

**జ్ఞానికి ప్రయాణమే లేదు. జ్ఞాని గతిరహితుడు**

ఇక్కడ ఉపాసకుని గురించి చూస్తున్నాము. అతను శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. బ్రహ్మలోకానికి వెళ్ళాక అతని గతి ఏమిటి? అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది, ముక్తి పొందవచ్చు. లేదా అక్కడ కూడా జ్ఞానం పొందకుండా తిరిగి రావచ్చు. అక్కడ ముక్తి పొందితే దానిని క్రమముక్తి అంటారు. ఎవరికి క్రమముక్తి వస్తుందో, ఎవరికి రాదో బ్రహ్మసూత్రాల్లో విశ్లేషణ చూస్తాము.

శాస్త్రంలో ఈ జీవుడు వెళ్ళే మార్గాన్ని, అతన్ని తీసుకువెళ్ళే దేవతలనుబట్టి పిలుస్తారు. ఆ దేవతలను అతివాహిత దేవతలు అంటారు. భగవద్గీతలో ఎనిమిదవ అధ్యాయంలో శుక్లగతిలో తీసుకువెళ్ళే దేవతలు అగ్నిదేవత, అహర్దేవత, శుక్లపక్షదేవత, ఉత్తరాయణదేవత అని వస్తుంది.

ఇక్కడ గతి బ్రాహ్మణములో మూడు దేవతలనే చూస్తాము. అవి వాయుదేవత, ఆదిత్యదేవత, చంద్రదేవత.

## మంత్రం 5.10.1

**యదా వై పురుషోఽస్మాల్లోకాత్ప్రైతి స వాయుమాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే యథా రథచక్రస్య ఖం తేన స ఊర్ధ్వ ఆక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే యథా లమ్బరస్య ఖం తేన స ఊర్ధ్వ ఆక్రమతే స చన్ద్రమసమాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే యథా దున్దుభేః ఖం తేన స ఊర్ధ్వ ఆక్రమతే స లోకమాగచ్ఛత్యశోకమహిమం తస్మిన్ వసతి శాశ్వతీస్సమాః ॥**

**యదా వై పురుషోఽస్మాల్లోకాత్ప్రైతి స వాయుమాగచ్ఛతి** – వ్యక్తి ఎప్పుడైతే ఈ లోకంలో మరణించి, పైకి నిష్క్రమిస్తాడో, అప్పుడతను వాయువును చేరుతాడు.

**తస్మై స తత్ర విజిహీతే యథా రథచక్రస్య ఖమ్** – అక్కడ అంతరిక్షంలో సంచరించే ఆ వాయువు రథచక్రంయొక్క ఛిద్రం అంత దారిని ఇస్తుంది.

**తేన స ఊర్ధ్వ ఆక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి** – ఆ మార్గంద్వారా ఆ జీవుడు పైకి అభిముఖుడై ముందుకు సాగి ఆదిత్యుణ్ణి చేరుతాడు.

**తస్మై స తత్ర విజిహీతే యథా లంబరస్య ఖమ్** – ఆదిత్యుడు కూడా ఈ ఉపాసకునికి తననుంచి వెళ్ళటానికి దారి ఇస్తాడు. అది దమరువుయొక్క ఛిద్రం అంత మార్గం ఉంటుంది.

**తేన స ఊర్ధ్వ ఆక్రమతే స చంద్రమసమాగచ్ఛతి** – ఆ ఉపాసకుడు ఆ మార్గంద్వారా ఇంకా పైకి వెళ్ళి చంద్రుణ్ణి చేరుతాడు.

**తస్మై స తత్ర విజిహీతే యథా దుందుభేః ఖమ్** – ఆ చంద్రుడు ఆ ఉపాసకునికోసం తనలో దారి ఇస్తాడు. ఆ దారి నగారాయొక్క ఛిద్రం అంత మార్గం ఉంటుంది.

**తేన స ఊర్ధ్వ ఆక్రమతే స లోకమాగచ్ఛతి** – దానిద్వారా ఆ జీవుడు ఊర్ధ్వంగా ప్రయాణించి ప్రజాపతి లోకాన్ని చేరుకుంటాడు. ఆ లోకం ఎలా ఉంటుంది?

**అశోకమహిమం తస్మిన్ వసతి శాశ్వతీస్సమాః** – అశోకం అంటే దుఃఖం లేని లోకం; అహిమం అంటే మంచు లేనిది. అంటే శరీరాన్ని పీడించని వాతావరణం ఉంటుంది. శాశ్వతీస్యమాః అంటే అనేక కల్పాల కాలం నివసిస్తాడు.

అలా ఒక ఉపాసకుడు శుక్లగతిద్వారా బ్రహ్మలోకం చేరుకుంటాడు. ఆ మార్గంలో ఉన్న దేవతల సంఖ్యను రకరకాలుగా చూస్తాము. ఇక్కడ ముగ్గురు దేవతలను మాత్రమే చూస్తున్నాము. ఇది ఒక రిలే రేసులా ఒక్కొక్క దేవతా తీసుకెళ్ళి, ఇంకొక దేవతకు అప్పచెబుతుంది. అక్కడ తనగుండా వెళ్ళటానికి ఆయా దేవత మార్గాన్ని ఇస్తుందని చూశాము. ఒకవేళ మార్గాన్ని ఇవ్వకపోతే, ఆ ఉపాసకుడు ముందుకు సాగలేడు.

ఇలా మూడూ దాటుకుంటూ బ్రహ్మలోకానికి వెళితే, అతనికి శారీరక బాధ ఉండదు. అంటే వాతావరణంలో హెచ్చుతగ్గులు ఉండవు; మానసిక బాధ అంటే శోకం ఉండదు. ఆనందంగా ఉంటాడు. అది కూడా శాశ్వతంగా ఉంటాడు. శాశ్వతం అంటే కొన్ని కల్పాల కాలం నివసిస్తాడు.

# 5.11 - తపో బ్రాహ్మణము

మంత్రం 5.11.1

**ఏతద్వై పరమం తపో యద్వ్యాహితస్తప్యతే పరమగ్ం హైవ లోకం జయతి య ఏవం వేద ॥ ఏతద్వై పరమం తపో యం ప్రేతమరణ్యగ్ం హరన్తి పరమగ్ం హైవ లోకం జయతి య ఏవం వేద॥ ఏతద్వై పరమం తపో యం ప్రేతమగ్నావభ్యాదధతి పరమగ్ం హైవ లోకం జయతి య ఏవం వేద ॥**

ఈ బ్రాహ్మణము ఎంతో ఉపయోగకరమైన బ్రాహ్మణము. అందరూ గుర్తుంచుకోతగ్గ బ్రాహ్మణము. ఎవరైనా అనారోగ్యం పాలయితేనో, శారీరక అవస్థ పడుతుంటేనో దాన్ని ఎలా స్వీకరించాలో వర్ణించే మంత్రాలు ఉన్నాయి ఇందులో. శారీరక బాధను తపస్సుగా స్వీకరించాలి. తపస్సు అంటేనే శరీరపీడనం. కష్టసహిష్ణుత్వం తపః. అంటే ఏదైనా కష్టం వస్తే తట్టుకునే ఇంద్రియనిగ్రహాన్ని తపస్సు అంటారు. కొన్ని ఉపవాసాలు చేస్తూ ఉంటాము. అప్పుడు ఆకలి వేసినా, ఏదైనా బాధేసినా ఎలా తట్టుకుంటామో, అలా అనారోగ్యం వచ్చినప్పుడు కూడా తట్టుకోవాలి.

ఆకలికి మాడటం, ఉపవాసం ఉండటం – ఈ రెండింటిలోనూ శారీరక బాధ ఒకటే. కాని వాటిని చూసే మన దృక్పథంలో మార్పు ఉంటుంది. ఎవరైనా మనకు అన్నం పెట్టకుండా మాడుస్తుంటే అది బాధగా ఉంటుంది. అదే మనమే ఒక రోజంతా ఉపవాసం చెయ్యటానికి నిశ్చయించుకుంటే, అది బాధగా అనిపించదు; దాన్ని ఒక తపస్సులా చేస్తాము. తపస్సులో శరీరపీడనం అంటే శరీరానికి బాధ ఉంటుంది. కాని మనం మానసికంగా బాధపడము.

**ఏతద్వై పరమం తపో యద్వ్యాహితస్తప్యతే** – వ్యాధి పొందిన వ్యక్తి దుఃఖాన్ని అనుభవించటం నిశ్చయంగా తపస్సే. మనం కావాలనుకుని ఉపవాసం ఉంటే తపస్సు అని చూశాము కదా. అలా ఏదో మన ప్రారబ్ధకర్మ బాగుండక, శారీరకంగా అవస్థ పడాల్సి వచ్చినా, దాన్ని తపస్సుగా భావించమంటుంది ఉపనిషత్తు. ఏడు రోజులు అన్నం తినకుండా ఉండాల్సివస్తే దాన్ని మనం ఏడురోజుల ఏకాదశి ఉపవాసంగా మలుచుకుంటే ఈ బాధ ఉండదు. మనం ఏదైనా రోగం రాగానే సణుగుతూ, గొణుగుతూ ఫిర్యాదు చేస్తూ ఉంటాము. లేదా నలుగురికి చెప్పుకుని, వారి జాలిని కోరుకుంటాము. అలా బాధపడటం మానేయమంటుంది ఉపనిషత్తు. అలా చెయ్యటంవల్ల కలిగే లాభం ఏమిటి?

**పరమగ్ం హైవ లోకం జయతి య ఏవం వేద** – ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తాడో, అతను నిశ్చయంగా పుణ్యలోకాలను జయిస్తాడు. ఏడురోజులు తినకుండా మాడాల్సివస్తే, దాన్ని ఏడురోజుల ఉపాసనగా స్వీకరిస్తే; దానివల్ల మన పుణ్యం లేదా చిత్తశుద్ధి పెరిగి, ఉన్నత లోకాలకు వెళతాము. ఇది మొదటిరకం తపస్సు.

**ఏతద్వై పరమం తపో యం ప్రేతమరణ్యగ్ం హరంతి** – మొదటి దశలో అనారోగ్యం వచ్చి, అది నయమయ్యే పరిస్థితి. ఇప్పుడు రెండవ దశను చూస్తున్నాము. ఒకవేళ ఆ అనారోగ్యం తీవ్రమైన స్థాయికి చేరుకుంటే, మామూలుగా

ఎవరైనా ఏం చేస్తారు? 'అయ్యో! నాకు జబ్బు ముదిరిపోయింది, రేపో మర్నాడో మరణిస్తాను, నా శవాన్ని బంధువులందరూ తీసుకువెళ్ళి స్మశానంలోనో, అరణ్యంలోనో పడేస్తారు' అని వాపోతారు.

ఈ బెంగను కూడా తపస్సుగా మలుచుకోమంటుంది ఉపనిషత్తు. ఈ మంత్రంలో అరణ్యం పదం వచ్చింది. ఇది వాడిన అర్థం మరణించే వ్యక్తి నా శవాన్ని తీసుకువెళ్ళి అరణ్యంలో పడేస్తారు అని భావిస్తాడు అని చెప్పటానికి.

కాని ఉపనిషత్తు ఈ అరణ్యం పదంనుంచే దాన్ని కూడా తపస్సుగా భావించమంటుంది. మనకున్న నాలుగు ఆశ్రమ ధర్మాల్లో మనం గృహస్థాశ్రమంనుంచి వానప్రస్థాశ్రమానికి వెళ్ళాలి. వానప్రస్థం అంటే అరణ్యంలోకి వెళ్ళాలి. మనం జీవించి వుండగా చూస్తూచూస్తూ అరణ్యంలోకి వెళ్ళలేకపోతున్నాము. బంధాలు అంత బలంగా ఉన్నాయి. అందువల్ల ప్రారబ్ధకర్మవల్ల అరణ్యంలోకి వెళ్ళాల్సివస్తే దాన్ని ఉన్నతస్థాయి అయిన వానప్రస్థానికి వెళ్ళటంగా భావించమంటుంది ఉపనిషత్తు. అంటే ఈ ప్రేతగమనాన్ని అరణ్యగమనంగా భావించమంటుంది.

అందువల్ల మరణించబోయే వ్యక్తి నేను మరణిస్తున్నాను, నేను మరణిస్తున్నాను అని బాధపడకుండా నేను తర్వాత వచ్చే ఆశ్రమానికి వెళుతున్నాను; నేను వానప్రస్థాశ్రమానికి వెళుతున్నాను అని భావించాలి. అంటే అతని దృక్పథంలో మార్పు రావాలి. దీని ఫలం ఏమిటి?

**పరమగ్ం హైవ లోకం జయతి య ఏవం వేద** – ఎవరైతే ఈ విధంగా తపస్సుగా మలుచుకుంటాడో, అతను పుణ్యలోకాలకు వెళతాడు. ఇది రెండవరకం తపస్సు.

**ఏతద్వై పరమం తపో యం ప్రేతమగ్నావభ్యాదధతి** – ఉపనిషత్తు మరణాన్ని తప్పించుకోమనదు. మరణం తప్పదని తెలుసుకుని, దాన్ని వేరే ఆశ్రమానికి వెళ్ళటంగా భావించి, దాన్ని మనసారా ఆహ్వానించండి అంటుంది. మరణించాక, ఆ శవాన్ని తీసుకువెళ్ళి అగ్నిదేవతకు ఆహుతి చేస్తారు. దాన్ని కూడా శరీర తపస్సుగా భావించ మంటుంది ఉపనిషత్తు. అగ్నిదేవునికి ఆహుతి చెయ్యటమంటే శరీరాన్ని కాలుస్తారు. దాన్ని కూడా తపస్సుగా స్వీకరించాలి అంటుంది.

మనం జీవించి ఉండగా వాతావరణంలో అనేక మార్పులను అనుభవిస్తాము. ఎండాకాలంలో ఎండ తీవ్రంగా ఉంటే, దాన్ని తపస్సుగా స్వీకరించండి అంటుంది ఉపనిషత్తు. చెమటలు కారిపోతున్నా, ఆ సమయంలోనే కరెంటు పోయినా కూడా, దాన్ని కూడా తపస్సుగా స్వీకరించమంటుంది ఉపనిషత్తు. ఒకవేళ బ్రతికుండగా ఇలాంటి భావనలు కలుగకపోతే కనీసం మరణ సమయంలోనైనా దాన్ని తపస్సుగా స్వీకరించమంటుంది.

**పరమగ్ం హైవ లోకం జయతి య ఏవం వేద** – ఎవరైతే తన శరీరాన్ని అగ్నిదేవుడు కాల్చటాన్ని తపస్సుగా భావిస్తాడో అతను ఉత్కృష్టమైన లోకాలను పొందుతాడు. ఇది మూడవరకం తపస్సు. ఈ విధంగా మూడు రకాల తపస్సులను చూశాము.

1. అనారోగ్యం వచ్చి, మాడాల్సి వస్తే, దాన్ని ఉపవాసంగా భావించటం.
2. అనారోగ్యం ముదిరి, తన శవాన్ని అరణ్యానికి తీసుకువెళితే దాన్ని వానప్రస్థాశ్రమానికి వెళ్ళినట్టుగా భావించటం.
3. తన శవదహనం చెయ్యటాన్ని ఎండాకాలపు గ్రీష్మతాపానికి ఆహుతి అయినట్టుగా భావించటం.

ఈ మూడు రకాల తపస్సు చేస్తే ఉన్నతలోకాలకు వెళతాడు. అదే నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి పొందుతాడు. దీనివల్ల భయాలన్నిటిలోకి పెద్దదైన మృత్యుభయం పోతుంది. ఈ తపస్సు గురించి చెబుతుంది కాబట్టి దీన్ని తపో బ్రాహ్మణము అంటారు.

ఈ భావన అనారోగ్యం ఉన్న మనిషి చెయ్యాలి. అనారోగ్యం ఉన్న వ్యక్తిని వ్యాహితుడు అంటారు. అందువల్ల దీన్ని వ్యాహిత బ్రాహ్మణము అని కూడా అంటారు.

# 5.12 - అన్న ప్రాణ బ్రాహ్మణము

మళ్ళీ కొన్ని హిరణ్యగర్భ ఉపాసనలు చూస్తాము. నిజానికి గతి బ్రాహ్మణము చివర్లో రావాల్సింది. అది ఉపాసన ఫలాన్ని సూచిస్తుంది. ఉపాసనలన్నీ అయ్యాక, ఫలం వస్తే బాగుంటుంది కాని, ఉపనిషత్తు చెప్పిన పద్ధతిని మనం విమర్శించకూడదు. మనమే ఉపాసనలన్నీ అయ్యాక మళ్ళీ ఒకసారి గతి బ్రాహ్మణాన్ని గుర్తు తెచ్చుకుంటే మంచిది.

ఇక్కడ ఉపాసనను **అన్నప్రాణ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. ఈ అన్నప్రాణాలకు ఒక విశిష్ఠ గుణాన్ని ఆపాదించారు. అందువల్ల ఈ ఉపాసనను ఇలా కూడా అనవచ్చు. **వీరగుణ విశిష్ఠ అన్నప్రాణ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన.**

హిరణ్యగర్భ వేరే ఎవరో కాదు, అన్నప్రాణమే. ఈ బ్రాహ్మణము సారాంశం చూద్దాము. అన్నమే బ్రహ్మ అని కొందరు చెపితే, ప్రాణమే బ్రహ్మ అని మరికొందరు చెబుతారు. అది కూడా సరికాదు. ఎందుకంటే అన్నం లేకపోతే ప్రాణం శుష్కించిపోతుంది. ప్రాణం లేకపోతే అన్నం కుళ్ళిపోతుంది.

మన శరీరంలో ప్రాణం ఉన్నంతసేపే శరీరానికి సేవ చేస్తాము. స్నానం చేసి, ముస్తాబులు చేసుకుంటాము. శరీరంనుంచి ప్రాణం పోగానే, అదే శరీరం శవం అయిపోతుంది. శవం అయిన కొన్ని గంటలకే శరీరం కుళ్ళిపోవటం మొదలవుతుంది. అంతవరకూ ప్రేమగా చూసిన మనవాళ్ళే ఎంత త్వరగా ఆ శవాన్ని పంపించేద్దామా అని చూస్తారు. అలాగని ప్రాణమే గొప్పది అందామా అంటే, ఆ ప్రాణం నిలవాలంటే దానిలో ఆహారం పడాలి. అన్నం లేకపోతే ప్రాణం ఎండిపోతుంది. అందువల్ల వాటి ఘనత విడివిడిగా లేదు. అవి ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయి.

## మంత్రం 5.12.1

**అన్నం బ్రహ్మేత్యేక ఆహుస్తన్న తథా పూయతి వా అన్నమృతే ప్రాణాత్ప్రాణో బ్రహ్మేత్యేక ఆహుస్తన్న తథా శుష్యతి వై ప్రాణ ఋతేఽన్నాదేతే హ త్వేవ దేవతే ఏకధాభూయం భూత్వా పరమతాం గచ్ఛతస్తద్ధ స్మాహ ప్రాతృదః పితరం కిగ్ంస్విదేవైవంవిదుషే సాధు కుర్యాం కిమేవాస్మా అసాధు కుర్యామితి స హ స్మాహ పాణినా మా ప్రాతృద కస్త్వేనయోరేకధాభూయం భూత్వా పరమతాం గచ్ఛతీతి ॥ తస్మా ఉ హైతదువాచ వీత్యన్నం వై వ్యన్నే హీమాని సర్వాణి భూతాని విష్టాని రమితి ప్రాణో వై రం ప్రాణే హీమాని సర్వాణి భూతాని రమన్తే ॥ సర్వాణి హ వా అస్మిన్ భూతాని విశన్తి సర్వాణి భూతాని రమన్తే య ఏవం వేద ॥**

**తత్ హ స్మాహ ప్రాతృదః పితరం కిగ్ంస్విత్** – ఈ విషయాన్ని ఈ విధంగా తెలుసుకున్న ప్రాతృదుడనే ఋషి తన తండ్రిని ఇలా అడిగాడు. ప్రాతృదుడు అనే ఋషి అన్నపానాదులను కలిపి ఉపాసన చెయ్యాలి అని చెప్పాడు.

ఈ రెండూ కలిపి ఉపాసన చేసిన వ్యక్తిని శుభాశుభాలు బాధించవు అన్నాడు అతను.ఇది అన్న ప్రాణాల ఉపాసన కాబట్టి, ఈ బ్రాహ్మణాన్ని అన్న ప్రాణ బ్రాహ్మణము అంటారు. ప్రాతృదుడు చెప్పాడు కాబట్టి ప్రాతృద బ్రాహ్మణము అని కూడా అనవచ్చు.

కాని ప్రాతృదుని తండ్రి ఇది సంపూర్ణ ఉపాసన కాదు అంటాడు. ఎందుకంటే ఇందులో అన్న, ప్రాణాలను కలిపి చూస్తున్నావు కాని, వాటి మహిమను చూడటం లేదు అంటున్నాడు.

**అన్నం వై వ్యన్నే హి ఇమాని సర్వాణి భూతాని విష్టాని** – ప్రాతృదుని తండ్రి 'వి' అని చెప్పాడు. వి అంటే అన్ని ప్రాణులు అన్నాన్ని విష్టించి (ఆశ్రయించి) ఉన్నాయి. విష్టాని అంటే ఆశ్రయించి ఉన్నాయి.

**రమితి ప్రాణో వై రమ్** – రమ్ అనేది నిశ్చయంగా ప్రాణమే.

**ప్రాణే హి ఇమాని సర్వాణి భూతాని రమంతే** – ఎందుకంటే అన్ని ప్రాణులు ప్రాణంలోనే రమిస్తాయి. ఆ విధంగా అన్నం అన్ని ప్రాణులకు ఆశ్రయమైతే, అన్ని ప్రాణులు ప్రాణంలో రమిస్తాయి. అంటే వాటికి ప్రాణశక్తిని ఇస్తుంది ప్రాణం. ఈ రెండూ అంటే వి+రమ్ కలిపి వీరం అయింది. అందువల్ల ఈ రెండు గుణాలూ కలిసిన అన్నప్రాణాలమీద చేసే ఉపాసన వీరగుణ విశిష్ట అన్నప్రాణ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన. దీని ఫలమేమిటి?

**సర్వాణి హ వా అస్మిన్ భూతాని విశంతి సర్వాణి భూతాని రమంతే య ఏవం వేద** – ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతన్ని అన్ని ప్రాణులు ఆశ్రయిస్తాయి; అతనిలో రమిస్తాయి. అంటే అందరూ అతని దగ్గరకు వస్తారు, అతని సహాయం కోరుతారు.

# 5.13 - ఉక్థ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో హిరణ్యగర్భ ఉపాసన ఇంకొకటి చూస్తాము. సమష్టి హిరణ్యగర్భనే వ్యష్టిలో ప్రాణం అంటాము. ప్రాణానికి అనేక గుణాలుంటాయి. ఇక్కడ నాలుగు గుణాలను చూస్తాము. అందువల్ల ఈ ఉపాసన **గుణవిశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**.

ఇందులో అన్ని ఉపాసనలూ ప్రాణంమీద ఉపాసనలే. ఒక్కొక్క ఉపాసనలో ప్రాణంయొక్క ఒక్కొక్క గుణాన్ని చూస్తాము. గుణభేదంవల్ల ఉపాసన భేదం ఉంది కాని, అన్నింటిలోనూ దాన్ని ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన అని అంటారు. ఆ నాలుగు గుణాలు ఉక్థత్వగుణం, యజుస్వగుణం, సమత్వగుణం, క్షత్రత్వగుణం.

మంత్రం 5.13.1

**ఉక్థం ప్రాణో వా ఉక్థమ్ ॥**

**ప్రాణో హీదగ్ం సర్వముత్థాపయతి ॥**

**ఉద్ధాస్మాదుక్థవిద్వీరస్తిష్ఠత్యుక్థస్య సాయుజ్యగ్ం సలోకతాం జయతి య ఏవం వేద ॥**

**1. ఉక్థత్వ గుణ విశిష్ఠ ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**ఉక్థం ప్రాణో వా ఉక్థమ్** – ప్రాణమే నిశ్చయంగా ఉక్థం కనుక ప్రాణాన్ని ఉక్థం అని ఉపాసించాలి. నిజానికి ఉక్థంయొక్క రూఢి అర్థం యజ్ఞాల్లో వాడే ఒక ప్రత్యేకమైన మంత్రం. కాని ఇక్కడ రూఢి అర్థం తీసుకోము. రూఢి అర్థాన్ని వాచ్యార్థం అని కూడా అంటారు. వాచ్యార్థం తీసుకోకుండా, లక్ష్యార్థం తీసుకుంటాము.

**ప్రాణో హీదగ్ం సర్వముత్థాపయతి** – ఈ ప్రాణమే అన్నిటిని లేపి నిలబెడుతుంది. ఉక్థం అంటే ఇక్కడ పైకి లేపేది అని వస్తుంది. ప్రాణశక్తి బాగా ఉంటేనే, ఎవరైనా హుషారుగా ఉంటారు. ప్రాణశక్తి లేనివారు మంచంమీద లేచి కూర్చోలేరు కూడా. మనం లేచి కూర్చోగలుగుతున్నామంటే అది ప్రాణంవల్లనే; లేచి నిలబడ గలుగుతున్నామంటే అది ప్రాణంవల్లనే; ఏదైనా పని చెయ్యగలుగుతున్నామంటే అది ప్రాణంవల్లనే. అందువల్ల ప్రాణాన్ని శక్తినిచ్చేదిగా ఉపాసన చెయ్యాలి. అలా చేస్తే వచ్చే ఫలం ఏమిటి?

**ఉద్ధాస్మాదుక్థవిద్వీరస్తిష్ఠత్యుక్థస్య సాయుజ్యగ్ం సలోకతాం జయతి య ఏవం వేద** – నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పడుతాయి. సకామ ఉపాసన ఫలాలు రెండు – ఇహలోక ఫలం, పరలోక ఫలం. ఇహలోక ఫలం ఉక్థం తెలిసిన పుత్రుడు పుడతాడు. అంటే అతనికి కూడా ఆధ్యాత్మిక చింతన ఉంటుంది. పరలోక ఫలం మళ్ళీ రెండు రకాలు – సాలోక్యం, సాయుజ్యం. సాలోక్యం అంటే హిరణ్యగర్భ లోకానికి వెళతాడు. సాయుజ్యం అంటే హిరణ్యగర్భతో ఐక్యం పొందుతాడు. ఈ రెండు ఫలాలూ మరణానంతర ఫలాలు.

ఎందుకు రెండు రకాల ఫలాలు? ఎందుకంటే ఉపాసన చెయ్యటంలో చూపే శ్రద్ధ, చూపే ఏకాగ్రత, చేసే తీవ్రతలో తేడాలు ఉంటాయి. కొంతమంది ఎక్కువసేపు చెయ్యవచ్చు. వాటినిబట్టి ఫలం కూడా మారుతుంది.

**ఉపాసనా తారతమ్యాద్ ఫల తారతమ్యమ్**

### మంత్రం 5.13.2

**యజుః ప్రాణో వై యజుః ప్రాణే హీమాని సర్వాణి భూతాని యుజ్యన్తే ॥ యుజ్యన్తే హాస్మై సర్వాణి భూతాని శ్రైష్ఠ్యాయ యజుషస్సాయుజ్యగ్ం సలోకతాం జయతి య ఏవం వేద ॥**

**2. యజుస్వ గుణ విశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**యజుః ప్రాణో వై యజుః ప్రాణే హీమాని సర్వాణి భూతాని యుజ్యంతే** – ప్రాణమే నిశ్చయంగా యజుర్వేదము కనుక, ప్రాణాన్ని యజుస్సుగా ఉపాసించాలి. ఎందుకంటే ఈ ప్రాణులన్నీ ప్రాణంలోనే సంయోగం చెందుతున్నాయి.

ఇక్కడ కూడా లక్ష్యార్థాన్నే తీసుకుంటాము. యజుః అంటే మామూలు అర్థం యజుర్వేదం. ఆ రూఢి అర్థాన్ని పక్కనపెట్టి, యజుః అంటే మనుష్యులను ఒకచోటికి చేర్చేది అని అర్థం తీసుకోవాలి. దానిద్వారా నలుగురితో కలుస్తాడు.

మనిషి ఒంటరిగా ద్వీపంలో లేడు. మానవుడు సంఘజీవి. ప్రాణం గొప్పదనం ఏమిటంటే, మనలో ప్రాణం ఉన్నంతవరకే నలుగురితో కలవగలం. ఎక్కడైనా మనుష్యుల మధ్య భేదాభిప్రాయాలు లేవు అంటే, అది వారంతా పడుకుని ఉన్నచోట మాత్రమే. అంటే స్మశానంలో మాత్రమే. మనిషి లేచి ఉన్నంతసేపూ నలుగురితో కలిసి ఉండటమో, పోట్లాడటమో చేస్తాడు. అంటే ఏం చెయ్యాలన్నా ప్రాణం ఉండాలి. ప్రాణశక్తి తక్కువగా ఉన్నప్పుడు, ఎవరితో మాట్లాడకుండా ఉంటాడు. ఎవరైనా ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు అంటే వారిలో ప్రాణశక్తి ఎక్కువ ఉందని అర్థం. అందువల్ల ప్రాణానికి యజుస్వ గుణం ఉంది. ఈ ఉపాసనకు కూడా రెండు ఫలాలు – ఇహలోక ఫలం, పరలోక ఫలం.

**యుజ్యంతే హాస్మై సర్వాణి భూతాని శ్రైష్ఠ్యాయ యజుషః** – మనుష్యులందరూ అతన్ని చేరి అతనికి వారి సహాయ సహకారాలను అందిస్తారు. అతను శ్రేష్ఠుడు అయ్యేందుకు తోడ్పడతారు. తోటివారి సహాయం లేనిదే జీవితంలో ఏదీ సాధించలేము. పరలోకఫలం ఇంతకుముందు చూసిందే. సాలోక్యం, సాయుజ్యం పొందుతారు.

### మంత్రం 5.13.3

**సామ ప్రాణో వై సామ ప్రాణే హీమాని సర్వాణి భూతాని సమ్యఞ్చి సమ్యఞ్చి హాస్మై సర్వాణి భూతాని శ్రైష్ఠ్యాయ కల్పన్తే సామ్నస్సాయుజ్యగ్ం సలోకతాం జయతి య ఏవం వేద ॥**

**3. సమత్వ గుణవిశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**సామ ప్రాణో వై సామ ప్రాణే హీమాని సర్వాణి భూతాని సమ్యంచి** – ప్రాణబ్రహ్మను సామరూపంగా ఉపాసించాలి. ప్రాణబ్రహ్మే నిశ్చయంగా సామ. ఇక్కడ కూడా సామ అంటే సామవేదం కాదు, సంగమాన్ని పొందటం. అంటే ప్రాణంలో అందరూ చక్కగా కలిసివుంటారు.

యజుస్సు గురించి మాట్లాడినప్పుడు కూడా అందరూ ఇతని దగ్గరికి వస్తారు అన్నాము. ఇక్కడ కూడా అందరూ ఇతని దగ్గరికి వస్తారు అని అర్థం వస్తుంది. కాని దానికీ దీనికీ చిన్న వ్యత్యాసం ఉంది. యజుస్సులో దగ్గరికి వస్తారు కాని వారి మధ్య సఖ్యత ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కాని సామలో అర్థం దగ్గరికి రావటమే కాదు వారి మధ్య అనుబంధం కూడా బాగుంటుంది.

**సమ్యంచి హాస్మై సర్వాణి భూతాని శ్రైష్ఠ్యాయ కల్పంతే** – తక్కినవారు ఇతను శ్రేష్ఠుడు అవటానికి తోడ్పడతారు. ఇది ఇహలోకఫలం. పరలోకఫలం ఇందాకటిదే. హిరణ్యగర్భ లోకానికి వెళ్ళటం లేదా హిరణ్యగర్భతో ఐక్యం పొందటం. అంటే సాలోక్యం, సాయుజ్యం.

### మంత్రం 5.13.4

**క్షత్రం ప్రాణో వై క్షత్రం ప్రాణో హి వై క్షత్రమ్ ॥ త్రాయతే హైనం ప్రాణః క్షణితోః ॥ ప్ర క్షత్రమత్రమాప్నోతి క్షత్రస్య సాయుజ్యగ్ం సలోకతాం జయతి య ఏవం వేద ॥**

### 4. క్షత్రత్వ గుణవిశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన

**క్షత్రం ప్రాణో వైక్షత్రం ప్రాణో హి వై క్షత్రమ్** – ప్రాణము క్షత్రం అని ఉపాసించాలి. ప్రాణమే నిశ్చయంగాక్షత్రం. ప్రాణము క్షత్రమని ప్రసిద్ధమే. ఇక్కడ కూడా క్షత్రం అంటే మామూలు అర్థమైన క్షత్రియుడు కాదు, రక్షించేది అని అర్థం.

**త్రాయతే హైనం ప్రాణః క్షణితోః** – ప్రాణం ఈ దేహాన్ని గాయంనుంచి రక్షిస్తుంది. ప్రాణశక్తి బాగా ఉన్నవ్యక్తికి, శరీరానికి ఏదైనా గాయాలు తగిలినా కూడా ఆ గాయాలు వాటంతట అవే నయమవుతాయి. ప్రాణశక్తి బాగాలేని వ్యక్తికి త్వరగా నయం కాదు.

**ప్ర క్షత్రమత్రమాప్నోతి** – అతనికి మంచి ఆరోగ్యం ఉంటుంది. అంటే అతనిలో రోగనిరోధక శక్తి బాగుంటుంది. అది ఇహలోక ఫలం. పరలోక ఫలం ఇంతకుముందు చూసిందే – సాలోక్యం, సాయుజ్యం.

ఈ విధంగా హిరణ్యగర్భయొక్క నాలుగు గుణాలు చూశాము. మొదటి గుణం ఉక్థం కాబట్టి, ఈ బ్రాహ్మణాన్ని ఉక్థ బ్రాహ్మణము అంటారు.

# 5.14 - గాయత్రీ బ్రాహ్మణము

**గాయత్రీ పాదరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

ఇక్కడ కూడా ఇంకో రూపంలో హిరణ్యగర్భ ఉపాసన చూస్తాము. గాయత్రీపాదాలమీద ఉపాసన. గాయత్రీ అంటే గాయత్రీ మంత్రం అనుకుంటాము కాని అది గాయత్రీ ఛందస్సువల్ల గాయత్రీ మంత్రానికి ఆ పేరు వచ్చింది. అలా గాయత్రీ ఛందస్సులో రుద్రగాయత్రీ, గణపతిగాయత్రీ ఉన్నాయి. గాయత్రీ ఛందస్సులో మూడు పాదాలు; పాదానికి ఎనిమిది అక్షరాలు ఉండాలి.

**అష్టాక్షర యుక్త త్రిపాద గాయత్రీ**

గాయత్రీ మంత్రం గొప్ప రక్షణకవచంగా పనిచేస్తుంది.

**గాయంతం త్రాయతే ఇతి గాయత్రీ**

దుష్టశక్తులనుంచి రక్షిస్తుంది గాయత్రీ. వేదం ఈ రక్షణకవచాన్ని మనకు సంధ్యావందనం రూపంలో ఎప్పుడో ఇచ్చింది. సంధ్యావందనం రోజూ చేస్తే హోమం చేసినంత ఫలాన్ని ఇస్తుంది. గాయత్రీ మంత్రాన్ని పఠించే అర్హత లేనివారికి వేరే రక్షణకవచాన్ని ఇచ్చింది శాస్త్రం. కాని గాయత్రీ మంత్రం పఠించగలిగిన వారు కూడా దాన్ని వదిలేసి వేరే రక్షణకవచాన్ని పఠిస్తారు.

ఇప్పుడు ఈ గాయత్రీ మంత్రం లోని నాలుగు పాదాలు తీసుకుని నాలుగు ఉపాసనలు చెబుతున్నది ఉపనిషత్తు.

మంత్రం 5.14.1

**భూమిరన్తరిక్షం ద్యౌరిత్యష్టావక్షరాణ్యష్టాక్షరగ్ం హ వా ఏకం గాయత్ర్యై పదమేతదు హైవాస్యా ఏతత్॥ స యావదేషు త్రిషు లోకేషు తావద్ధ జయతి యోఽస్యా ఏతదేవం పదం వేద॥**

**1. లోకత్రయాత్మక ప్రథమ పాదరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**భూమిరంతరిక్షం ద్యౌరిత్యష్టావక్షరాణ్యష్టాక్షరగ్ం హ వా ఏకం గాయత్ర్యై పదమేతదు హైవాస్యా ఏతత్** – గాయత్రీ మంత్రంలో మొదటిపాదంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. అవి తత్సవితుర్వరేణ్యమ్. వాటిని మూడు లోకాలతో సమానం చెయ్యాలి. అవి భూమిః, అంతరిక్షమ్, ద్యౌః. వాటిని భూః, భువః, సువర్లోకాలు అని కూడా అంటారు. ఎందుకు ఈ రెండూ సమానం అంటే ఉపనిషత్తు రెండింటిలోనూ ఎనిమిదేసి అక్షరాలు ఉన్నాయి అంటున్నది. ఆ విధంగా ప్రథమ పాదం లోకత్రయాన్ని సూచిస్తుంది.

కాకపోతే గాయత్రీమంత్రంలో 'ణ్యమ్'ను ణియమ్, అని తీసుకోవాలి; అలాగే 'ద్యౌ'ని కూడా రెండు అక్షరాలుగా తీసుకోవాలి. అప్పుడే రెండింటిలోనూ ఎనిమిది అక్షరాలు వస్తాయి. దీని ఫలం ఏమిటి?

**స యావదేషు త్రిషు లోకేషు తావద్ధ జయతి యోఽస్యా ఏతదేవం పదం వేద** – ఎవరైతే ఈ విధంగా ప్రథమ పాద ఉపాసన చేస్తారో, అతను అన్నీ జయిస్తాడు; ముల్లోకాలనూ జయిస్తాడు.

మంత్రం 5.14.2

**ఋచో యజూగ్ంషి సామానీత్యష్టావక్షరాణ్యష్టాక్షరగ్ం హ వా ఏకం గాయత్ర్యై పదమేతదు హైవాస్యా ఏతత్స యావతీయం త్రయీ విద్యా తావద్ధ జయతి యోఽస్యా ఏతదేవం పదం వేద ॥**

**2. వేదత్రయాత్మక ద్వితీయ పాదరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**ఋచో యజూగ్ంషి సామానీత్యష్టావక్షరాణ్యష్టాక్షరగ్ం హ వా ఏకం గాయత్ర్యై పదమేతదు హైవాస్యా ఏతత్** – గాయత్రీ మంత్రంలోని రెండవ పాదంలో కూడా ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. అవి భర్గోదేవస్య ధీమహి. వాటిని వేదత్రయంతో పోలుస్తున్నది ఉపనిషత్తు. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. వీటికి కూడా ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. అవి ఋచః, యజూంషి, సామాని. దాని ఫలం–

**స యావతీయం త్రయీ విద్యా తావద్ధ జయతి యోఽస్యా ఏతదేవం పదం వేద** – ఎవరైతే ఈ విధంగా ఉపాసన చేస్తారో, అతను వేదాల్లో సూచించిన అన్ని కర్మ, ఉపాసనల ఫలాలనూ పొందుతాడు.

మంత్రం 5.14.3

**ప్రాణోఽపానో వ్యాన ఇత్యష్టావక్షరాణ్యష్టాక్షరగ్ం హ వా ఏకం గాయత్ర్యై పదమేతదు హైవాస్యా ఏతత్స యావదిదం ప్రాణి తావద్ధ జయతి యోఽస్యా ఏతదేవం పదం వేదాథాస్యా ఏతదేవ తురీయం దర్శతం పదం పరోరజా య ఏష తపతి ॥ యద్వై చతుర్థం తత్తురీయం దర్శతం పదమితి దదృశ ఇవ హ్యేష పరోరజా ఇతి సర్వము హ్యేవైష రజ ఉపర్యుపరి తపత్యేవగ్ం హైవ శ్రియా యశసా తపతి యోఽస్యా ఏతదేవం పదం వేద ॥**

**3. ప్రాణత్రయాత్మక గాయత్రీ పాదరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**ప్రాణోఽపానో వ్యాన ఇత్యష్టావక్షరాణ్యష్టాక్షరగ్ం హ వా ఏకం గాయత్ర్యై పదమేతదు హైవాస్యా ఏతత్** – గాయత్రీ మంత్రంలోని మూడవ పాదంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. అవి ధియోయోనః ప్రచోదయాత్. ఈ పాదం ప్రాణాలతో సమానం. అవి ప్రాణః, అపానః, వ్యానః, వీటికి కూడా ఎనిమిది అక్షరాలు ఉన్నాయి అంటున్నది ఉపనిషత్తు. కాని ఇక్కడ ఏడే అక్షరాలు అయ్యాయి. ద్యౌని రెండు అక్షరాలుగా తీసుకున్నట్టుగా, వ్యానను మూడుగా తీసుకోవాలి. వి+యా+న = వ్యాన.

**స యావదిదం ప్రాణి తావద్ధ జయతి** – ఈ గాయత్రీ పాదాన్ని ఎవరైతే ఉపాసన చేస్తారో, అతను సర్వప్రాణులను జయిస్తాడు.

ఇప్పుడు నాలుగవ పాదాన్ని చూడాలి. కాని నిజానికి గాయత్రీ మంత్రంలో మూడు పాదాలే ఉన్నాయి. మనం దాన్ని అష్టాక్షరయుక్త త్రిపాదగాయత్రీ అని వివరించాము కూడా. ఇంతవరకూ మనం చూసింది

శబ్దరూప పాదాలు. ఇప్పుడు నాలుగవ పాదంగా చూడబోయేది అర్థరూప పాదం. ఇది మూడు పాదాల సారం.

**4. సూర్యాత్మక గాయత్రీ పాదరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

**యోஉస్యా ఏతదేవం పదం వేదాథాస్యా ఏతదేవ తురీయం దర్శతం పదం పరోరజా య ఏష తపతి** – ఈ తపించే సూర్యుడు, దర్శతమనబడే తురీయ పాదము. ఈ పాదమే పరోరజస్సు. ఈ విషయాన్ని ఉపనిషత్తే వివరిస్తున్నది.

**యద్వై చతుర్థం తత్తురీయమ్** – ఏది నాలుగవ పాదమో, అదే తురీయం అనబడుతుంది.

**దర్శతం పదమితి** – ఈ సూర్యుడు కనబడుతున్నట్టే ఉన్నాడు కనుక, ఈ పాదానికి దర్శతం అని పేరు. పదం అన్నా పాదం అన్నా అర్థమొక్కటే.

ఈ మూడు పాదాలసారం హిరణ్యగర్భ. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానం అని చూశాము. సమష్టి సూక్ష్మశరీర అధిష్ఠానం వ్యష్టి అంతటికీ అధిష్ఠానం అవాలి కదా.

హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మప్రపంచం కాబట్టి కంటికి కనబడదు. అందువల్ల సూర్యుడు లేదా ఆదిత్యుడు హిరణ్యగర్భకు ప్రతీక.

ఆ విధంగా సూర్యుణ్ణి మూడు రూపాల్లో కొలుస్తాము.

1. సూర్యమండలంలో ఉన్న సూర్యదేవతగా కొలుస్తాము. ఆ సూర్యదేవతే మన కన్నుకు అధిష్ఠానదేవత
2. హిరణ్యగర్భగా కొలుస్తాము. సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత
3. ఈశ్వరునిగా కొలుస్తాము. సమష్టి కారణప్రపంచ అధిష్ఠానదేవత

సూర్యదేవునిగా కొలిస్తే ఒక్క దేవుడే; హిరణ్యగర్భకు ప్రతీకగా కొలుస్తే అందరూ వస్తారు. హిరణ్యగర్భ పుత్రుడు, ఈశ్వరుడు తండ్రి. అందువల్ల ఈశ్వరుడు, హిరణ్యగర్భల మధ్య తండ్రీకొడుకుల మధ్య ఉండే సంబంధం ఉంది. సూర్యుణ్ణి ఈ మూడు రూపాల్లో ఏ రూపంగానైనా కొలవవచ్చు. సందర్భాన్నిబట్టి తెలుసుకోవాలి. సంధ్యావందనంలో ఈశ్వరునిగా భావిస్తాము. ఇక్కడ ఈ సందర్భంలో హిరణ్యగర్భగా భావించాలి.

**దదృశ ఇవ హ్యేష పరోరజా ఇతి** – ఇక్కడ సూర్యభగవానునికి పరోరజాః అని విశేషణం వాడింది ఉపనిషత్తు. రజః అంటే లోకాలు; పరోరజాః అంటే సూర్యుడు లోకాలన్నిటికీ పైన ఉన్నాడు అని అర్థం. ఇది గాయత్రీ మంత్రంలో కనపడే పాదం. దర్శన యోగ్యం. ముందు మూడు పాదాలూ శబ్ద పాదాలు అయితే ఇది అర్థ పాదం అని చూశాము. ఈ ఉపాసన ఫలం ఏమిటి?

**ఏవగ్ంం హైవ శ్రియా యశసా తపతి యోஉస్యా ఏతదేవం పదం వేద** – ఈ సూర్య ఉపాసకుడు సూర్యునిలాగా శోభతో, కీర్తితో ప్రకాశిస్తాడు. మరిన్ని వివరాలు తర్వాత మంత్రంలో చూస్తాము.

మంత్రం 5. 14. 4

**సైషా గాయత్ర్యేతస్మిగ్ంస్తురీయే దర్శతే పదే పరోరజసి ప్రతిష్ఠితా తద్వై తత్సత్యే ప్రతిష్ఠితమ్॥ చక్షుర్వై సత్యం చక్షుర్హి వై సత్యం తస్మాద్యదిదానీం ద్వౌ వివదమానావేయాతామహమదర్శమహమశ్రౌషమితి య ఏవం బ్రూయాదహమదర్శమితి తస్మా ఏవ శ్రద్ధధ్యామ తద్వై తత్సత్యం బలే ప్రతిష్ఠితం ప్రాణో వై బలం తత్ప్రాణే ప్రతిష్ఠితం తస్మాదాహుర్బలగ్ం సత్యాదోగీయ ఇత్యేవం వేషా గాయత్ర్యధ్యాత్మం ప్రతిష్ఠితా సా హైషా గయాగ్ంస్తత్రే ప్రాణా వై గయాస్తత్ప్రాణాగ్ం స్తత్రే తద్ యద్ గయాగ్ంస్తత్రే తస్మాద్గాయత్రీ నామ స యామేవామూగ్ం సావిత్రీమన్వాహైషైవ సా స యస్మా అన్వాహ తస్య ప్రాణాగ్ంస్త్రాయతే ॥**

ఈ మంత్రం కొంచెం క్లిష్టమైన మంత్రం. అందువల్ల దీని తాత్పర్యం మాత్రం చూద్దాము. ఇందులో రెండు విషయాలు చర్చించబడ్డాయి.

**1. హిరణ్యగర్భ రూపాలు**

హిరణ్యగర్భను రెండు రూపాల్లో చూస్తాము. అవి అధిదైవిక రూపం, అధ్యాత్మిక రూపం.

అధిదైవిక రూపం అంటే సమష్టి స్థాయిలో. ఆ రూపం సూర్యదేవత. అధ్యాత్మిక రూపం అంటే వ్యష్టి స్థాయిలో. హిరణ్యగర్భను వ్యష్టిలో ప్రాణంగా కొలుస్తాము.

**ఆదిత్యరూపేణ ప్రాణరూపేణ చ హిరణ్యగర్భ ఏవ వర్తతే**

ఇంతకు ముందు గాయత్రీ మంత్రంలోని మూడు పాదాలసారం, నాలుగవ పాదం అన్నాము. ఆ నాలుగవ పాదం హిరణ్యగర్భ అన్నాము.

**గాయత్రీ హిరణ్యగర్భ రూపేణ వర్తతే**

గాయత్రీ సారం హిరణ్యగర్భ. అందువల్ల గాయత్రీయొక్క అధిదైవక రూపం సూర్యదేవత, అధ్మాత్మిక రూపం ప్రాణం అని చెప్పవచ్చు.

**2. గాయత్రీ నిర్వచనం**

ఈ నిర్వచనం కూడా కొంచెం క్లిష్టంగా ఇవ్వబడింది. గాయత్రీయొక్క అధ్యాత్మిక రూపం ప్రాణం అని చూశాము కదా. ప్రాణంయొక్క పని అన్ని అంగాలనూ రక్షించటం. ఏదైనా అంగానికి దెబ్బ తగిలితే, అది కోలుకునేలా చేసేది ప్రాణశక్తి.

ఇక్కడ ఉపనిషత్తు అంగాలను గయాః అంటున్నది. ప్రాణం అంగాలను రక్షిస్తుంది కాబట్టి ప్రాణాన్ని గాయత్రీ అంటున్నది.

మామూలుగా గాయత్రీ నిర్వచనం – గాయత్రీ మంత్రాన్ని జపిస్తే రక్షణ కలుగుతుంది. కాని ఇక్కడ వేరే నిర్వచనం ఇచ్చింది.

**గయత్రాణాద్గాయత్రీతి ప్రథితా**

గయములను రక్షిస్తుంది కాబట్టి గాయత్రీ అనే ప్రసిద్ధి కలిగినది. ఎందుకు అంగాలను గయాః అన్నది? గయాః అంటే వాక్కు. అన్ని అంగాలలోకి వాక్కు ముఖ్యమైన అంగం.

పాడేది, లేదా మాట్లాడేది గయము. వాక్కు అన్ని అంగాలకు ప్రతీక కాబట్టి వాక్కుకి వాడిన గయాః పదాన్ని అన్ని అంగాలకు వాడింది ఉపనిషత్తు. ఈ గయాలను రక్షిస్తుంది కాబట్టి ప్రాణం గాయత్రీ అయ్యింది. ప్రాణ రూపంలో అన్ని కరణాలను రక్షిస్తుంది. అందువల్ల గాయత్రీ పేరు వచ్చింది.

ఈ సందర్భంలో రెండు అంశాలు తెలుస్తున్నాయి. కన్నుకు సత్యం అనే పేరు, ప్రాణానికి బలం అనే పేరు ఇస్తున్నది ఉపనిషత్తు.

1. **కన్నుకు సత్యం అనే పేరు** – కన్నుకు పేరును సత్యం అని పెట్టి ఉపనిషత్తు, తనే ఎందుకు అలా చెప్పిందో నిర్వచిస్తున్నది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఇద్దరు దాని గురించి చెప్పారనుకోండి. ఎవరి మాటకు విలువనిస్తాము? ఒకతను ఎవరో చెపితే విన్నాను అంటాడు; ఇంకొకతను నేను కళ్ళారా చూశాను అంటాడు. ఎవరో చెపితే విన్నదానికన్నా, కళ్ళారా చూసినదానికే విలువనిస్తాము. అది ప్రత్యక్ష ప్రమాణం. **సీయింగ్ ఈజ్ బిలీవింగ్** అంటారు ఇంగ్లీషులో. అందువల్లనే కోర్టులో ప్రత్యక్షంగా చూసిన సాక్షి మాటకు అంత విలువ ఉంటుంది. నిజానికి అతను చెప్పిన సాక్ష్యానికి ఇంక తిరుగుండదు. అందువల్ల **కన్నును సత్యం** అన్నది.

2. **ప్రాణానికి బలం అనే పేరు** – ప్రాణానికి బలం అనే పేరును ఇచ్చింది ఉపనిషత్తు. అది ఎందుకో మీకు తెలుసు. ప్రాణమే అన్ని అంగాలకూ బలాన్ని ఇస్తుంది. ప్రాణశక్తి ఉంటేనే కూర్చోగలరు; నిల్చోగలరు; మాట్లాడగలరు.

అలా ఈ ఉపాసనద్వారా రెండు కొత్త పేర్లు తెలిశాయి మనకు.

## మంత్రం 5.14.5

**తాగ్ం హైతామేకే సావిత్రీమనుష్టుభమన్వాహుర్వాగనుష్టుబేతద్వాచమనుబ్రూమ ఇతి న తథా కుర్యాద్గాయత్రీమేవ సావిత్రీమనుబ్రూయాత్ ॥ యది హ వా అప్యేవం విద్బహ్వివ ప్రతిగృహ్ణాతి న హైవ తద్గాయత్ర్యా ఏకఞ్చన పదం ప్రతి॥**

ఈ మంత్రంలో గాయత్రీ మహిమ లేదా గాయత్రీ స్తుతిని చూస్తాము. నిజానికి గాయత్రీ మంత్రం అంటే గాయత్రీ ఛందస్సు. నిజానికి అసలు గాయత్రీ మంత్రం పేరు సావిత్రీ మంత్రం. సవిత దేవత అంటే సూర్య దేవతకు చేసే ప్రార్థన కాబట్టి అది సావిత్రీ మంత్రం; గాయత్రీ ఛందస్సులో ఉంది కాబట్టి గాయత్రీ మంత్రం అంటారు. సూర్యుణ్ణి సవిత దేవత అని ఎందుకంటారంటే ఆ పదం 'సు'నించి వచ్చింది. సు అంటే అన్నిటినీ ప్రేరేపించేది. సూర్యునివల్లనే వానలు కురుస్తాయి; పంటలు పండుతాయి; చెట్లు మొలుస్తాయి; ప్రాణులు ప్రాణశక్తిని

పొందుతాయి. అంటే జగత్తు మొత్తాన్ని రక్షించేవాడు. అందువల్ల సూర్యుణ్ణి ప్రార్థించే సావిత్రి మంత్రం రెండు ఛందస్సులలో ఉంది. అవి అనుష్టుప్ ఛందస్సు; గాయత్రి ఛందస్సు.

1. అనుష్టుప్ ఛందస్సులో నాలుగు పాదాలుంటాయి. ఒక్కొక్కపాదంలో ఎనిమిది అక్షరాలు ఉంటాయి.

2. గాయత్రీ ఛందస్సులో మూడు పాదాలుంటాయి. ఒక్కొక్కపాదంలో ఎనిమిది అక్షరాలు ఉంటాయి.

ఇప్పుడు ఈ రెండు రకాల మంత్రాలలో ఏది గొప్ప అనేది ప్రశ్న. ఏది గొప్ప అనేది దాని ఛందస్సుమీద ఆధారపడివుంటుంది. మామూలుగా అనుష్టుప్ ఛందస్సు గొప్ప అంటారు. ఎందుకంటే దానిలో నాలుగు పాదాలు ఉంటాయని చూశాము కదా.

కాని ఇక్కడ ఉపనిషత్తు పాదాల సంఖ్య చూడకుండా, ఉపాసనా దేవతలను చూస్తున్నది.

**వాగనుష్టుప్** – వాక్కే అనుష్టుప్. శరీరంలో వాక్కే సరస్వతీ దేవి.

**గాయత్రీమేవ సావిత్రీమనుబ్రూయాత్** – ప్రాణమే గాయత్రి అని చెప్పటమైనది.

బ్రహ్మచారి వేదపారాయణం చెయ్యటానికి వాక్కే ముఖ్యం కాబట్టి, అనుష్టుప్ ఛందస్సు వాగ్దేవతను సూచిస్తుంది కాబట్టి, అనుష్టుప్ ఛందస్సే శ్రేష్ఠం అంటారు కొందరు. కాని ఉపనిషత్తు గాయత్రీ ఛందస్సే గొప్పది అంటున్నది. ఎందుకు? గాయత్రి ప్రాణాన్ని సూచిస్తున్నది కాబట్టి, వాక్కు ఒక్క అంగమే; ప్రాణం అన్ని అంగాలకు రక్షణ నిస్తుంది. అంటే వాగింద్రియానికి శక్తినిచ్చేది ప్రాణమే. అందువల్ల గాయత్రీ మంత్రమే శ్రేష్ఠము.

## మంత్రం 5.14.6

**స య ఇమాగ్ంస్త్రీంల్లోకాన్ పూర్ణాన్ ప్రతిగృహ్ణీయాత్సోఽస్యా ఏతత్ప్రథమం పదమాప్నుయాదథ యావతీయం త్రయీవిద్యా యస్తావత్ప్రతిగృహ్ణీయాత్సోఽస్యా ఏతద్ద్వితీయం పదమాప్నుయాదథయావదిదం ప్రాణి యస్తావత్ప్రతిగృహ్ణీయాత్సోఽస్యా ఏతత్తృతీయం పదమాప్నుయాత్ ॥ అథాస్యా ఏతదేవ తురీయం దర్శతం పదం పరోరజా య ఏష తపతి నైవ కేనచనాప్యం కుత ఉ ఏతావత్ప్రతిగృహ్ణీయాత్ ॥**

ఈ మంత్రంలో గాయత్రీ ఉపాసన చేసే ఉపాసకుని స్తుతి వస్తున్నది. ఉపాసకుని స్తుతిస్తే, అది పరోక్షంగా గాయత్రీ ఉపాసనను స్తుతించినట్టే అవుతుంది. నాలుగు పాదాలమీద ఉపాసన చేసిన ఉపాసకుని స్తుతిని చూస్తాము ఇక్కడ.

ఆ స్తుతిని చూసేముందు దానం గురించి మనకున్న అపోహను చూద్దాము. మన సాంప్రదాయంలో దానాన్ని స్వీకరించటాన్ని ప్రతిగ్రహం అంటారు. అలా స్వీకరించిన వారికి ప్రతిగ్రహదోషం పట్టుకుంటుంది అంటుంది ఒకపక్క, ఇంకోపక్క దానం చెయ్యాలంటుంది. దానాన్ని గొప్పగా కీర్తిస్తుంది కూడా.

ఒకపక్క కీర్తిస్తూనే, ఇంకొకపక్క దాన్ని దోషంగా వర్ణిస్తుంది. లేకపోతే కొంతమంది బద్ధకించి, దానాలు స్వీకరిస్తూ కూర్చుంటారు. నిజానికి కొంతమంది ఈ దానం చెయ్యాలనే నియమాన్ని విమర్శిస్తారు కూడా.

మనదేశంలో బీదవారు, భిక్షగాళ్ళు ఎక్కువయ్యారంటే వారిని కూర్చోబెట్టి, వారికి దానం చెయ్యటమే కారణం అంటారు. వారికి దానం చెయ్యటం మానితే, వారే వళ్ళొంచి పనిచేస్తారు అని కూడా అంటారు.

ఇంత చిన్న విషయం వేదానికి తెలియదా? వేదానికి బాగానే తెలుసు. అందువల్లనే ఒకపక్క దానం చెయ్యండి అని ఘోషిస్తూనే, ఇంకొకపక్క దానం స్వీకరించకండి అంటున్నది. ఇది సమతుల్యతని పాటించేలా చేస్తుంది. అప్పుడు మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప దానం స్వీకరించకుండా ఉంటారు. అందువల్ల దానగుణాన్ని అనవసరంగా వినియోగించుకోరు మనుష్యులు.

నిజానికి బ్రాహ్మణులు దానం తీసుకోవచ్చు కాని, దానికి కూడా వారు స్వీకరించిన ప్రతిదానికీ ప్రాయశ్చిత్తకర్మ చెయ్యాలి అంటుంది అదే శాస్త్రం. వారు దానం స్వీకరించిన ప్రతిసారీ 1008సార్లు గాయత్రీ మంత్రం అదనంగా చదవాలి. ఇది మామూలుగా చేసే సంధ్యావందనం కాదు. ప్రాయశ్చిత్త గాయత్రీ జపం వేరే ఉంటుంది. దానం ఎంత ఎక్కువైతే, ప్రాయశ్చిత్తంలో కూడా అంత ఎక్కువగా ఉండాలి. గోదానం స్వీకరిస్తే 10,000 సార్లు గాయత్రీజపం చెయ్యాలి. అలా ప్రాయశ్చిత కర్మ చెయ్యకపోతే, అది పాపం అవుతుంది.

అందువల్ల మన సాంప్రదాయంలో **ఋణం** అనే సిద్ధాంతం నెలకొల్పబడింది. ఎవరి దగ్గరనుంచైనా ఏదైనా ఉచితంగా తీసుకుంటే, వారికి ఋణపడిపోతామని నమ్మకం. అందువల్ల ఎవరైనా ఏదైనా మనకు దానం చేస్తే వారి దగ్గర తీసుకున్న ఆ వస్తువుతో పాటు, కొంత పాపం కూడా మూట కట్టుకుంటున్నామనే భావన కలుగుతుంది. అందువల్ల పూర్వకాలంలో మనింట్లో పెళ్ళికి వచ్చి ఎవరైనా మన పిల్లవానికి వెండిగ్లాసు కానుకగా చదివిస్తే, అది గుర్తు పెట్టుకుని, మన పెద్దవారు మళ్ళీ వారింట్లో పెళ్ళి వచ్చినప్పుడు వెళ్ళి వెండిగ్లాసు చదివించి వచ్చేవారు. ఒకవేళ వారింట్లో అలాంటి శుభకార్యాలు వచ్చే అవకాశం లేకపోతే, అంత డబ్బు తీసుకెళ్ళి ఏదైనా గుడిలో హుండీలో వేసేవారు. ఎందుకంటే ఏదీ దానంగా తీసుకోకూడదు.

ఇప్పుడు గాయత్రీ ఉపాసన గొప్పదనం చూస్తే, గాయత్రీ ఉపాసకునికి ఈ పరిగ్రహదోషం అంటదని ఉపనిషత్తు చెబుతున్నది. అంటే అతను ఎంత దానాన్ని స్వీకరించినా, అది దానంగా అవదు. ఎందుకు?

**స య ఇమాగ్ంస్త్రీంల్లోకాన్ పూర్ణాన్ ప్రతిగృహ్ణీయాత్సోఽ_స్యా ఏతత్ప్రథమం పదమాప్నుయాత్** – గాయత్రీ మంత్రంయొక్క మొదటిపాదంమీద ఉపాసన చేసిన వ్యక్తి త్రిలోకాలను జయిస్తాడని చూశాము. త్రిలోక జయం పొందిన వ్యక్తికి ఒకదేశం మొత్తాన్ని దానం చేసినా కూడా, అది ఆ లోకాలలోకే వస్తుంది కాబట్టి అది అతనికి దానం తీసుకున్నట్టుగా అవదు. అందువల్ల అతనికి ప్రతిగ్రహదోషం అంటదు.

**అథ యావతీయం త్రయీవిద్యా యస్తావత్ప్రతిగృహ్ణీయాత్సోఽ_స్యా ఏతద్ద్వితీయం పదమాప్నుయాత్** – రెండవ పాదంమీద ఉపాసన చేసిన వ్యక్తి మూడు వేదాలనూ జయిస్తాడని చూశాము. అటువంటి వ్యక్తికి ఎవరైనా తను చేసిన కర్మఫలాన్ని ధారపోసినా కూడా అతనికి ప్రతిగ్రహదోషం అంటదు.

**అథ యావదిదం ప్రాణి యస్తావత్ప్రతిగృహ్ణీయాత్సోఽ_స్యా ఏతత్తృతీయం పదమాప్నుయాత్** – మూడవ పాదంమీద ఉపాసన చేసిన వ్యక్తికి అన్ని ప్రాణులూ అతని అధీనంలో ఉంటాయని చూశాము. అందరూ అతనికి సేవ

చేస్తారు. ఎవరైనా మనకి సేవ చేసినా, అది కూడా ప్రతిగ్రహదోషంలోకే వస్తుంది. కాని గాయత్రీ ఉపాసకునికి మాత్రం, ఈ తృతీయ పాదంమీద ఉపాసన చేసినందువల్ల అతనికి ప్రతిగ్రహదోషం అంటదు.

**అథాస్యా ఏతదేవ తురీయం దర్శతం పదం పరోరజా య ఏష తపతి నైవ కేనచనాప్యం కుత ఉ ఏతావత్ప్రతి గృహ్ణీయాత్** – నాలుగవ పాదం, అంటే తురీయంమీద ఉపాసన చేసిన వ్యక్తికి వచ్చే ఫలం అనంతఫలం. అందువల్ల అతను ఎటువంటి కానుకలు స్వీకరించినా కూడా అది తక్కువే అవుతుంది. నిజానికి, నాలుగవ పాదం ఫలం వాడాల్సిన అవకాశమే ఉండదు. ఎందుకంటే, మొదటి మూడు పాదాల ఫలమే ఎంత బలంగా ఉంటుందంటే, అతనికి ఎవరు ఏమిచ్చినా, ఎంత సహాయం చేసినా, ఈ ఫలాల ముందు అవి తేలిపోతాయి. అందువల్ల ఒక్కముక్కలో చెప్పాలంటే గాయత్రీ ఉపాసకునికి ప్రతిగ్రహదోషం అంటదు.

## మంత్రం 5.14.7

**తస్యా ఉపస్థానం గాయత్ర్యస్యేకపదీ ద్విపదీ త్రిపదీ చతుష్పద్యపదసి న హి పద్యసే। నమస్తే తురీయాయ దర్శతాయ పదాయ పరోరజసేఽసావదో మా ప్రాపదితి యం ద్విష్యాదసావస్మై కామో మా సమృద్ధీతి వా న హైవాస్మై న కామస్సమృధ్యతే యస్మా ఏవముపతిష్ఠతేఽహమదః ప్రాపమితి వా ॥**

ఈ మంత్రంలో గాయత్రీ నమస్కారాలు చూస్తాము. గాయత్రీకి సాష్టాంగనమస్కారం చెయ్యటాన్ని ఉపస్థానము అంటారు. ఆ నమస్కారంతో పాటు గాయత్రీ మంత్రాన్ని మూడు విధాలఫలం పొందటానికి మూడు విధాలుగా ప్రయోగించవచ్చని చూస్తాము. అంటే గాయత్రీ నమస్కారంయొక్క మూడు ప్రయోగాలు, మూడు ఫలాలు.

ఈ మూడు ఫలాల్లో ఏదైనా కోరవచ్చు. వాటిలో రెండు మంచివే కాని ఒకటి వింతగా ఉంటుంది. అవి అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తి, అభిచారము. అనిష్టనివృత్తి అంటే మనకు ఆటంకాలు కలిగించేవాటిని తొలగించమని చేసే ప్రార్థన; ఇష్టప్రాప్తి అంటే మనకు ఇష్టమైన వాటిని నెరవేర్చమని చేసే ప్రార్థన. అభిచారము అంటే చేతఃబడివంటిది. ఎదుటివానికి హాని చెయ్యమని చేసే ప్రార్థన. ఈ కర్మను అభిచారికకర్మ అంటారు. ఈ కర్మ యజ్ఞంరూపంలోనో, జపంరూపంలోనో, వాచికరూపంలోనో ఉంటుంది. ఇక్కడ వాచికకర్మగా చెప్పింది ఉపనిషత్తు.

ఇవి చాలా శక్తివంతమైన అభిచారికకర్మలు. శత్రువును నాశనం చేస్తాయి. ఈర్ష్యనుంచి పుడతాయి ఈ కర్మలు. ఎదుటివ్యక్తిని నాశనం చేసే పూజ గురించి శాస్త్రం ఎందుకు చెప్పింది? అలాంటి కర్మలు కూడా ఉన్నాయని చెబుతున్నది కాని, అవి పాపకర్మలనీ, అవి చేస్తే ఈ జన్మలోనే కాదు, జన్మజన్మలకూ పాపఫలం అనుభవిస్తాడనీ హెచ్చరిస్తుంది. అటువంటి కర్మలు చేస్తే మోక్షం పొందలేరు. ఎదుటివాణ్ణి అణగదొక్కటంలో విజయం సాధిస్తాడేమో కాని, దానికి తన జీవితాన్నే ఫణంగా పెట్టాల్సి ఉంటుంది. జన్మజన్మల దుఃఖం అనుభవించాల్సి ఉంటుంది.

**తస్యా ఉపస్థానమ్** – ఆ గాయత్రీయొక్క ఉపస్థానము ఈ విధంగా ఉంది.

**గాయత్ర్యస్యేకపదీ ద్విపదీ త్రిపదీ చతుష్పద్యపదసి న హి పద్యసే** – గాయత్రీదేవిని సంబోధిస్తున్నాడు సాధకుడు. ఓ గాయత్రీదేవి, నువ్వు ఏకపదీ హి. పదం అన్నా పాదం అన్నా ఒకటే అని చూశాము. ఏకపదీ అంటే మొదటి పాదం ఫలం మూడు లోకాలను జయించటం. ద్విపదీ అంటే రెండవపాదంయొక్క ఫలం మూడు వేదాలను జయించటం; త్రిపదీ అసి – మూడవ పాదంయొక్క ఫలం మూడు ప్రాణాలను జయించటం.

చతుష్పదీ అసి అంటే నాలుగవ పాదం కూడా ఉంది. అది ఆదిత్య మండలంలో ఉన్న హిరణ్యగర్భ. ఆ విధంగా నీకు నాలుగు పాదాలు ఉన్నాయి. వీటిని పదాలు అని ఉపనిషత్తు ఎందుకు అంది అంటే, అవన్నీ సగుణస్వరూపం– లోకత్రయం, వేదత్రయం, ప్రాణత్రయం, ఆదిత్యదేవత కూడా సగుణం. వాటిని ఆబ్జెక్టుగా చూడవచ్చు.

తర్వాత అపదసి అని అంది. అంటే ఈ ఉపాధులను తీసేస్తే, అంటే ఈ సగుణరూపం తీసేస్తే, మిగిలేది నిరుపాధిక చైతన్యరూపం. దాన్ని ఆబ్జెక్టుగా చూడలేము కాబట్టి, అది అపాదము అన్నది.

**నిరుపాధికేన స్వేనాత్మనా అపదసి**

అలా నాలుగు పాదాలు ఉన్న, పాదాలు లేని గాయత్రీదేవీ నీకు నమస్కారం. ఇంకో విధంగా చెప్పాలంటే సగుణరూపంగా, నిర్గుణరూపంగా గాయత్రీకి నమస్కారం చేస్తున్నాము. చాలామంది ఈ నిర్గుణరూపం దాకా రారు. మంద అధికారులు రారు. వారికి యోగక్షేమాలు ఉంటే చాలు; ఆత్మజ్ఞానం అవసరం లేదు. అందువల్ల నాలుగవ పాదంయొక్క ఉపాసనతోనే ఆగిపోతారు.

**నమస్తే తురీయాయ దర్శతాయ పదాయ పరోరజసే** – దర్శతము, పరోరజసము అయిన తురీయ పదమైన నీకు నమస్కారము. ఇంతవరకు గాయత్రియొక్క ఉపస్థానము లేదా నమస్కారము. ఇక్కడ్నుంచి మూడు ఫలాలను చూస్తాము.

1. **అనిష్ట నివృత్తి – అసౌ** పదాన్ని వాడింది ఉపనిషత్తు శత్రువును వర్ణించటానికి. ఈ శత్రువులు నా ఆనందానికి ఏదోవిధంగా అడ్డుపడతారు. శత్రువు అంటే మనుష్యులే కానవసరం లేదు. మనం చేసుకున్న పాపాలు కూడా మన శత్రువులే. అది అనారోగ్యం రూపంలో మనని ఇబ్బంది పెట్టవచ్చు. **అదః** అంటే అది కలిగించే విఘ్నం. మా ప్రాపద్. అతను నన్ను పొందకుండు గాక.

**అసావదో మా ప్రాపదితి** – అసౌ దగ్గర శత్రువు పేరు/అనారోగ్యం పేరు చెప్పుకుని, అదః దగ్గర అది కలగజేసే విఘ్నం చెప్పుకుని, మా ప్రాపద్ దగ్గర నన్ను పొందకుండు గాక అని చెప్పుకోవాలి. అంటే ఈ శత్రువు ఈ పనిలో సఫలం కాకుండుగాక అని అర్థం. ఇతి అంటే ఇక్కడితో ఒక ప్రార్థన ముగిసింది.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించారా? ఉపనిషత్తు నాకు శత్రువులు లేకుండుగాక అనటం లేదు. ఎందుకంటే మనం ఈ భూమ్మీదకు వచ్చిన దగ్గరనుంచీ, మన ప్రమేయం లేకుండానే, కొంతమంది మనకు శత్రువులుగా మారతారు. పోనీ అని శత్రువులుగా మారిన తోటి మనుష్యులకు మనం దూరంగా ఉన్నా కూడా, మనం చేతులారా చేసుకున్న పూర్వజన్మ కర్మ ఫలాలకు దూరంగా ఉండలేము.

శత్రువులను తప్పించుకోలేము కాబట్టి ఈ ప్రార్థన. శత్రువులు చేసే హానినుంచి, విఘ్నాలనుంచి తప్పించమని చేసే ప్రార్థన. నాగుపాము ఉండకుండా ఉండదు; కాని దాని కోరల్లోంచి విషాన్ని తీసేస్తే, అదేమీ చెయ్యలేదు. ఈ విధంగా అనిష్టనివృత్తి మొదటి ఫలం.

2. **అభిచారక కర్మ** – ఎవరినైతే ఈ సాధకుడు ద్వేషిస్తున్నాడో, అతని గురించి ఈ ప్రార్థన చెయ్యాలి. ఇది కేవలం ఇలాంటిది ఉందని చెప్పటానికి కాని, చెయ్యటానికి కాదని చూశాము. అది మర్చిపోకూడదు.

**యం ద్విష్యాదసావస్మై కామో మా సమృద్ధీతి** – ఉపాసకుడు, ఎవరిమీద అతనికి ద్వేషముందో, అతనిని ఉద్దేశించి ఈ ఉపస్థానాన్ని చెయ్యాలి. అసౌ అస్మై కామః అంటే ఫలానా పేరున్న ఈ శత్రువు, కోరిక తీరకుండుగాక అని చెప్పాలి.

**న హైవాస్మై న కామస్సమృధ్యతే** – అప్పుడు ఆ శత్రువుయొక్క కోరిక తీరదు. ఏ కోరిక?

**యస్మా ఏవముపతిష్ఠతే** – ఈ ఉపాసకుని పనులకు ఆటంకం కలిగించాలనే అతని కోరిక తీరదు.

దీన్ని అభిచారిక కర్మ అంటారు.

3. **ఇష్టప్రాప్తి** – ఇష్టమైన వాటిని కోరుతూ చేసే ప్రార్థన.

**అహమదః ప్రాపమితి** – అహమ్ అదః ప్రాపం అంటే నాకు ఈ కోరిక తీరాలి గాక. ఆ కోరిక ఏదైనా కావచ్చు – ధనం, ధాన్యం, బహుపుత్ర లాభం. వేదాంత విద్యార్థులు ఈ ప్రార్థన చేస్తే జ్ఞానఫలం కోరాలి. జ్ఞానం పొందినవారు అక్కడితో ఆగకూడదు; జ్ఞాననిష్ఠలో నిలబడాలని కోరుకోవాలి. దీనితో గాయత్రీ ఉపస్థానము అయిపోయింది.

## మంత్రం 5.14.8

**ఏతద్ధ వై తజ్జనకో వైదేహో బుడిలమాశ్వతరాశ్విమువాచ యన్ను హో తద్గాయత్రీవిదబ్రూథా కథగ్ం హస్తీభూతో వహసీతి ముఖగ్ం హ్యస్యాస్సమ్రాణ్న విదాంచకారేతి హోవాచ తస్యా అగ్నిరేవ ముఖం యది హ వా అపి బహ్వివాగ్నావభ్యాదధతి సర్వమేవ తత్సందహత్యేవగ్ం హైవైవంవిద్యద్యపి బహ్వివ పాపం కురుతే సర్వమేవ తత్సమ్భాయ శుద్ధః పూతోஉజరోஉమృతస్సమ్భవతి ॥**

ఇంతవరకూ గాయత్రీ గురించి అంటే గాయత్రీ పాదాలు, గాయత్రీ ఉపాసన, ఉపాసన ఫలం చూశాము. ఇప్పుడు గాయత్రీ ముఖం గురించి చెప్పబోతున్నది ఉపనిషత్తు. గాయత్రీ ముఖం వేరే ఏదో కాదు, అగ్నిదేవతే. ఈ అంశాన్ని మహానారాయణోపనిషత్తులో కూడా చూస్తాము. ఇక్కడ ఈ విషయాన్ని కథరూపంలో చూస్తాము.

ఒకప్పుడు బుడిలుడు అనే ఒక గాయత్రీ ఉపాసకుడు ఉన్నాడు. అతనికి ఇంకోపేరు కూడా ఉంది. అది ఆశ్వతరాశ్వుడు. ఒకసారి, ఈ గాయత్రీ ఉపాసకుడు విదేహ రాజైన జనకమహారాజు దగ్గరకు వెళ్ళాడు. తను గాయత్రీ ఉపాసకుణ్ణని గొప్పగా చెప్పుకున్నాడు. గాయత్రీ ఉపాసకునికి ప్రతిగ్రహదోషం అంటదని చూశాము కదా.

**అథ కథగ్ం హస్తీభూతో వహసి** – నువ్వు గాయత్రీ ఉపాసకునివైతే ఏనుగంత ప్రతిగ్రహదోషం ఎలా ఉంది నీకు అని అడిగాడు జనకుడు.

నాకు గాయత్రీయొక్క ముఖం గురించి తెలియదు అన్నాడు బుడిలుడు. గాయత్రీ ముఖం తెలియదు కాబట్టి గాయత్రీ ఉపాసన ఫలం పూర్తిగా పొందలేకపోయాను అన్నాడు.

**తస్యా అగ్నిరేవ ముఖమ్** – గాయత్రీదేవియొక్క ముఖం అగ్నిదేవత అని జనకుడు చెబుతాడు.

**యది హ వా అపి బహ్వివాగ్నావభ్యాదధతి సర్వమేవ తత్సందహత్యేవగ్ం హైవేవంవిద్యద్యపి బహ్వివ పాపం కురుతే సర్వమేవ తత్సంప్సాయ** – అగ్నిలో ఎన్ని కట్టెలు వేసినా అన్నింటినీ అది ఎలా దహించివేస్తుందో, అలా అగ్నిముఖం ఉన్న గాయత్రీ ఉపాసన చేసిన వ్యక్తికి అతను ఎన్ని పాపాలు చేసినా కూడా అవన్నీ దహించి వేయబడతాయి. ముఖ్యంగా ప్రతిగ్రహ పాపాలు తొలగిపోతాయి. అంతేకాదు –

**శుద్ధః పూతోఽ జరోఽ మృతస్సంభవతి** – అతను శుద్ధుడు, పవిత్రుడు, అజరుడు, అమృతుడు అవుతాడు. హిరణ్యగర్భ ఫలం పొంది, అమృతుడు అవుతాడు.

# 5.15 - సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో నాలుగు మంత్రాలు ఉన్నాయి కాని, ఆ నాలుగూ కలిపి ఒకటే మంత్రంగా చెప్పింది ఉపనిషత్తు. ఇవి చాలా ప్రసిద్ధి చెందిన మంత్రాలు. ఈ నాలుగు మంత్రాలనూ ఈశావాస్యోపనిషత్తు చివర్లో చూస్తాము. ఈశావాస్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినవనీ, ఈశావాస్యాన్ని మంత్రోపనిషత్తు అని, బృహదారణ్యకాన్ని బ్రాహ్మణోపనిషత్తు అని అంటారనీ చూశాము. మంత్రోపనిషత్తుయొక్క వ్యాఖ్యానం బ్రాహ్మణోపనిషత్తు. అందువల్ల ఈశావాస్యోపనిషత్తులోని మంత్రాలను ఇక్కడ చూడటంలో ఆశ్చర్యం లేదు.

ఈ మంత్రాలు ప్రార్థనరూపంలో ఉంటాయి. అవి అగ్నిదేవతకు, సూర్యదేవతకు చేసే ప్రార్థనలు. అందువల్ల ఈ బ్రాహ్మణానికి **సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణము** అని పేరు వచ్చింది. ఈ ప్రార్థన ఎప్పుడైనా చెయ్యవచ్చు కాని, ముఖ్యంగా మరణం సమీపించినప్పుడు, అది కూడా ముఖ్యంగా సూర్య, అగ్నిదేవతల ఉపాసకులు చెయ్యాలి అంటారు శంకరులవారు. అంటే ఈ అధ్యాయంలో చూసిన హిరణ్యగర్భ ఉపాసనలన్నీ చేసివుండి ఉండాలి.

ఈ ప్రార్థన చేస్తున్నది అటువంటి ఒక ఉపాసకుడు. అతను జీవితాంతంవరకూ ఉపాసననే చేస్తున్నాడు, ఆత్మజ్ఞానానికి రాలేదు. అందువల్ల అతను అజ్ఞానీ ఉపాసకుడు. అటువంటి ఉపాసకుడు సరిగ్గా మరణించబోయే ముందు ఈ ప్రార్థన చేస్తున్నాడు. సరిగ్గా మరణించబోయే ముందు అని ఎలా చెప్పగలరు అనే సందేహం రావచ్చు మీకు. ఎందుకంటే మరణం చెప్పి రాదు. మంచంమీద తీసుకుంటున్న వ్యక్తి ఎన్నాళ్ళో జీవించవచ్చు, తిరుగుతూ తిరుగుతూ ఉన్న వ్యక్తి హఠాత్తుగా మరణించవచ్చు.

కాని ఉపాసకులకు తెలుస్తుంది. వారు నిరంతరం దైవోపాసన చేస్తూ ఉంటారు కాబట్టి, వారికి మరణకాలం గురించి తెలుస్తుంది. ఇతను ముముక్షు ఉపాసకుడు. **జ్ఞానం పొందనిదే మోక్షం రాదు.** ఇది తిరుగులేని సత్యం. ఈ సత్యం ఎట్టి పరిస్థితిలోనూ మారదు. అందువల్ల ఈ ఉపాసకుడు జీవన్ముక్తి, తర్వాత విదేహముక్తి పొందడు, కాని క్రమముక్తి పొందుతాడు.

ఈ ఉపాసకుడు శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ బ్రహ్మద్వారా బ్రహ్మజ్ఞానం పొందితే కలిగే ముక్తిని క్రమముక్తి అంటారు. బ్రహ్మలోకం అంటే హిరణ్యగర్భలోకం. సూర్యమండలంద్వారా ఆ సాధకుడు హిరణ్యగర్భ లోకానికి వెళతాడు. అక్కడ బోధ చేసేది సాక్షాత్తూ బ్రహ్మదేవుడు కాబట్టి ఆ బోధ తక్షణం అర్థం అవుతుంది. అప్పుడు బ్రహ్మలోకంలో జీవన్ముక్తి పొంది, ప్రళయంలో విదేహముక్తి పొందుతాడు.

ఇది శాస్త్రం చెబుతుంది. ఈ క్రమముక్తి ఫలాన్ని ఇంతకుముందు బ్రాహ్మణములో చివరి మంత్రంగా చూశాము.

**శుద్ధః పూతోఽజరోఽమృతస్సంభవతి** – 5.14.8

అతను శుద్ధం అవుతాడు అంటే పాపాలన్నీ తొలగిపోతాయి. అతను శుద్ధః అంటే కర్మరహితుడు; పూతః అంటే కర్మఫలరహితుడు అవుతాడు. అమృతోభవతి అంతే క్రమముక్తి పొందుతాడని అర్థం. కాని బ్రహ్మలోకానికి వెళ్ళే ముందు ప్రార్థన చెయ్యాలి. ఆ ప్రార్థననే ఇక్కడ చూడబోతున్నాము.

మంత్రం 5.15.1

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్ । తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే। పూషన్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య వ్యూహ రశ్మీన్। సమూహ తేజో యత్తే రూపం కల్యాణతమం తత్తే పశ్యామి । యోऽసావసౌ పురుషస్సోऽహమస్మి । వాయురనిలమమృతమథేదం భస్మాన్తగ్ం శరీరమ్ ॥ ఓం క్రతో స్మర కృతగ్ం స్మర క్రతో స్మర కృతగ్ం స్మర ॥ అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్ ॥ యుయోధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాం తే నమఉక్తిం విధేమ ॥**

**పూషన్** – ఓ సూర్యదేవతా; పూషన్ అంటే పోషించేవాడు.

**హిరణ్మయేన పాత్రేన సత్యస్యాపిహితం ముఖమ్** – నేను సూర్యమండలంద్వారా ప్రయాణం చేసి హిరణ్యగర్భ లోకానికి వెళ్ళాలి. కాని ఆ సూర్యమండల ద్వారం హిరణ్మయపాత్రతో కప్పివేయబడింది. హిరణ్మయేన అంటే బంగారంలాగా మెరిసిపోయేది. సత్యస్య ముఖం అపిహితం అంటే ఈ బంగారువన్నెగల పాత్ర సూర్యమండల ద్వారాన్ని కప్పివేసింది. సత్యం అంటే ఇక్కడ హిరణ్యగర్భముఖం అంటే ద్వారం. హిరణ్యగర్భప్రాప్తి మార్గం అన్నమాట. ఇప్పుడు ఆ జీవి ఆ ద్వారంగుండా ప్రయాణం చెయ్యాలి.

**తత్త్వమ్ అపావృణు** – ఓ సూర్యదేవతా, ఆ ద్వారాన్ని తెరువు. తత్ అంటే ఆ బంగారుపాత్రను– అపావృణు– నువ్వు తొలగించు.

**సత్యధర్మాయ** – నేను శాస్త్రం నిర్దేశించిన ధర్మాలన్నీ పాటించాను. ఏమిటా ధర్మాలు? బృహదారణ్యకంలోనే బ్రహ్మ చెప్పాడని మూడు విలువలు చూశాము. అవి – దమం, దానం, దయ. ఉపాసకులందరూ వీటిని తప్పనిసరిగా పాటించాలి. ఒకవేళ ఎప్పుడైనా ఉల్లంఘిస్తే, వాటికి ప్రాయశ్చిత్తకర్మలు చెయ్యాలి. ఈ ఉపాసకుడు నేను సత్యధర్మాలను పాటించాను అని చెప్పటంవల్ల అతను ప్రాయశ్చిత్తం కూడా చేసినట్టు తీసుకోవచ్చు. అతను ఎందుకు తలుపు తీయమంటున్నాడు?

**దృష్టయే** – హిరణ్యగర్భ దర్శనంకోసం తీయమంటున్నాడు. ఈ మంత్రం క్రమముక్తిని సూచించే గొప్ప మంత్రం.

కాని దీన్ని మనం ఈ సందర్భంనుంచి విడదీసి, జ్ఞానం పొందటానికి చేసే ప్రార్థనగా కూడా అన్వయించుకోవచ్చు. అప్పుడు ఈ పదాల అర్థాలు కొంచెం మారతాయి. మళ్ళీ ఈ మంత్రాన్ని చూస్తే, ఇలా వస్తుంది.

**సత్యమ్** – సత్యం. జ్ఞానం, అనంతం బ్రహ్మ. అంటే నిర్గుణబ్రహ్మ.

**ముఖమ్** – ద్వారం అని చూశాము. కాకపోతే ఇక్కడ ద్వారం జ్ఞానమార్గంలోకి వెళ్ళే ద్వారం. అది కప్పబడివుంది. దేనితో?

**హిరణ్మయేన పాత్రేణ** – నేను వెళ్ళాల్సిన శ్రేయోమార్గాన్ని బంగారపు వన్నెగల పాత్ర మూసేసింది. బంగారం ఇక్కడ ప్రాపంచిక సుఖాలను సూచిస్తుంది. స్వర్ణం డబ్బును సూచిస్తుంది. డబ్బు అన్ని ప్రాపంచిక కోరికలనూ సూచిస్తుంది. డబ్బు ధర్మ, అర్థ, కామాలకు సంకేతం. అందువల్ల ఇక్కడ హిరణ్మయపాత్ర అంటే ధర్మ అర్థకామ ఇచ్ఛ. ధర్మార్థ కామాలను ప్రేయస్సు అంటారు. అందువల్ల ప్రేయస్సుమీద ఇచ్ఛ. ఈ ఇచ్ఛ నన్ను జ్ఞానమార్గంలోకి వెళ్ళకుండా అడ్డుపడుతోంది. నువ్వు ఆ కోరికలను తొలగించి, నాకు వైరాగ్యం కలగజెయ్యి. ఎందుకు? నేను ఆత్మజ్ఞానం పొందాలి.

ఈ విధంగా ఈ మంత్రాన్ని ఉపాసకుడు జపించినట్టు తీసుకోవచ్చు, లేదా జిజ్ఞాసు ప్రార్థించినట్టు తీసుకోవచ్చు. కాని ఉపాసకుడు జపించటమే ఈ సందర్భంలో సరిపోతుంది. మీమాంసశాస్త్రం ప్రకారం, ఒక పదంయొక్క అర్థం చూడాలంటే అది ఏ సందర్భంలో అంటే ఏ అధ్యాయంలో వచ్చిందో కూడా చూడాలి. ఈ పదిహేనవ బ్రాహ్మణము బృహదారణ్యకంలోనే ఐదవ అధ్యాయంలో వచ్చింది. ఈ అధ్యాయం మొత్తం హిరణ్యగర్భ ఉపాసన గురించి చెబుతున్నది కాని ఆత్మజ్ఞానం గురించి కాదు. అందువల్ల ఇక్కడ సత్యం అంటే హిరణ్యగర్భ. హిరణ్యగర్భ దర్శనం కావాలి అంటున్నాడు. కాని ముందే చూసినట్టుగా, జిజ్ఞాసు కూడా ఈ ప్రార్థనను చేసుకోవచ్చు.

**పూషన్** – సూర్యదేవతను అనేక పేర్లతో వర్ణిస్తున్నది ఉపనిషత్తు. పూషన్ అంటే అన్నింటినీ పోషించేవాడు.

**ఏకర్ష** – ఒంటరిగా సంచరించువాడు. మనం కూడా సాధన మొదలుపెట్టాక, ఆ సాధన మార్గంలో ఒంటరిగా ప్రయాణించాలి.

**యమ** – ప్రాణులన్నిటినీ నియంత్రించేవాడు. సూర్యదేవుని కాంతి, శక్తి లేకపోతే భూమ్మీద ఈ జీవరాశులకు ప్రాణమే ఉండదు.

**సూర్య** – జగత్తులోని ప్రాణాలను లేదా ప్రాణుల బుద్ధిని ప్రేరేపించువాడు కనుక సూర్యుడు. సూర్యోదయంతో పాటు మనమూ లేచి మన పనిపాట్లలోకి దిగుతాము. నిజానికి మన శరీరం కూడా సూర్యోదయం అయ్యాక పని చెయ్యటానికి వీలుగా ఉంటుంది. అలాగే సూర్యాస్తమయం అయ్యేసరికి మనం పనులు తగ్గించుకుంటాము.

**ప్రాజాపత్య** – ప్రాజాపత్య అంటే ప్రజాపతియొక్క పుత్రుడు. ప్రజాపతి అంటే హిరణ్యగర్భుడు.

హిరణ్యగర్భ సమష్టి, సూర్యదేవత వ్యష్టి. అందువల్ల సూర్యదేవత హిరణ్యగర్భయొక్క పుత్రుడు. ఇంతవరకూ సూర్యదేవతకు సంబోధన. ఇప్పుడు సూర్యదేవునికి చేసే ప్రార్థన.

**వ్యూహ రశ్మీన్** – నీ కిరణాలను అడ్డు తొలగించు.

**సమూహ తేజో యత్తే రూపం కల్యాణతమమ్** – నీ తేజస్సును ఉపసంహరించు. ఎందుకంటే నీ రూపం కళ్యాణతమం. కాని నీ మిరుమిట్లు గొలిపే కాంతివల్ల నేను చూడలేకపోతున్నాను.

**తత్తే పశ్యామి** – తత్ అంటే ఆ కళ్యాణరూపాన్ని నేను చూడగలిగేలా చెయ్యి.

ఇక్కడ కూడా ఈ ప్రార్థనను జిజ్ఞాసువు చేసేటట్టయితే, ఈ తేజస్సును బాహ్యాప్రపంచంలోని ఆకర్షణలుగా తీసుకోవాలి. కళ్యాణతమమైన ఆత్మ గురించి తెలుసుకోనివ్వకుండా ఈ బాహ్యావస్తువులు ఆకర్షించి, ఆకట్టుకుంటున్నాయి. మనిషికి మూడు కోరికలుంటాయని చూశాము. అవి పుత్రైషణ, విత్తైషణ, లోకైషణ. వీటి ప్రభావం ఎంత ఎక్కువగా ఉందంటే ఆత్మైషణ కలగటం లేదు.

ఇప్పుడు ఉపాసకుని ప్రార్థన చూస్తే, అతను ఇంతవరకూ అహంగ్రహ ఉపాసన చేశాడు. అహంగ్రహ ఉపాసన అంటే హిరణ్యగర్భను తనలోనే ఆవాహన చేశాడు. భగవంతుణ్ణి శివలింగంమీదో, సాలిగ్రామంమీదో ఆవాహనచేస్తే అది భేదబుద్ధి అవుతుంది. అహంగ్రహ ఉపాసనలో అభేదబుద్ధి ఉంటుంది. ఇందులో ఆత్మజ్ఞానం ఉండదు. ఆత్మవిచారణ లేదు. అభేదదృష్టి కేవలం ఊహ మాత్రమే. నేనే ఆ భగవంతుడు అని ఊహించుకుంటాడు. అభేద ఉపాసన అంటే జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకోవటం, అభేద జ్ఞానం అంటే జీవ–ఈశ్వరుల ఐక్యాన్ని అర్థం చేసుకోవటం.

**యోఽసావసౌ పురుషస్సోఽహమస్మి** – యః అసౌపురుష అంటే సూర్యమండలంలో ఉన్న ఆ హిరణ్యగర్భ; సః అహమస్మి – నేనే. శరీరంలో మనోమయ రూపంలో ఉన్నాను. అంటే ఆ హిరణ్యగర్భే హృదయంలో ఉన్న మనస్సులో ఉన్నాడు. అది జ్ఞానంవల్ల వచ్చింది కాదు. ఉపాసన అలా అభేద భావనతో చేస్తాడు. అది కూడా మరణకాలంలో కూడా చేస్తాడు. మరణకాలంలో కూడా చేస్తేనే, ఆ ఉపాసన ఫలం దక్కుతుంది.

ఇంతవరకూ సూర్యభగవానునికి చేసిన ప్రార్థన. ఇప్పుడు అగ్నిదేవతకు చేసే ప్రార్థన. ఎందుకు అగ్నిదేవతకు ప్రార్థన చేస్తున్నాడు? అతను జీవితకాలంలో అనేక ఉపాసనలను, తన నిత్యనైమిత్తికకర్మలతో పాటు చేశాడు. ఒక గృహస్థు నిత్యనైమిత్తిక కర్మలు చేసితీరాలి. ఉపాసన చెయ్యవచ్చు, చెయ్యకపోవచ్చు. అది అతని ఇష్టం. అందువల్ల గృహస్థు కేవలం కర్మలు చెయ్యవచ్చు, లేదా కర్మ ఉపాసనల సముచ్చయం చెయ్యవచ్చు. ఆ ఉపాసనలు ఎక్కువగా హిరణ్యగర్భ ఉపాసనలుగా ఉంటాయి.

హిరణ్యగర్భ ఉపాసన, సూర్యదేవతను ప్రతీకగా తీసుకుని చేశాడు. అందువల్ల అతను ఉపాసనలు చేశాడని చెప్పటానికి ప్రత్యక్షసాక్షి సూర్యదేవత. అలాగే అతను నిత్యనైమిత్తిక కర్మలు కూడా చేశాడని చెప్పటానికి ప్రత్యక్షసాక్షి అగ్నిదేవత. ఎందుకంటే నిత్యనైమిత్తిక కర్మలన్నీ అగ్నిద్వారానే చేస్తారు. అగ్నిని ఇప్పుడు వర్ణిస్తున్నాడు.

**వాయురనిలమమృతమ్ (గచ్ఛత్)** – వాయువు అంటే వ్యష్టి ప్రాణం. శరీరంలో ఉన్న ప్రాణం ఎలా ఉంది? అనిలం, అమృతంగా ఉంది. అంటే సమష్టి ప్రాణంగా ఉంది. అనిలం కూడా వాయువే. అంటే తన శరీరంలో ఉన్న ప్రాణం, అమృతం అయిన సమష్టి ప్రాణంలో కలవాలి అంటున్నాడు. ఎప్పుడు?

**అథ ఇదం శరీరం భస్మాంతగ్మ్** – ఈ శరీరం భస్మమైపోయాక కలవాలి. కుండలో ఉన్న ఆకాశాన్ని ఘటాకాశం అంటాము; కుండ పగిలిపోతే, ఘటాకాశం మహాకాశంలో కలిసిపోతుంది. అలా నా శరీరం బూడిద అయినప్పుడు నా శరీరంలో ఉన్న ప్రాణం అనంతంగా ఉన్న హిరణ్యగర్భలో కలిసిపోవాలి అంటున్నాడు ఉపాసకుడు.

అంతేకాదు శరీరం భస్మాంతం (భవతు) అంటే శరీరం బూడిద అయినప్పుడు అంటే ఇది ఉపాసన కాండకు చెందినదే అని స్పష్టంగా తెలుస్తున్నది. ఇక్కడ జ్ఞానకాండతో సంబంధం లేదు. ఇవన్నీ గృహస్థు చేసే ప్రార్థనలు; అది కూడా కర్మ ఉపాసనల సముచ్చయం చేసిన గృహస్థు చేసే ప్రార్థనలు. సముచ్చయం అంటే రెండూ కలిపి చేసినవి.

ఉదాహరణకు విష్ణుసహస్రనామం పారాయణం మాత్రమే చేస్తే అది కేవలకర్మ కిందికి వస్తుంది. దానితో భాగంగా ధ్యానశ్లోకాలను గడగడా చదివేస్తాము. అలా కాకుండా ఆ ధ్యానశ్లోకాల అర్థం తెలుసుకుని, విష్ణుమూర్తిని మనస్సులో ఊహించుకుంటే అది ఉపాసన అవుతుంది. ధ్యానశ్లోకాలలో విష్ణుమూర్తి వర్ణన ఉంటుంది. కళ్ళు మూసుకుని ఈ రూపాన్ని ఊహించుకుని మనస్సులో ధ్యానం చేసి, తర్వాత సహస్రనామం చదివితే అది ఉపాసన+ కర్మ కలిపి చేసినట్టు అవుతుంది.

కేవలకర్మ చేసిన వ్యక్తి కృష్ణగతిద్వారా స్వర్గలోకానికి వెళతాడు. కర్మ+ఉపాసన చేసిన వ్యక్తి శుక్లగతిద్వారా హిరణ్యగర్భలోకం లేదా బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ జ్ఞానం పొంది, క్రమముక్తి పొందుతాడు. కేవల ఉపాసన ఉండదు. ఎందుకంటే కేవల ఉపాసన అంటే కర్మ మానేయాలి; కాని వానప్రస్థంలో కూడా కర్మను పూర్తిగా మానలేరు. వానప్రస్థంలో ఉపాసన ఎక్కువ, కర్మ తక్కువ ఉంటుంది. ఒక్క సన్న్యాసి మాత్రమే కర్మను మానివేయ గలడు.

కర్మ ఉపాసన సముచ్చయంలో కూడా కర్మలన్నీ అగ్నిదేవతకే చేస్తారు. ఉపాసన, కర్మలో భాగంగా వస్తుంది. అందువల్ల ఉపాసన కూడా అగ్ని సమక్షంలో అవుతుంది. కఠోపనిషత్తులో కూడా కర్మ ఉపాసన సముచ్చయం చూస్తాము – నాచికేత యజ్ఞం కర్మ; దానితో పాటు చెయ్యాల్సిన ఉపాసన విరాట్ ఉపాసన. అది నాచికేతాగ్ని విరాట్ ఉపాసన సముచ్చయం. ఇది అగ్నిదేవత ముందు జరుగుతుంది.

**ఓం క్రతో స్మర** – ఓంకారరూప అగ్నిని స్మరిస్తున్నాడు. క్రతో అంటే సంకల్ప రూపేణ అగ్ని. అతను చేసిన క్రతువులన్నీ అగ్నిదేవతకే చేస్తాడని చూశాము.

ఒక గృహస్థు జీవించినంతకాలం అగ్నిదేవతకు ఎన్నో క్రతువులు చేస్తాడు. అతను మరణించినప్పుడు, అతని శరీరాన్ని అగ్నిదేవతకే ఆహుతి చేస్తారు. అందువల్ల అంత్యక్రియలను అంత్యేష్టి సంస్కారం అంటారు. ఇష్టి అంటే యజ్ఞం; అంత్యేష్టి అంటే చివరి యజ్ఞం. అలా యజ్ఞాలు చేసిన గృహస్థు మరణం అంటే భయపడడు. దానిని కూడా ఒక యజ్ఞంలా తీసుకుంటాడు.

మనం మరణం అంటే అమంగళం అనుకుంటాము, కాని మరణం కూడా ఒక యజ్ఞం కిందకి వస్తుంది. అందువల్ల సంధ్యావందనంలో యమాయ ధర్మరాజః అని వస్తుంది. యముడు తన ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాడు.

అలా యమధర్మరాజు తన ధర్మాన్ని నిర్వర్తించి, ఆ ఉపాసకుని మరణం సంభవించాక అతని సూక్ష్మశరీరం బ్రహ్మలోకానికి వెళుతుంది. అక్కడ అతనికి కర్మఫలాన్ని భగవంతుడు ఇచ్చేముందు తను చేసిన కర్మలను, ఉపాసనలను ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి. ముందు సూర్యునికి, ఇప్పుడు అగ్నిదేవునికి ప్రార్థిస్తున్నాడు.

**కృతం స్మర** – నేను చేసిన కర్మలన్నీ గుర్తు తెచ్చుకో. అగ్నిదేవత ఎందుకు గుర్తు తెచ్చుకోవాలి? ఎందుకంటే అతను చేసిన కర్మలు, ఉపాసనలు అన్నీ అగ్ని సమక్షంలోనే చేశాడు కాబట్టి.

**క్రతో స్మర కృతగ్ం స్మర** – ఈ ప్రార్థన అతను మరణకాలంలో చేస్తున్నాడని చూశాము. అందువల్ల అతని గొంతు నీరసంగా ఉండి, అగ్నిదేవత సరిగ్గా విన్నాడో లేదోనని భయం వేసి మళ్ళీ అవే మాటలు చెబుతాడు. ఓ అగ్నీ, నేను చేసిన కర్మలన్నీ, ప్రార్థనలన్నీ గుర్తు తెచ్చుకో.

**అగ్నే నయ సుపథా** – ఓ అగ్నీ! నన్ను శోభనమార్గంద్వారా నువ్వు తీసుకువెళ్ళు గాక. శోభనమార్గం అంటే శుక్లమార్గం. ఉపాసకునికి కృష్ణగతి కూడా సుపథం కాదు, ఎందుకంటే కృష్ణగతిలో వెళ్ళిన వ్యక్తి మళ్ళీ వెనక్కి తిరిగివస్తాడు. వెళ్ళేది పుణ్యలోకానికి అయినా తిరిగివస్తాడు కాబట్టి కృష్ణగతి శోభనమార్గం కాదు.

**రాయే** – రాయే అంటే ధనంకోసం. కాని ఈ సందర్భంలో ధనం అంటే అసలు ధనం కాదు; కర్మ ఉపాసనల సముచ్చయ ఫలం. అంటే కర్మఫలం. నేను చేసిన కర్మ ఉపాసన సముచ్చయంవల్ల నాకు శుక్లగతిద్వారా బ్రహ్మలోకప్రాప్తి కలగాలి. కాని నా ప్రారబ్ధకర్మవల్లో, ఆగామికర్మవల్లో శుక్లమార్గం మూసుకుపోకుండా చెయ్యి.

**అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్** – నీకు నేను చేసిన కర్మలు, ఉపాసనలు అన్నీ తెలుసు.

**యుయోధ్యస్మజ్జుహురాణమేనః** – నువ్వు నన్ను కుటిలమైన పాపాలకు దూరం చెయ్యి. శుక్లగతి చక్కని రాజమార్గం. దానికి నన్ను దూరం చేసే పాపాలను తొలగించు. ఇది నిస్సహాయస్థితిలో చేస్తున్న ప్రార్థన. క్రమముక్తి పొందటానికి ఇది ఆఖరి అవకాశం.

**భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ** – దాని కోసం నీకు పదేపదే నమస్కారాలు చేస్తున్నాను అంటున్నాడు ఉపాసకుడు. అది కూడా సాష్టాంగ నమస్కారాలు చెయ్యలేడు. లేచి నిలబడటమే కష్టం మరణకాలంలో. అందువల్ల మాటతోనే నమస్కారం చేస్తున్నాను అంటున్నాడు. నమ ఉక్తిం అంటే నమస్కారవచనం. పైగా మరణకాలంలో మాటద్వారా కూడా నమస్కారం చెయ్యగలనో లేదో, ఇప్పుడు పెట్టే నమస్కారమే అంత్యకాలంలో పెట్టినట్టుగా భావించు అంటున్నాడు సాధకుడు అగ్నిదేవతతో. ఇది ఒక అద్భుతమైన మంత్రం.

దీనితో 15వ బ్రాహ్మణము అయిపోయింది. ఐదవ అధ్యాయము అయిపోయింది.

# అధ్యాయము 5 – సారాంశము

బృహదారణ్యకోపనిషత్తులో మూడు కాండములు ఉన్నాయి.

1. మధు కాండము – ఉపదేశ కాండము – సిద్ధాంత ప్రధానము
2. ముని కాండము – ఉపపత్తి కాండము – తర్క ప్రధానము
3. ఖిల కాండము – ఉపాసనా కాండము – ఉపాసనా ప్రధానము

మొదటి రెండు కాండములు శ్రుతియుక్తి ప్రధానంగా ఉంటాయి. ఈ ఖిల కాండములో ఉపాసనలు ఎక్కువగా ఉంటాయి.

ఈ ఐదవ అధ్యాయంలో మొత్తం 15 బ్రాహ్మణాలు ఉన్నాయి.

ఒక బ్రాహ్మణము – ఓంకార ఉపాసన
పది బ్రాహ్మణాలు – హిరణ్యగర్భ ఉపాసన
భిన్న రూపాల్లో – హృదయ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన, సత్యరూపేణ హిరణ్యగర్భ ఉపాసన
భిన్న గుణాలతో – గాయత్రీ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన, విద్యుత్ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన
నాలుగు బ్రాహ్మణాలు వేరే ముఖ్యమైన అంశాలను చర్చిస్తాయి.

బ్రాహ్మణము 2 – ప్రాజాపత్య బ్రాహ్మణము – ద, ద, ద, అనే బోధ. దమము, దానము, దయ పాటించమని బ్రహ్మ చేసిన బోధ

బ్రాహ్మణము 10 – గతి బ్రాహ్మణము – శుక్లగతి మార్గంయొక్క వర్ణన

బ్రాహ్మణము 11 – తపో బ్రాహ్మణము – అనారోగ్యాన్ని, మరణాన్ని, దహనాన్ని తపస్సుగా చూడమని చెబుతుంది.

ఇటువంటి విశ్లేషణ వేరే ఏ ఉపనిషత్తులోనూ చూడము. ప్రత్యేకించి బృహదారణ్యకంలోనే వస్తుంది. అనారోగ్యం రాగానే చిందులు తొక్కుతారు కొందరు. అలా కాకుండా దాన్ని కూడా తపస్సుగా, యజ్ఞంలా చూడమంటుంది ఉపనిషత్తు.

బ్రాహ్మణము 15 – సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణము – మరణకాలే క్రమముక్త్యార్థం ప్రార్థన.

ఇప్పుడు ఈ అధ్యాయంలో ముఖ్యమైన మంత్రాలను చూద్దాము.

5.1.1 – పూర్ణమదః పూర్ణమిదమ్
ఓం ఖం బ్రహ్మ – ఓంకారాన్ని ఆకాశరూప బ్రహ్మగా చూపించే మంత్రం.

5.2.3 – ద ద ద ఇతి దామ్యత దత్త దయధ్వమితి
భగవద్గీతలో 16వ అధ్యాయంలో శ్లోకానికి ఇది బీజం.
**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥** – గీత 16.21

5.4.1 – మహద్యక్షం ప్రథమజమ్

ఇది హిరణ్యగర్భ నిర్వచనం. శంకరులవారు తరచు వాడుతారు.

5.14.4 – ఇది పెద్ద మంత్రం కాని, రెండు వాక్యాలు గాయత్రీ గురించిన అద్భుతమైన నిర్వచనాన్ని ఇస్తాయి.
సా హైషా గయాగ్ంస్తత్రే తస్మాద్గాయత్రీ నామ
ఈ గాయత్రీ గయాలను రక్షిస్తుంది.

5.14.7 – గాయత్రీ ఉపస్థానం చెప్పిన మంత్రం.
అసావదో మా ప్రాపదితి – అనిష్టనివృత్తి ప్రార్థన
అహమదః ప్రాపమితి వా – ఇష్టప్రాప్తి ప్రార్థన

అభిచారిక కర్మ గురించి కూడా వస్తుంది కాని, దాన్ని పట్టించుకోనవసరం లేదని చూశాము. అనిష్టనివృత్తి ప్రార్థన, ఇష్టప్రాప్తిప్రార్థన రెండూ కూడా నాలుగు పురుషార్థాలకోసం చెయ్యవచ్చు. సంసారనివృత్తి కోరవచ్చు లేదా అజ్ఞాన నివృత్తి కోరవచ్చు. ఆ విధంగా ఇది అద్భుతమైన ప్రార్థన.

5.15.1 – హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్
సత్యంయొక్క ముఖం హిరణ్మయ పాత్రతో కప్పివుంది. ఈ ప్రార్థన అంతా ముఖ్యం.